

రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


ఎపిలో కుండపోత
అనేక గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
కృష్ణానదికి భారీ వరద ప్రవాహం
ప్రకాశం బ్యారేజీ 70 గేట్లు ఎత్తివేత
లోపలి పేజీల్లో


సంపుటి 28, సంచిక: 55 | గురువారం | 14-08-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00





# రాష్ట్రమంతా రెడ్ అలర్ట్

## నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు

- వాతావరణ శాఖ హెచ్చరిక
- మరో 48 గంటల పాటు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- అధికారులకు సెలవులు రద్దుచేసిన ప్రభుత్వం
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఒంటిపూట బడులు
- మరో ఐదు జిల్లాల్లో రెండురోజులపాటు సెలవులు
- హైదరాబాద్ మహానగరంలో కుండపోత వర్షం

ప్రజాపక్షం/హైదరాబాద్

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో హైదరాబాద్ వాతావరణ శాఖ తెలంగాణ అంతటికీ బుధ, గురువారాల్లో రెడ్ అలర్ట్ జారీ చేసింది. సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, మేడ్చల్, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ డైరెక్టర్ నాగరత్న తెలిపారు. హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్, జనగామ, కామారెడ్డి, కుమురంభీం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్లగొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ వార్నింగ్ జారీ చేసినట్లు తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. రాష్ట్రమంతటా గురువారం కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వివరించారు. పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో బుధవారం ఏర్పడనున్న అల్పపీడనం శుక్రవారం నాటికి మరింత బలపడనున్నట్లు వాతావరణశాఖ అంచనా వేస్తోంది. బుధవారం రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ, అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిశాయి. దీంతో పలు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. భారీ వర్షాలు కురిసినప్పటికీ ప్రభుత్వం ముందస్తు అప్రమత్తంతో దాదాపు ఎక్కడా ఎలాంటి ఆస్తినష్టం, ప్రాణనష్టం చోటు చేసుకోలేదు.. అయితే భారీ వర్షాలతో వరదలు పోటెత్తడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు కుండలను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. శాఖల వారీగా మంత్రులు సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తాజా పరిస్థితులను ఆరా తీశారు. మరో 48 గంటల పాటు యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులు, సిబ్బందిని అలర్ట్ చేశారు. ప్రాణ,ఆస్తి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారుల సెలవులను సైతం ప్రభుత్వం తరువాయి 2లో

### కృష్ణ, గోదావరి ప్రాజెక్టులకు

## భారీ వరద

నాగార్జున సాగర్ 26 గేట్లు, శ్రీశైలం ఏడు గేట్లు ఎత్తివేత

కృష్ణ, గోదావరి నదీ పరివాహక ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంది. తెలంగాణలోనూ, ఎగువ రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో రాష్ట్రంలోని ప్రాజెక్టులకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో పలు ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. కృష్ణా పరీవాహక ప్రాజెక్టులైన నాగార్జున సాగర్ 26 గేట్లు, శ్రీశైలం ఏడు గేట్లు ఎత్తారు. జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1,89,651 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 2,89,784 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు తరువాయి 2లో



కోదండరామ్, అమీర్ అలీఖాన్ ఎమ్మెల్సీ నియామకాలపై

## 'సుప్రీం' స్టే

ప్రజాపం/హైదరాబాద్

ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, అమీర్ అలీఖాన్ ఎంఎల్‌సి నియామకాలపై సుప్రీం కోర్ట్ స్టే ఇచ్చింది. ఇద్దరి నియామకాలను నిలిపివేస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎమ్మెల్సీల ఎంపిక ఉండాలని, గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ఎంఎల్‌సిలుగా ప్రమాణ స్వీకారం చేయడాన్ని కోర్టు తప్పుబట్టింది. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో తరువాయి 2లో



బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసు

## మంచులక్ష్మిని విచారించిన ఇడి

ప్రజాపక్షం/హైదరాబాద్

బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ చేసిన కేసులో టాలీవుడ్ సెలబ్రిటీలు డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) రోజుకొక్కరు హాజరవుతున్నారు. ఈ కేసులో భాగంగా నటి, నిర్మాత మంచు లక్ష్మీ ప్రసన్న బుధవారం హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఉదయం సుమారు 10:30 గంటలకు ఆమె బషీర్‌బాగ్‌లోని ఇడి ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్నారు. ఇడి ఇచ్చిన నోటీసుల్లో.. ఆమె బ్యాంక్ ఖాతాకు సంబంధించిన అన్ని స్టేట్మెంట్లను తీసుకొని రావాలని సూచించింది. ఈ మేరకు తరువాయి 2లో

## ప్రాణహాని ఉంది

### రాహుల్‌గాంధీ

- సావర్కర్ పరువునష్టం దావా కేసులో కోర్టుకు వినతి



**పూణె :** తాజా రాజకీయ పోరాటాలు, తనపై పరువు నష్టం దావా వేసిన కక్షిదారుల వారసత్వం దృష్ట్యా తాను ప్రాణహాని ఎదుర్కొంటున్నట్లు పుణె కోర్టుకు కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ తెలిపారు. తన భద్రతకు సంబంధించిన తీవ్రమైన ఆందోళన, కేసులో నిష్పాక్షిక కార్యకలాపాలు విషయంలో న్యాయస్థానం పరిగణలోకి తీసుకోవాలని ఎంపి,ఎంఎల్‌ఏల ప్రత్యేక కోర్టుకు విజ్ఞప్తి చేశారు. లండన్‌లో 2023 మార్చ్‌లో రాహుల్‌గాంధీ తన ప్రసంగంలో సావర్కర్, ఇతరులు ఉద్దేశ్యపూర్వకంగా ఒక ముస్లిం యువకుడిపై తరువాయి 12లో

# భూధార్ నెంబర్ల కేటాయింపునకు ప్రణాళికలు

- మ్యుటేషన్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి
- వినియోగదారులకు సౌకర్యవంతంగా సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- నెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా భూములకు 'భూధార్ నెంబర్'ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై సిఎం రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వారసత్వ, ఇతర మ్యుటేషన్లకు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సిఎం అధికారులకు సూచించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు సర్వే చేసిన తరువాయి 2లో

### కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై


## నిరసన ర్యాలీలు

- 4 లేబర్ కోడ్‌లు, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్
- బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం




ప్రజాపక్షం /హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తూ, రైతుల వ్యతిరేక చట్టాలను తెచ్చి రైతులకు, ప్రజలకు ప్రజా పంపిణీ పథకాలను పాతర వేసే దిశలో అడుగులు వేస్తుందని కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. అనంతరం కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు , ప్రజా వ్యతిరేక విధానలను ఉపసంహరించుకునే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. లేబర్ కోడ్లతో తరువాయి 12లో



## వ్యాన్, కంటైనర్ ఢీ

### ఏడుగురు చిన్నారులుసహా 11 మంది మృతి

**జైపూర్ :** రాజస్థాన్‌లో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. పికప్ వ్యాను, కంటైనర్ ఢీకొనడంతో 11 మంది అక్కడికక్కడే మృతిచెందారు. మరో 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారు. దౌసా జిల్లాలోని మనోహర్‌పుర్ రోడ్డులోని బాపి సమీపంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మనోహర్‌పుర్ హైవేపై భక్తులతో వెళ్తున్న ఒక ప్యాసింజర్ పికప్ వాహనం, తరువాయి 12లో

## ట్రంప్ కాల్ అత్యంత సానుకూలం

- పుతిన్‌తో చర్చించాక నాతో సంప్రదిస్తానన్నారు : జెలెన్‌స్కీ
- బెర్లిన్ నుంచి యూరప్ నేతలతో ఉక్రేన్ అధ్యక్షుడు వర్చువల్ భేటీ తరువాత అందరూ కలిసి ట్రంప్‌తో దృశ్యమాధ్యమంగా సమావేశం



**బెర్లిన్:** అలాస్కాలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో శుక్రవారం సమావేశం జరిగిన తరువాత తనతో సంప్రదిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారని ఉక్రేన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ అన్నారు. ట్రంప్‌తో తన సమావేశం అత్యంత సానుకూలంగా సాగిందన్నారు. రెండు రోజుల్లో రష్యా, ఉక్రేన్ యుద్ధంపై పుతిన్‌తో ట్రంప్ సమావేశం నేపథ్యంలో జెలెన్‌స్కీ బుధవారం జర్మనీ రాజధానీ బెర్లిన్‌కు చేరుకున్నారు. తొలుత జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్క్‌తో కలిసి 'కోవలేషన్ ఆఫ్ విల్లింగ్'' పేరుతో కూటమిగా ఉన్న యూరప్ దేశాల అధినేతలు వీడియో కాన్ఫరెన్స్‌లో సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇంగ్లండ్ ప్రధాని కీత్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రోన్, ఇటలీ ప్రధాని మెలోనీ, తదితర దేశాధినేతలు, యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఉర్సులా వోన్ డెర్ లెయన్, నాటో సెక్రెటరీ జనరల్ మార్క్ రట్టే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అలాస్కా భేటీపై తమ ఆందోళనలను పంచుకున్నారు. అనంతరం వీరంతా మెర్క్, జెలెన్‌స్కీతో కలిసి అమెరికా అధ్యక్షుడు తరువాయి 12లో



## తెలంగాణపై కేంద్రం వివక్ష

### రాష్ట్రంలో నెలకొల్పే కంపెనీలను ఎపికి బదలాయింపా!

మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణకు రాజకీయ అక్కసుతోనే కేంద్రం అన్యాయం చేస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సెమీకండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో తరువాయి 2లో


● భారత కమ్యూనిస్టు పార్టీ పిలుస్తోంది




పీడిత జనపక్షం
ఎరుపెక్కిన వందేళ్ళ మహా వృక్షం

సాంకేతిక అభివృద్ధిలో భాగంగా
మహిళలపై పెరుగుతున్న
హింసకు
వ్యతిరేకంగా పోరాడుదాం

4 వ రాష్ట్ర మహా సభలు

CPI తెలంగాణ రాష్ట్ర 4 వ మహాసభలు మేడ్చల్

భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర మహా సభలు
2025 - ఆగస్టు 19 నుండి 22, గాజులరామారం, మేడ్చల్ జిల్లా



# ప్రపంచం
WORLD NEWS

## ఉక్రేన్ యుద్ధంపై ఫోన్‌లో ఉత్తర కొరియా, రష్యా చర్చలు

**సియోల్ :** ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఫోన్‌లో మాట్లాడుకుని తమ సంబంధాలను, ఉక్రేన్‌పై యుద్ధ చర్యలపై చర్చించారని ఆయా దేశాల ప్రభుత్వ మీడియా బుధవారం తెలిపింది. అలస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్తో పుతిన్ సమావేశానికి ముందు ఇది చోటుచేసుకుంది. ఉక్రేనియన్ సైన్యం రష్యాలోని కుర్స్క్ సరిహద్దు ప్రాంతంలోకి చొచ్చుకువచ్చినప్పుడు, రష్యా బలగాలతో కలిసి పోరాడుతున్న ఉత్తర కొరియా సైనికుల ధైర్యం, వీరత్వం, ఆత్మత్యాగ స్ఫూర్తిని పుతిన్ ప్రశంసించారని ఉత్తర కొరియా అధికారిక కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ (కెసిఎన్‌ఎ) వెల్లడించింది. క్రెమ్లిన్‌ను ఉటంకిస్తూ రష్యా వార్తా సంస్థ టాస్ ' ఈ శుక్రవారం అలస్కాలో ట్రంప్‌తో జరగబోయే తన సమావేశం గురించి పుతిన్ కిమ్‌తో పంచుకున్నారు. ఉత్తర కొరియా వార్తల్లో ట్రంప్‌తో సమావేశం గురించి ప్రస్తావించలేదు.

## ఔను.. కామెరూన్‌ను అణిచివేసాం

### ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్

**డాకర్ (సెనెగల్) :** 1960లో కామెరూన్ స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత ఫ్రాన్స్ అణచివేత హింసతో కూడిన యుద్ధాన్ని నిర్వహించిందని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ మంగళవారం బహిర్గతమైన ఒక లేఖలో అంగీకరించారు. కామెరూన్ స్వాతంత్ర్య ఉద్యమంపై ఫ్రాన్స్ అణచివేతను ఒక యుద్ధంగా అధికారికంగా అంగీకరించడం ఇదే మొదటిసారి.గత నెలలో కామెరూన్ అధ్యక్షుడు పాల్ బియాకు పంపిన ఈ లేఖ, ఫ్రెంచ్‌కామెరూనియన్ చరిత్రకారుల కమిషన్ జనవరిలో విడుదల చేసిన ఒక నివేదిక తర్వాత వచ్చింది. ఈ నివేదిక ప్రకారం, ఫ్రాన్స్ 1945, 1971 మధ్య దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం కోసం పోరాటాన్ని అణచివేయడానికి భారీగా బలవంతపు తరలింపు, లక్షలాది మంది కామెరూనియన్లను నిర్బంధ శిబిరాలలో ఉంచడం, క్రూరమైన మిలీషియాలకు మద్దతు ఇచ్చింది. 2022లో రాజధాని యౌండేకు మాక్రాన్ సందర్శించినప్పుడు ఈ కమిషన్‌ను స్థాపించారు. ఇది 1960 జనవరి 1న కామెరూన్ స్వాతంత్ర్యానికి దారితీసిన ఫ్రాన్స్ పాత్రను, ఆ తర్వాత సంవత్సరాలలో దాని పాత్రను పరిశీలించింది. 'కమిషన్ చరిత్రకారులు కామెరూన్‌లో ఒక యుద్ధం జరిగిందని స్పష్టంగా తుది నిర్ధారణకు వచ్చారు. ఆ సమయంలో వలసవాద అధికారులు, ఫ్రెంచ్ సైన్యం దేశంలోని కొన్ని ప్రాంతాలలో అనేక రకాల అణచివేత హింసను నిర్వహించారు . 1960 తర్వాత కూడా స్వతంత్ర కామెరూనియన్ అధికారులు నిర్వహించిన చర్యలకు ఫ్రాన్స్ మద్దతుతో ఈ యుద్ధం కొనసాగింది' అని మాక్రాన్ లేఖలో పేర్కొన్నారు. 1958, 1960 మధ్య ఫ్రెంచ్ ఆదేశాల మేరకు జరిగిన సైనిక ఆపరేషన్‌లలో చంపబడిన స్వాతంత్ర్య నాయకులు రూబెన్ ఉమ్ న్యోబే, పాల్ మోమో, ఐజాక్ న్యోబే పంజాక్, జెరెమి న్డెలెన్ మరణాలలో ఫ్రాన్స్ పాత్రను కూడా మాక్రాన్ అంగీకరించారు. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసే వరకు కామెరూన్ ఒక జర్మన్ వలసప్రాంతంగా ఉండేది. ఆ తర్వాత అది బ్రిటన్, ఫ్రాన్స్ మధ్య విభజించబడింది. ఫ్రెంచ్‌పరిపాలనలోని భూభాగం 1960లో స్వాతంత్ర్యం పొందిందగా, దక్షిణ బ్రిటీష్ కామెరూన్లు మరుసటి సంవత్సరం సమాఖ్యలో చేరాయి.1950లలో జాతీయవాద యుపిసి పూర్తి సార్వభౌమత్వం,పునరేకీకరణ కోసం సాయుధ పోరాటాన్ని ప్రారంభించినపుడు స్వాతంత్ర్య పోరాటం మొదలైంది. స్వాతంత్ర్యం తర్వాత కూడా, ఫ్రాన్స్ మద్దతుగల ప్రభుత్వం సంవత్సరాల పాటు యుపిసితో పోరాడుతూనే ఉంది. రువాండాలో 1994లో జరిగిన నరసంహారానికి, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సెనెగల్‌కు చెందిన సాయుధుల ఊచకోతకు ఫ్రాన్స్ బాధ్యతను అంగీకరించటం వంటి ఫ్రాన్స్ వలస గతాన్ని పరిష్కరించడానికి మాక్రాన్ చేసిన మునుపటి చర్యల బాటలోనే ఈ లేఖ ఉంది. అయితే, అల్జీరియాలో ఫ్రెంచ్ సైనికులు చేసిన హింస, ఇతర దురాగతాలకు అధికారికంగా క్షమాపణ చెప్పడాన్ని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇప్పటివరకు తోసిపుచ్చారు. ఆఫ్రికాలోని తన మాజీ వలసప్రాంతాలలో ఫ్రాన్స్ ఉనికి, ముఖ్యంగా సాహెల్ ప్రాంతంలో, ఎక్కువగా వివాదాస్పదంగా మారిన సమయంలో ఈ లేఖ వెలువడింది.


## బందీలందరినీ ఒకేసారి విడుదల చేసేలా ఒప్పందం

### ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహూ

**టెల్‌అవీవ్ :** గాజాలో మిగిలిన బందీదలను దశలవారీగా కాకుండా, ఒకేసారి విడుదల చేసే సమగ్ర ఒప్పందం దిశగా కాల్పుల విరమణ ప్రయత్నాలు దృష్టి సారించాయని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు మంగళవారం సూచించారు. గత వారం అరబ్ అధికారులు అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడుతూ, మధ్యవర్తులుగా ఉన్న ఈజిప్ట్, ఖతార్ ఒక కొత్త ఒప్పందానికి సన్నాహాలు చేస్తున్నారని, దీనిలో శాశ్వత కాల్పుల విరమణ, ఇజ్రాయెల్ బలగాల ఉపసంహరించాలని, దానికి బదులుగా మిగిలిన బందీలందరినీ ఒకేసారి విడుదల చేస్తారని తెలిపారు. గత నెలలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న పరోక్ష చర్చలు విఫలమైనట్లు కనిపించాయి. అయితే, హమాస్ ప్రతినిధి బృందం కాల్పుల విరమణ చర్చల కోసం మంగళవారం కైరోకు చేరుకున్నట్లు ఈజిప్ట్ ప్రభుత్వ వార్తా నెల్ ఖహేరా న్యూస్ తెలిపింది. ఇజ్రాయెల్ తన సైనిక దాడులను హమాస్‌పైకి ఇంకా నియంత్రణలోకి రాని గాజాలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తామని హెచ్చరించింది. మంగళవారం ప్రసారమైన 'ఇజ్రాయెల్ i24' న్యూస్ నెట్‌వర్క్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బందీల గురించి నెతన్యాహూ మాట్లాడుతూ, 'నాకు వారందరూ కావాలి' అని అన్నారు. 'బందీలందరినీ, బతికి ఉన్న వారినీ, చనిపోయిన వారినీ విడుదల చేయడం అదే మనం ఇప్పుడు ఉన్న దశ.' అని పేర్కొన్నారు. అయితే, ఇజ్రాయెల్ డిమాండ్లు మారలేదని, బందీలందరూ తిరిగి వచ్చే వరకు, హమాస్ లొంగిపోయే వరకు యుద్ధం ముగియదని ఆయన అన్నారు. ఆ తర్వాత కూడా, ఇజ్రాయెల్ ఆ ప్రాంతంపై శాశ్వత రక్షణ నియంత్రణను కొనసాగిస్తుందని ఆయన చెప్పారు.

## భారత్ కొంచెం మొండిగా ఉంది

### అమెరికా



**న్యూయార్క్ :** అమెరికాతో వాణిజ్య చర్చలపై భారతదేశం కొంచెం మొండిగా ఉందని ఆ దేశ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ అన్నారు. అక్టోబర్ చివరి నాటికి అన్ని సుంకాలు, వాణిజ్య ఒప్పందాలను పూర్తి చేయడంపై ఒక ప్రశ్నకు సమాధానంగా మంగళవారం ఫాక్స్ బిజినెస్‌లో బెస్సెంట్ మాట్లాడుతూ అది ఆశించేదేనని అన్నారు. కానీ, తాము మంచి స్థితిలో ఉన్నామని భావిస్తున్నానని, ఇంకా పూర్తికాని లేదా అంగీకరించని పెద్ద వాణిజ్య ఒప్పందాలు స్విట్జర్లాండ్‌తో ఉందని, భారతదేశం కొంచెం మొండిగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి జామీసన్ గ్రీర్, న్యాయవాదుల బృందాలు వీటన్నిటిని పూర్తి చేయడంలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు.

## మరింత బలపడిన పాకిస్థాన్—అమెరికా సంబంధాలు

### బిఎల్‌ఎను విదేశీ ఉగ్రవాద సంస్థగా గుర్తించిన అమెరికా

**ఇస్లామాబాద్ :** బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్‌ఎ), ఐసిస్—ఖొరాసన్, తాలిబాన్ సహా ప్రముఖ మిలిటెంట్ గ్రూపులను ఎదుర్కోవడానికి ద్వైపాక్షిక సహకారాన్ని మరింతగా పెంపొందించుకోవటానికి పాకిస్తాన్, అమెరికా అంగీకరించాయి. పాకిస్తాన్‌కు చెందిన బిఎల్‌ఎను విదేశీ ఉగ్రవాద సంస్థగా అమెరికా, ప్రకటించిన ఒక రోజు తర్వాత, మంగళవారం ఇస్లామాబాద్‌లో జరిగిన ద్వైపాక్షిక ఉగ్రవాద వ్యతిరేక చర్చల్లో ఈ అంశాలు చర్చకు వచ్చాయి. ఈ చర్చలకు పాకిస్తాన్ ప్రత్యేక కార్యదర్శి నబీల్ మునీర్, అమెరికా విదేశాంగ శాఖలోని కౌంటర్ టెర్రరిజం విభాగం తాత్కాలిక సమన్వయకర్త గ్రెగొరీ డి. లోగెర్ఫో సహఅధ్యక్షత వహించారు. అనంతరం విడుదల చేసిన ఉమమడి ప్రకటనలో ఉభయ దేశాలు ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ ఎదుర్కోవడానికి ఉమ్మడిగా కట్టుబడినట్లు పునరుద్ఘాటించాయి.ప్రాంతీయ, ప్రపంచ శాంతిభద్రతలకు ముప్పుగా పరిణమించిన ఉగ్రవాద సంస్థలను అరికట్టడంలో పాకిస్తాన్ 'నిరంతర విజయాలను' అమెరికా అభినందించింది. ఉగ్రవాద వ్యతిరేకతకు సమర్థవంతమైన, శాశ్వతమైన విధానాలను ప్రోత్సహించడానికి ఐక్యరాజ్యసమితి సహా బహుళపక్ష వేదికలలో సన్నిహితంగా పనిచేయడానికి తమ సంకల్పాన్ని పునరుద్ఘాటించాయి. అమెరికా విదేశాంగ శాఖ బిఎల్‌ఎ,ది మజీద్ బ్రిగేడ్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థ(ఎఫ్‌టిఒ)గా గుర్తించడం ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ట్రంప్ పరిపాలన నిబద్ధతను ప్రదర్శిస్తుందని ఒక ప్రకటనలో తెలిపింది.

## బంధించిన పాలస్తీనియన్లపై లైంగిక హింస : ఐరాస

### తిరస్కరించిన ఇజ్రాయెల్



**ఐక్యరాజ్యసమితి :** బంధించబడిన పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ బలగాలు లైంగిక హింస, ఇతర ఉల్లంఘనలకు పాల్పడినట్లు 'విశ్వసనీయ సమాచారం' ఉందని ఐక్యరాజ్యసమితి చీఫ్ ఇజ్రాయెల్‌ను హెచ్చరించారు. దీనిని ఇజ్రాయెల్ ఐక్యరాజ్యసమితి రాయబారి ఆధారం లేని ఆరోపణలు అని కొట్టిపారేశారు. పలు జైళ్లు, నిర్బంధ కేంద్రం, ఒక సైనిక స్థావరం వద్ద ఇజ్రాయెల్ సైనిక, భద్రతా బలగాల ద్వారా పాలస్తీనియన్లపై జరిగిన ఉల్లంఘనల గురించి తనకు తీవ్రమైన ఆందోళన ఉందని సెక్రటరీజనరల్ ఆంటోనియో గుటెర్రెస్ రాయబారి డానీ డనోన్‌కు ఒక లేఖలో తెలిపారు. కొన్ని రకాల లైంగిక హింస విధానాలు ఐక్యరాజ్యసమితిచే నిరంతరం నమోదుచేయబడినందున, సంఘర్షణలో లైంగిక హింసపై తన తదుపరి నివేదికలో ఇజ్రాయెల్ బలగాలను దుర్వినియోగదారుల జాబితాలో చేర్చవచ్చని గుటెర్రెస్ ఇజ్రాయెల్ బలగాలను హెచ్చరించారు.

మంగళవారం ఈ లేఖను, తన సమాధానాన్ని పంచుకున్న డనోన్, ఈ ఆరోపణలు పక్షపాత ప్రచురణలలో మునిగిపోయాయని ఆరోపించారు.ఐక్యరాజ్యసమితి పరిశీలకులకు ఇజ్రాయెల్ ప్రవేశం నిరాకరించినందున, దాని బలగాలచే లైంగిక హింస విధానాలు, ధోరణులు, వ్యవస్థీకృత వినియోగం గురించి నిర్ణయాత్మక నిర్ధారణ చేయడం సవాలుగా ఉంది అని గుటెర్రెస్ లేఖలో తెలిపారు.



## దక్షిణ చైనా సముద్ర జలాల్లో మొహరించిన అమెరికా యుద్ధనౌకలు

**మనీలా :** అమెరికా తన రెండు యుద్ధనౌకలను బుధవారం వివాదాస్పద దక్షిణ చైనా సముద్రంలోని ఒక ప్రాంతంలో మొహరించింది. రెండు రోజుల క్రితం చిన్న ఫిలిప్పీన్ నౌకను అడ్డుకునే ప్రయత్నంలో రెండు చైనా నావికాదళం , తీరరక్షక దళ నౌకలు ఢీకొన్నాయి. వీడియోలో రికార్డ్ అయిన ఈ ఘటన అనేక పాశ్చాత్య, ఆసియా దేశాలలో ఆందోళన కలిగించింది. స్కాబ్‌రో షోల్, దక్షిణ చైనా సముద్రంలోని ఇతర ప్రాంతాలను అటు చైనా, ఇటు ఫిలిప్పీన్స్ రెండూ తమవేనని చెబుతున్నాయి. ఈ వివాదాస్పద జలాల్లో వియత్నాం, మలేషియా, బ్రూనై, తైవాన్ కూడా తమకు హక్కులు ఉన్నాయని చెబుతున్నాయి. స్కాబ్‌రో షోల్ నుండి సుమారు 30 నాటికల్ మైళ్ళ దూరంలో అమెరికాకు చెందిన లక్షిత క్షిపణి వినాశకారి యుఎస్‌ఎస్ హిగ్గిన్స్, సముద్ర తీర యుద్ధనౌక యుఎస్‌ఎస్ సిన్సినాటి ప్రయాణిస్తుండగా ఒక చైనా నావికాదళ నౌక వాటిని అనుసరించింది. అయితే, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఫిలిప్పీన్ తీరరక్షక దళ కమోడోర్ జె టారియేలా, అమెరికా అధికారులు, ఫిలిప్పీన్ నిఘా విమానాల నుండి అందిన సమాచారం ఆధారంగా తెలిపారు.

## సుప్రీం స్టే

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ కోటా ఎంఎల్‌సిలుగా దాసోజు శ్రవణ్, సత్యనారాయణను ప్రతి పాదించగా అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత 2024 జనవరి 13న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొఫెసర్ కోదండరామ్, అమీర్ అలీఖాన్ పేర్లను ఎంఎల్‌సి అభ్యర్థిత్వాలకు ప్రతిపాదించగా, గవర్నర్ వాటిని ఆమోదించారు. గవర్నర్ నిర్ణయంపై దాసోజ్ శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోదండరామ్, అలీఖాన్ నియామకాలను హైకోర్టు రద్దు చేసింది. మరోసారి కోదండరామ్, అలీఖాన్ పేర్లను గవర్నర్‌కు పంపగా ఆమోదించడతో వారు ఎంఎల్‌సిలుగా నియమి తులయ్యారు. ఈ క్రమంలో గవర్నర్ నిర్ణయంపై దాసోజు శ్రవణ్, సత్యనారాయణ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అయితే ఈ విషయంలో గవర్నర్ కార్యాలయం కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఆ ఇద్దరి నియామకాలను నిలిపివేస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

### సుప్రీం తీర్పు బిజెపి, కాంగ్రెస్‌కు చెంపపెట్టు : కెటిఆర్

గవర్నర్ కోటా కింద కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన ఇద్దరు ఎంఎల్‌సిలు కోదంరాం, అమీర్ అలీ నియామకం చెల్లదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బిజెపికి, కాంగ్రెస్‌కు చెంపపెట్టులాంటిదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఈ రెండు ఢిల్లీ పార్టీలు రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశాయని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ ప్రభుత్వ ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండగానే మరో ఇద్దరి పేర్లను సిఫారసు చేసి, సిఎం రేవంత్ రెడ్డి తన బిసి వ్యతిరేక వైఖరిని చాటుకున్నారన్నారు. అధికారం కోసం ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ వ్యవస్థలను తుంగలో తొక్కిన పార్టీల అప్రజాస్వామిక విధానాలు ఎంతమాత్రం సాగనివ్వమని సుప్రీంకోర్టు తన తీర్పుతో చాటి చెప్పిందని కెటిఆర్ పేర్కొన్నారు.

## అప్రమత్తంగా ఇరిగేషన్ అధికారులు

ప్రాజెక్టులు, ఆనకట్టలు, కాలువలు, చెరువులపై నిఘాపెట్టాలి : మంత్రి ఉత్తమ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో భారీ, అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటి పారుదల శాఖాధికారులంతా అప్రమత్తంగా ఉండాలని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి బుధవారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టులు,అనకట్టలు, కాల్వలతో పాటు చేరువులపై నిఘా పెంచాలని, విపత్తు సూచనలు కనిపిస్తే వెంటనే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సూచించారు. క్షేత్రస్తాయిలో తాజా పరిస్థితిలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కే. శ్రీనివాస్, ఇ.ఎన్.సి అంజద్ హుస్సేన్‌లతో పాటు ఆయా జిల్లాల సి.ఇలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. నీటిపారుదల శాఖలో అన్ని విభాగాలకు సెలవులు రద్దు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. నీటి పారుదల శాఖలో లష్కర్ నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ విధి నిర్వహణలో ఉండాలని అదేశించారు. ప్రాజెక్టులు, అనకట్టలు, కాల్వలతో పాటు చెరువుల భద్రతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిఘా పెంచాలని ఆయన సూచించారు. చెరువులు నిండిన వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలి..కాలువలకు, చెరువులకు ఎక్కడైనా గండ్లు పడితే వెంటనే నష్టాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.తాజా పరిస్థితులపై కలెక్టర్లకు నీటి పారుదల ఉన్నతాధికారులకు నిరంతరం సమాచారం అందించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, చెరువులు, కాలువల పరిస్థితులతో పాటు కృష్ణ, గోదావరి నదులు, ఉప నదులు ఇన్ ఫ్లో, ప్రాజెక్టుల నీటి మట్టాలపై ఆరా తీసినమంత్రి పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కాగా రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో విపత్తుల నిర్వహణ శాఖ ఆయా జిల్లాల్లో ఇరిగేషన్, విద్యుత్, పంచాయితీరాజ్, రహదారులు, పోలీస్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార,పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున స్థానిక పరిస్థితులపైన ఆయా జిల్లా కలెక్టర్లతో పొంగులేటి గురువారం మాట్లాడారు. భారీ వర్షాలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపు ప్రాంతాల్లో ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూములు నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. హనుమకొండ, వరంగల్ , జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి తదితర జిల్లాలపై ఎక్కువ దృష్టి సారించాలని అన్నారు. ప్రజా జీవనానికి ముఖ్యంగా రాకపోకలకు ఆటంకం లేకుండా చేయాలన్నారు.



## భారీ వరద

(మొదటి పేజీ తరువాయి)

హెడ్ రెగ్యులేటరీ నుంచి 35,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,336 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఏడు స్పిల్‌వే గేట్ల ద్వారా 1,89,133 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.70 అడుగులకు చేరింది. ఇక నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కు శ్రీశైలం నుంచి 2,32,415 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లోగా ఉండగా, కుడి ఎడమ, కాలువలు, క్రస్ట్ గేట్లు, జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 27,3915 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు బుధవారం సాయంత్రానికి 588.90 అడుగులుగా ఉన్నది. ఇప్పటికే నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తూ ప్రాజెక్టు నీటిమట్టం 588.90 అడుగులుగా ఉండటం ఇన్ ఫ్లో భారీ స్థాయిలో వస్తూ ఉండటంతో బుధవారం ఉదయం 4 గేట్లను 10 అడుగులు 22 గేట్లను 5 అడుగుల మేర పైకి లేపి 23,5150 క్యూసెక్కుల నీటిని క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. పది రోజులలో వ్యవధిలో ప్రాజెక్టు మొత్తం 26 గేట్లు తెలుసుకోవడం ఇది రెండవసారి.

### గోదావరికీ భారీగా వరద ప్రవాహం

ఇదిలా ఉండగా గోదావరి నదీ పరివాహక ప్రాజెక్టుల్లోనూ వరద ప్రవాహం పెరుగుతోంది. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 743 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఒక గేటును ఎత్తివేసి 2049 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 360.56 మీటర్లు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ఇదే జిల్లాలోని కడెం జలాశయానికి భారీగా వరద నీరు చేరుతోంది. అధికారులు అప్రమత్తమై రెండు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 700 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 695.300 అడుగులకు చేరింది. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్ హౌస్ నుంచి గోదావరి నదీ జలాల ఎత్తిపోతలు ప్రారంభించారు. మూడు బాహుబలి పంపులతో 9,450 క్యూసెక్కుల జలాలను ఎత్తిపోస్తున్నారు. ఇక్కడి నుంచి మధ్యమానేరు ప్రాజెక్టుకు ఎస్‌ఆర్‌ఎస్‌పి వరద కాలువ ద్వారా నీటిని తరలిస్తున్నారు. శ్రీపాద సాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి లభ్యత మేరకు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎత్తిపోతలు చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. భారీ స్థాయిలో కాలువలు ద్వారా గోదావరి జలాలు ప్రవహించడంతో ఈ ప్రాంతంలో జలకళ సంతరించుకుంది.

## కేంద్రం వివక్ష

(మొదటి పేజీ తరువాయి)

వివక్ష చూపించి, రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమను చూపిస్తుందం టూ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన కేంద్రంపై మండిపడ్డారు. ''ప్రపంచ స్థాయి అధునాతన సిస్టమ్ అండ్ ప్యాకేజింగ్ ఫెసిలిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. మహేశ్వరంలో 10 ఎకరాల భూమి కేటాయించాం. అన్ని రకాల సబ్సిడీలకు ఆమోదం తెలిపాం. రికార్డు సమయం లో అన్ని అనుమతులిచ్చాం. ఇండియా సెమీకండక్టర్ మిషన్ తుది ఆమోదం లభిస్తే పనులు మొదలు పెట్టేందుకు సదరు ఇన్వెస్టర్ సిద్ధంగా ఉన్నారు. అయినా... కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు'' అని విమర్శించారు.

### ఆంధ్రకు ఎలా కేటాయిస్తారు....

అన్ని రకాలుగా అర్హతలున్నా తెలంగాణను విస్మరించి కనీస సంసిద్ధత లేని ఆంధ్రప్రదేశ్‌కు ప్రాజెక్టును ఎలా కేటాయిస్తారని మంత్రి శ్రీధర్ బాబు కేంద్రాన్ని ప్రశ్నించారు. న్యాయ విరుద్ధమై న ఈ నిర్ణయం పెట్టుబడిదారులకు తప్పుడు సంకేతాలను పంపే ప్రమాదముందన్నారు. ఇలాంటి రాజకీయ ప్రేరేపిత నిర్ణయాలు దేశ పారిశ్రామికాభివృద్ధికి మంచిది కాదన్నారు. అందుకే ఈ నిర్ణయాన్ని మరో సారి పున:పరిశీలించాల్సిన అవసరముందన్నారు. వాస్తవ పరిస్థితులను పరిగణలోనికి తీసుకుని తెలంగాణకు మేలు చేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని ఆయన 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి జోక్యం చేసుకుని తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి. న్యాయం జరిగేలా చొరవ చూపాలి. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన తెలంగాణ బీజేపీ ఎంపీలు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికీ స్పందించకపోతే తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారు. రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారు' అని హెచ్చరించారు.

## రాష్ట్రమంతా రెడ్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

రద్దు చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో పాఠశాలలకు ఒంటిపూట, మరో 5 జిల్లాలో రెండు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. మరో మూడు వర్షా లు కురిసే అవకాశం ఉండడంతో నేడు కూడ సెలవులు కొనసాగనున్నాయి.

### రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు

రాష్ట్రంలో అత్యధికంగా సూర్యాపేట జిల్లాలోని మమిళ్లగూడెంలో అత్యధికం గా 100.5 మి.మి. వర్షపాతం నమోదైంది. ఆత్మకూర్‌లో 95.0, రంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలో 93,5 మి.మి, హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో 87.0 మి.మి., సూర్యాపేట మేళ్లాచెరువు 86.3 మిమి. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో 85.3 మిమి వర్షం కురిసింది. పలు ప్రాం తాల్లో బుధవారంసాయంత్రం 6 గంటల వరకే 50 మిమి. నుంచి 83 మి.మి. వరకు వర్షపాతం నమోదైంది. ఖమ్మం భద్రాద్రి కొత్త గూడెం, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మెదక్, మేడ్చల్— మల్కాజ్‌గిరి, ములుగు, సంగారెడ్డి, సూర్యాపేట, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో అతి భారీ నుంచి అంత్యంత భారీ వర్షాలు కురిశాయి. ఆదిలాబాద్, హన్మకొండ, హైదరాబాద్, జనగాం, కామారెడ్డి, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట్, వరంగల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. జగిత్యాల, జో గులాంబ గద్వాల,కరీంనగర్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న,సిరిసిల్ల, వనపర్తి జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. **గ్రేటర్‌లో భారీ భారీవర్షం :** బుధవారం గ్రేటర్ హైదరాబాద్‌లో పలు ప్రాంతాలో భారీ వర్షం కురిసింది. దీంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.. ఉదయం నుంచే పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో ఉద్యోగులు విద్యార్థులు తీవ్ర ఇబ్బందు లు పడ్డారు. గచ్చిబౌలి, లింగంపల్లి, మియాపూర్, చందనగర్, రాయదుర్గం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, అమీర్‌పేట్, బో రబండ, ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ, లకీడ్కాపూల్, నాంపల్లి, కోఠి, బేగంబజా ర్, ఫ్యాట్నీ, ప్యారడైజ్, సికింద్రాబాద్, తిరుమలగిరి, బోయిన్‌పల్లితో పాటు నగర శివార్లలో భారీ వర్షం కురిసింది..భారీ వర్షాల నేపథ్యంలో ప్రభు త్వం ఒంటిపూట బడులను నిర్వహించారు. అయితే మధ్యాహ్నం వేళా పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురువడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లేందుకే ఇబ్బందులు పడ్డారు. మరో రెండు రోజుల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావర ణ కేంద్రం హెచ్చరికలు జారీ చేయడంతో జీహెచ్‌ఎంసిఅప్రమత్తం సమస్త యంత్రాంగం అప్రమత్తమైంది. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మొ దలు జోనల్, డిప్యూటీ కమిషనునర్రల, వార్డు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తు ప్రజలను అప్రమత్తం చేశారు.కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశాలతో జోనల్, సర్కిల్ , వార్డులలో సంబంధిత జోనల్ కమిషనర్‌లు, డిప్యూటీ కమిషనర్‌లు , వార్డు అధికారులు ఆస్తి , ప్రాణనష్టం జరగకుండా ముందుజాగ్ర త్త చర్యలు తీసుకున్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జీహెచ్‌ఎంసి సర్వసన్నద్ధమైంది.వాటర్ లాగింగ్ పాయింట్ ల పై దృష్టి ప్ర త్యేక దృష్టి సారించిన బల్దియా వరద నీటిని ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు దెబ్బతిన్న రోడ్లను పునరుద్దరించారు. రోడ్లపై ప్రయాణికులు ఇబ్బందులు పడుకుండ చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ కు అంతరాయం కాకుం డా పోలీస్, హైడ్రా లతో సమన్వయం చేసుకుంటు సహాయ చర్యలను చేపట్టారు. మరోవైపు జిల్లా కలెక్టర్ హరిచందన మూసి పరివాహక ప్రాంతాల్లో సందర్శించి లొతట్టు వాసులను అప్రమత్తం చేశారు.

**యువకుడిని కాపాడిన హైడ్రా సిబ్బంది :** పాతబస్తీలోని యాకుత్‌పురా రైల్వే స్టేషన్ సమీపంలో వరద కాలువలో కొట్టుకుపోతున్న ఓ యువకుడిని హైడ్రా సిబ్బంది బుధవారం కాపాడారు. స్థానికంగా నివాసముండే గౌస్(35) మేకల మేతకోసం చెట్టు కొమ్మలను తీసుకువచ్చేందుకు ప్రమాదవసాత్తు వరద కాలువలోకి జారిపడ్డారు. దీనిని గమనించిన హైడ్రా సిబ్బందితో పాటు హైడ్రా ఇన్స్‌పెక్టర్ బాలగోపాల్ హుటాహుటిన సిబ్బందితో అక్కడకు చేరుకుని గౌసు కాపాడారు.

## కేటాయింపునకు ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం రెగ్యులర్ సర్వేయర్లు వాటిని స్క్రూటినీ చేసేలా చూడాలని ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో నూతనంగా నిర్మించనున్న 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను సిఎం పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులు ఉండాలని, కార్యాయాలు పూర్తిగా ప్రజలకు స్నేహపూర్వక వాతావరణంలో సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని సిఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈనెలాఖరులోగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగరంలోని హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టులలోని సమస్యలను త్వరగా పరిష్కరించాలని సిఎం అధికారులకు సూచించారు. సమీక్షలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సిఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, కె.ఎస్.శ్రీనివాసరాజు, సిఎం కార్యదర్శి మాణిక్ రాజ్, సిసిఎల్‌ఎ కార్యదర్శి డి.ఎస్.లోకేశ్ కుమార్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## మంచులక్ష్మి ని విచారించిన ఇడి

(మొదటి పేజీ తరువాయి)

మంచు లక్ష్మి ఈ బ్యాంక్ స్టేట్మెంట్ తీసుకుని వచ్చారు. యోలో 247 అనే బెట్టింగ్ యాప్‌ను ఆమె ప్రమోట్ చేసారు. అలాగే దీనికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియా ప్లాట్ఫామ్లలో పోస్ట్ చేశారు. దీంతో కేసు నమోదు చేసిన తెలంగాణ పోలీసులు ఆమెను విచారించిన విషయం తెలిసిందే. ఆర్థిక లావాదేవీలు అత్యధికంగా ఉన్నాయని తేలడంతో.. ఈ కేసులోని ఇడి రంగ ప్రవేశం చేసింది. బెట్టింగ్ యాప్స్ సంస్థల నుంచి ఆర్థికపరమైన లావాదేవీలపై మంచు లక్ష్మి ని ఇడి అధికారులు విచారించి వాంగ్మూలం రికార్డు చేశారు. ఇదిలా ఉంటే ఈ కేసులో ఇప్పటికే నటుడు ప్రకాష్ రాజ్, హీరో విజయ్ దేవరకొండ, దగ్గుబాటి రాణా ఇడి అధికారులు ముందు విచారణకు హాజరయ్యారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో నమోదైన ఐదు వేర్వేరు ఎఫ్‌ఐఆర్‌ల ఆధారంగా ఈడీ ఈ కేసులో దర్యాప్తు చేస్తోంది. పబ్లిక్ గ్యాంబ్లింగ్ యాక్ట్1867ను ఉల్లంఘించి, అక్రమ బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించారన్న ఆరోపణలతో సుమారు 29 మంది నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఇడి మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద కేసు నమోదు చేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆపత్కాలంలో ప్రజలకు అండగా ఉండండి

కాంగ్రెస్ శ్రేణులకు టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో భారీ వర్షాలతో రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు ఉన్నాయని, ఆపత్కాలంలో ప్రజలకు అండగా ఉండాలని కాంగ్రెస్ శ్రేణులకు టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం సర్వశక్తులు ఒడ్డి పని చేస్తుందని, సహాయక చర్యలలో ప్రభుత్వ సిబ్బందికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలన్నారు. భారీ వర్షాలతో అనేక లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, ప్రజలు, ప్రధానంగా పిల్లలు, మహిళలు, వృద్ధులు వరదలతో చాలా కష్టపడుతున్నారని, వారికి సహాయ సహకారాలు అందించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ఎక్కడికక్కడ ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజలను, వరద బాధితులను ఆదుకోవాలని సూచించారు. ముంపునకు గురైన ప్రాంతాలలో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది, రెవెన్యూ, హైడ్రా తదితర శాఖలు చేస్తున్న సేవలకు కాంగ్రెస్ శ్రేణులు తమ వంతు బాధ్యతగా సహకారం అందించాలన్నారు. ముంపు ప్రాంతాలలో ప్రజలకు మంచి నీరు, పాలు, ఆహార పదార్థాలు, అవసరాలు ఉంటే అందించాలన్నారు.

## బిజెపి అంగసంస్థగా ఎన్నికల సంఘం

దొంగ ఓట్లతోనే కేంద్రంలో బిజెపి అధికారంలోకి....

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హనుమకొండ :** బిజెపి అంగసంస్థగా కేంద్ర ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తుందని, దొంగ ఓట్లతోనే కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం సిపిఐ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 20, 21, 22 తేదీల్లో మేడ్చల్ జిల్లాలో జరిగే సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల జయప్రదానికై హన్మకొండ వెయ్యి స్తంభాల గుడి నుండి ఆర్ట్స్ కాలేజీ వరకు బైక్ ర్యాలీ చేపట్టిన జరిగింది. ఈ బైక్ ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరై జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపి అంగసంస్థగా కేంద్ర ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తూ దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా నుండి ఓటర్లను తొలగించడం మరియు కొత్త ఓటర్లను సృష్టించడం జరిగిందని, ఈ దొంగ ఓట్లతోనే కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిందని అన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తీరు ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని వారు అన్నారు. దేశంలో పాలకులు మతం పేరుతో, కులం పేరుతో ప్రజలను విడదీస్తూ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. గడిచిన ఈ మూడేళ్లలో బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద, ఫాసిస్టు విధానాలను వెలుగులోకి తీసుకురావడంలో



కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషించారన్నారు. దేశంలో బిజెపికి వచ్చిన వ్యతిరేక భయంతో కేంద్ర ఎన్నికల కమిషన్‌తో కుమ్మక్కై దొంగ ఓట్లను సృష్టించుకోని అధికారంలోకి రావడం జరిగిందని ఆరోపించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో వేలాది మంది బలిదానం చేసిన వీరోచిత పోరాటాల చరిత్ర సిపిఐ సొంతం అని, పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జరుగుతున్న రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 20 నుంచి 22 తేదీ వరకు మూడు రోజులు పాటు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో ఘనంగా జరగనున్నాయని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ బైక్ ర్యాలీ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, ఎన్ఎ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం, నకీర్త ఓదెలు, ఎదునూరి వెంకట్రాజం, నేదునూరి రాజమౌళి, జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, మాలోత్ శంకర్, కొట్టె వెంకటేష్, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, కామెర వెంకట రమణ, గుంటి రాజేందర్, దామెర సుదర్శన్, యాళ్ళ సంజయ్, కండె నర్సయ్య, అలవాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్రో చైర్మన్‌కు ఒయు డాక్టరేట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్‌కు ఉస్మానియా విశ్వవిద్యా లయం(ఒయు) 'గౌరవ డాక్టరేట్'ను ప్రకటించింది. ఈ నెల19న ఒయులోని ఠాగూర్ ఆడిటోరియంలో జరగనున్న ఒయు '84వ స్నాతకోత్సవం'లో ఒయు కులపతి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా నారాయణన్‌కు (డాక్టరేట్ ఆఫ్ సైన్స్) 'గౌరవ డాక్టరేట్' అందించనున్నట్లు ఒయు ఉప కులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం వెల్లడించారు. ఒయు పాలక మండలి నిర్ణయాలను హైదరాబాద్, ఒయులోని గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రొఫెసర్ కుమార్ వెల్లడించారు. ప్రపంచానికి, దేశానికి ఆయా రంగాల్లో విశిష్ట సేవలందించిన అత్యంత ప్రతిష్ఠాత్మక వ్యక్తులకు ఉస్మానియావిశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్లు అందించి, సత్కరిస్తుందని, ఇందులో భాగంగా ఇప్పటి వరకు రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, రవీంద్రనాథ్ ఠాగూర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సి.రాజగోపాలాచారి, బాబూ రాజేంద్రప్రసాద్, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, యాసర్ ఆరాఫత్, డాక్టర్ వై. నాయుడమ్మ, డాక్టర్ మన్మోహన్‌సింగ్, శంతను నారాయణ్, జస్టిస్ ఎన్.వి రమణ సహా 49 మంది ప్రముఖులను గౌరవ డాక్టరేట్లతో సత్కరించామని, ప్రస్తుత 84వ స్నాతకోత్సవం సందర్భంగా 50వ గౌరవ డాక్టరేట్‌ను ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ కు ఇవ్వాలని ఒయు పాలకమండలి నిర్ణయించిందన్నారు. ఒయు స్నాతకోత్సవం డాక్టర్ నారాయణన్ ప్రసంగిస్తారన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, 84వ స్నాతకోత్సవం ఉస్మానియా విశ్వవిద్యాలయ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుందన్నారు. స్నాతకోత్సవంలో భాగంగా 2022– 23వ విద్యాసంవత్సరానికి గాను 58 బంగారు పతకాలు, 2023–24 విద్యా సంవత్సరానికిగాను 63 బంగారు పతకాలను అందించనున్నామని, మొత్తంగా 121 బంగారు పతకాలను విద్యార్థులు అందుకుంటారని ప్రొఫెసర్ కుమార్ మొలుగరం తెలిపారు. నవంబర్ 1వ తేదీ 2023 నుంచి ఈ నెల 12వ తేదీ వరకు పిహెచ్‌డిలు పూర్తి చేసిన వారిలో రికార్డ్ స్థాయిలో 1261 మంది విద్యార్థులు పట్టాలు అందుకుంటారన్నారు. ఒయు 108 ఏళ్ల చరిత్రలో మొట్టమొదటిసారిగా కులపతి, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ పేరుతో గిరిజన విద్యార్థులకు ఆంగ్లంలో అత్యుత్తమ పిహెచ్‌డి డిగ్రీకి బం గారు పతకాన్ని ప్రవేశపెడుతున్నామ న్నారు. తెలంగాణ రాష్ట్ర కమిషనర్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ దేవసేన తండ్రి పేరుతో బంగారు పతకాన్ని అందించేందుకు ముందుకు వచ్చారని, ఎంబిఎ ఫైనాన్స్‌లో ప్రొఫెసర్ సముద్రాల సత్యనారాయణ మూర్తి స్మారక బంగారు పతకాన్నిఈ ఏడాది నుంచి అందిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో ఒయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేష్‌రెడ్డి, ఒఎస్‌డి ప్రొఫెసర్ జితెంద్రకుమార్‌నాయక్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శశికాంత్, విభాగాల డీన్లు, ప్రిన్సిపల్స్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

19న ఒయు 84వ స్నాతకోత్సవం



## యువతిపై సామూహిక అత్యాచారం



**ప్రజాపక్షం/జనగామ :** నమ్మి వెంట వచ్చిన స్నేహితురాలిపై యువకులు సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. జనగామ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏసీపీ పండరి చేతన్ తెలిపిన వివరాల ప్రకారం జనగామ ప్రాంతానికి చెందిన ఓ బాధితురాలిని స్నేహం, ప్రేమ పేరుతో కార్లో ఎక్కించుకుని సూర్యాపేట రోడ్డులో గల టీ వరల్డ్ వెనకాల ఉన్న ఒక రూమ్‌లో ఒకరి తర్వాత ఒకరు అత్యాచారం చేశారు. ప్రేమ పేరుతో వంచించి గోవాకు తీసుకెళ్లి పలుమార్లు అఘాయిత్యం చేశారు. ఈ విషయాన్ని నిందితులు కూడా ఒప్పుకోవడం జరిగింది. ఈ విషయం తెలిసిన బాధితురాలి చిన్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి చిన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఈ అత్యాచారానికి పాల్పడిన 10 మంది నిందితులు జనగామకు చెందిన మహ్మద్ ఒవైసీ, ముత్యాల పవన్‌కుమార్, బొద్దుల శివకుమార్, నూకల రవి, జెట్టి సంజయ్, ఎండీ అబ్దుల్ కయ్యూ, పుస్తకాల సాయితేజ, ముత్తాడి సుమంత్‌రెడ్డి, గుండ సాయిచరణ్‌రెడ్డి, ఓరుగంటి సాయిరాంలను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుండి 3 సెల్‌ఫోన్స్, ఒక టయోటా కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన జనగామ ఇన్స్‌పెక్టర్ దామోదర్‌రెడ్డి, ఎస్ఐ భరత్, ఎన్ చెన్నకేశవులు, కానిస్టేబుల్స్ రామకృష్ణ, కరుణాకర్, కృష్ణ, మహేందర్, అరవింద్, చరణ్, ఏసీపీ ఆఫీస్ రైటర్ మాధవ్‌కుమార్, అర్చన, సల్మాన్, నాగేష్‌లను పోలీస్ కమిషనర్ సన్‌ప్రీతి సింగ్ అభినందించారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు

అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు దిశా నిర్దేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. బుధవారం గోల్కొండ కోటను సందర్శించి సిఎస్ వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో కలిసిఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ అతిథులకు ఎక్కడ కూడా ఇబ్బందులు అసౌకర్యం కలగకుండా వేడుకలు అత్యంత ఘనంగా, గౌరవప్రదంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ప్రోటోకాల్, భద్రత, ప్రజల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రతిభావంతమైన పోలీసు సిబ్బందికి పతకాలు ప్రదానం చేసే కార్యక్రమం, గార్డ్ ఆఫ్ ఆనర్, మార్చ్ ఫాస్ట్ తీరును సమీక్షించారు. వాతావరణ సూచనల ప్రకారం వర్షాల నేపథ్యంలో ఆ దిశగా ప్రాధాన్యత ఇవ్వాలని, వాటర్‌ప్రూఫ్ షెడ్లు, మెడికల్ క్యాంపులు, గ్యాలరీలు, సీటింగ్ కెపాసిటీ, బారికేడ్స్ అలాగే వాటర్‌ప్రూఫ్ జనరేటర్, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్స్, ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాట్లపై సంబంధిత అధికారులు సిఎస్‌కి వివరించారు. ముఖ్యంగా ప్రోటోకాల్ తప్పక పాటించాలని, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సౌకర్యాలు, ఈ ప్రాంతంలో ప్రజలు సులభంగా రాకపోకలు సాగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీటి అందుబాటు, పారిశుద్ధ్యం, వైద్య సిబ్బంది, ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలు అందుబాటులో ఉండాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. విద్యుత్, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, రెవెన్యూ, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు తమ ఏర్పాట్లు పూర్తయ్యాయని నివేదించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, అడిషనల్ సిపి విక్రమ్ సింగ్ మాన్, డిజిపి డాక్టర్ జితేందర్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఐ అండ్ పి ఆర్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, అదనపు డిజిపి మహేష్ భగవత్, అదనపు డిజిపి సంజయ్ కుమార్ జైన్, అదనపు పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) వి.ఎస్. మాన్, డిజి ప్రిజన్స్ సౌమ్య మిశ్రా, డిజి ఫైర్ సర్వీసెస్ నాగిరెడ్డి, ప్రోటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, విద్యుత్, జిహెచ్ఎంసి, ప్రోటోకాల్, రెవెన్యూ, హెచ్ఎండిఏ, సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కోతుల భయంతో బిల్డింగ్‌పై నుంచి దూకి ఇంటర్ విద్యార్థిని మృతి



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** కోతులు మీదకు వస్తున్నాయనే భయంతో ఓ విద్యార్థిని భవనంపై నుంచి దూకింది. తీవ్ర గాయాలవడంతో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నవనీత తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన గణేష్ కవిత దంపతుల కుమార్తె కావేరి ఆర్మూర్ మునిసిపల్ కేంద్రంలోని తిరుమల కాలనీలోగల కెజిబివి కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈనెల 5వ తేదీన ఉదయం మూడు గంటల ప్రాంతంలో హాస్టల్ బిల్డింగ్‌లో ఉంటున్న విద్యార్థిని కాలకృత్యాల కోసం పైకి వెళ్లింది. బిల్డింగ్‌పై కోతుల మందను చూసిన కావేరి ఒక్కసారిగా ఉలిక్కిపడి భవనంపై నుంచి దూకేసింది. గమనించిన విద్యార్థులు స్థానికుల సహాయంతో హుటాహుటిన కావేరిని నిజామాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ విద్యార్థి బుధవారం ఉదయం మృతి చెందింది. విద్యార్థిని మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

## నీటి పంపింగ్‌ను ప్రారంభించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ప్యాకేజ్ 6 వద్ద ఉన్న నంది పంప్‌హౌస్‌లోని మోటార్లను ఆన్‌చేసి నీటి పంపింగ్‌ను ప్రారంభించాలని, తద్వారా మిడ్‌మానేరు, అన్నపూర్ణ (అంతగిరి), రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ తదితర రిజర్వాయర్లను నింపాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు హరీశ్‌రావు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి బుధవారం లేఖ రాశారు. ఆయా రిజర్వాయర్ల పరిధిలోని చెరువులను, చెక్ డ్యామ్‌లను అన్నింటినీ నింపి సుమారు 5 లక్షల ఎకరాల కు నీటిని అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. శ్రీ పాద ఎల్లంపల్లి రిజర్వాయర్ పూర్తి నీటి సామర్థ్యం 20 టిఎంసిలు కాగా, ప్రస్తుతం సుమారు 14 టిఎంసిల నీటి లభ్యత ఉన్నదని, కడెం నుండి దాదాపు 22,300 క్యూసెక్కుల వరద ఉన్నదని, అలాగే శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో (ఎస్ఆర్ఎస్‌పి) పూర్తి నీటి సామర్థ్యం 80 టిఎంసిలు ప్రస్తుతం సుమారు 45 టిఎంసిల నీటి లభ్యత ఉన్నదని పేర్కొన్నారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్లపై ఆయకట్టు పరిధిలో 5లక్షల ఎకరాలు సాగు అయిన విషయం గుర్తించి, ప్రస్తుత వానాకాలం పంటకు వచ్చే యాసంగి పంటకు కూడా సాగు నీరు అందించేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని సూచించారు. తద్వారా వాటి అనుసంధానంగా నిర్మించిన కాలువలు, చెరువులు చెక్ డ్యామ్‌ల అన్నింటిని నింపి రైతుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించాలని రైతు సాగు ప్రయోజనాల దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా వెంటనే నీటి పంపింగ్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు కోరారు.

## అందరూ ఆస్పత్రుల్లోనే ఉండాలి

వైద్య సిబ్బందికి మంత్రి దామోదర ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, ఆర్ఎంఒలు, మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు, సిబ్బంది మూడు రోజుల పాటు కచ్చితంగా హాస్పిటల్స్‌లోనే ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. అందరి సెలవులనూ రద్దు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అంబులెన్సులు, 102 వాహనాలు అన్ని సిద్ధంగా ఉంచుకోవాలని, ఎక్కడ ఎమర్జెన్సీ ఉన్నా,అక్కడికి తక్షణమే వెళ్లి పేషెంట్లను తరలించేందుకు డ్రైవర్లు, ఇఎంటిలను 24 గంటలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం టెలీ కాన్ఫరన్స్ నిర్వహించారు.అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు, గర్భిణులకు తక్షణమే వైద్య సేవలు అందించాలని,ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్ దగ్గరగా ఉన్న గర్భిణులను హాస్పిటల్స్‌లోని బర్త్ వెయిటింగ్ రూములకు తరలించి, వారికి సేవలందించాలని సూచించారు. హాస్పిటల్స్‌లో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, పవర్ కట్ అయిన మరుక్షణమే జనరేటర్లను ప్రారంభించి రోగులకు ఇబ్బంది లేకుండా తగిన చికిత్స అందించాలని ఆదేశించారు. ఎలక్ట్రీషియన్లను 24 గంటలు హాస్పిటల్స్‌అందుబాటులో ఉంచుకోవాలని, భారీ వర్షాల నేపథ్యంలో హాస్పిటల్స్ లోపలికి నీరు చేరకుండా, నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులంతా మూడు రోజులు పాటు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.

## ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కళాశాలలో బిటెక్, ఎంటెక్, డిగ్రీ, పిజి కోర్సులు చదివే 14 లక్షల మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కను కోరారు. ఈ మేరకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో ఆర్.కృష్ణయ్య బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఫీజు బకాయిల అంశాన్ని భట్టికి వివరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజులను చెల్లించాలని కళాశాల యాజమాన్యాలు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులపైన ఒత్తిడి పెంచుతున్నాయని, కోర్సు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లను కూడా ఇవ్వడం లేదని వివరించారు. సర్టిఫికెట్లు లేకపోవడంతో కొందరు ఉద్యోగాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిజి కోర్సులలో సీట్లు పొందిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని సక్రమంగా అమలు చేయకపోవడంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందన్నారు. బిసి విద్యార్థులకు పూర్తి ఫీజుల స్కీమును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ యూనివర్సిటీలు విచ్చలవిడిగా అనుమతినిస్తూ విద్యావ్యవస్థను ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం నాయకులు నీల వెంకటేష్, జిల్లపల్లి అంజి, భుపేష్ సాగర్, సి.రాజేందర్, మణికంఠ, పగిళ్ళ సతీష్, శివ, బలరాం తదితరులు పాల్గొన్నారు.

## సబితా ఇంద్రారెడ్డిపై సిబిఐ అప్పీల్

ఓబుళాపురం మైనింగ్ కేసులో హైకోర్టులో పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐఎఎస్ కృపానందంలకు సిబిఐ కోర్టు విముక్తి కల్పిస్తూ వెలువరించిన తీర్పును సిబిఐ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. వారిద్దరినీ శిక్ష విధించాలని బుధవారం సిబిఐ అప్పీల్ దాఖలు చేసింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో 8, 9వ నిందితులుగా ఉన్న అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందం, అప్పటి గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిలను నిర్దోషులని గత మే 6న హైదరాబాద్ సిబిఐ కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని కోరింది. ఈ అప్పీల్‌ను విచారణ చేసేందుకు జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి నిరాకరించారు. కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. తొలుత సిబిఐ తరఫున శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపించబోగా న్యాయమూర్తి కల్పించుకుని వారిద్దరిలో ఒకరి తరఫున గతంలో న్యాయవాదిగా ఉండగా వాదించినట్లు చెప్పారు. కాబట్టి అప్పీలుపై విచారణ చేపట్టలేనన్నారు. అప్పీలుపై విచారణను సోమవారానికి వాయిదా వేస్తూ సంబంధిత న్యాయమూర్తి ముందు ఫైలును ఉంచాలంటూ రిజిస్ట్రీని ఆదేశించారు.

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం




మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**ప్రజాపక్షం/హుస్నాబాద్:** మత్తుపదార్థాలు వద్దు మంచి జీవితమే ముద్దు, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మన అందరి లక్ష్యంగా పని చేయాలని బిసి, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డివిజన్ కేంద్రంలో యాంటీ డ్రగ్స్ కార్యక్రమంపై యువతకు అవగాహన కలిపిస్తు హుస్నాబాద్ పట్టణంలో మల్లె చెట్టు చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు పోలీసు కమీషనర్ అనురాధ అధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా డ్రగ్స్ రహిత జీవన శైలికి దూరంగా ఉంటామని విద్యార్థులతో, యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, సిపి అనురాధ మాట్లాడుతూ మన హుస్నాబాద్‌లో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా మనమే సైనికుల్లా మనం తయారు కావాలని అన్నారు. మన పరిసరాలల్లో ఎవరైన మాదక ద్రావ్యాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే ప్రభుత్వ ఉన్నత అధికారులకు గాని 1908కు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేస్తు కుటుంబాన్ని దూరం చేస్తుందని అన్నారు. సంతోషం కోసం స్నేహితుల కోసం క్షనికమైన అనందం కోసం చేసిన అలవాటు అది చెడు వ్యసనంగా మారి జీవితాన్ని నాశనం చేస్తుంది. మీ తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న అశయాలు మీకు మీ కుటుంబాలనికి దూరమైపోతుందని అందుకే డ్రగ్స్ వద్దు మంచి జీవితమే ముద్దు అనే నినాదంతో సంతోషంగా ఉందామని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్డీవో రాంమూర్తి, తహశీల్దార్ లక్ష్మ రెడ్డి, గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఎసిపి సదానందం, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు , విద్యార్థులు, యువకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జూనియర్ లైన్‌మెన్ భర్తీపై ఎస్‌పిడిసిఎల్‌కు నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంట్రాక్ట్ జూనియర్ లైన్‌మెన్/జూనియర్ లైన్‌మెన్‌ల నియామకాల్లో సర్వీసు లెక్కింపు వివరణ ఇవ్వాలంటూ ఎస్‌పీడీసీఎల్, చీఫ్ జనరల్ మేనేజర్, ఎస్‌ఈ, డివిజనల్ ఇంజనీర్లకు హైకోర్టు నోటీసులిచ్చింది. 2009 నవంబర్ 10న హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం నియమితులైన వారందరికీ ఒకే సీనియారిటీ వర్తింపజేయలేదంటూ 2011లో నియమితులైన వందల మంది 12 పిటిషన్‌లు వేశారు. జస్టిస్ పుల్లా కార్తీక్ బుధవారం విచారణ చేపట్టారు. ఒకే నోటిఫికేషన్ ఆధారంగా 2007లో కొందరు, 2011లో పిటిషనర్లు నియమితులయ్యారని, అందరినీ 2007లో నియమితులైనవారితో సమానంగా సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలని, వేతనాలు, పదోన్నతులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని న్యాయవాది చెప్పారు. అందుకు విరుద్ధంగా 2011లో నియమితులైనవారిని సర్వీసులో జూనియర్‌లుగా పేర్కొంటున్నారని అన్నారు. ఎస్‌పీడీసీఎల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ 2007లో ప్రకటించిన ఖాళీల మేరకు పోస్టులను భర్తీ చేశామన్నారు. అనంతరం 2011లో ఏర్పడిన ఖాళీల ఆధారంగా పిటిషనర్లను నియామకం జరిగినప్పటి నుంచే సర్వీసు ప్రారంభమవుతుందని అన్నారు. వాదనలను విన్న హైకోర్టు, కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ 6 వారాలకు విచారణను వాయిదా వేసింది.

**తెలంగాణ ప్రభుత్వం, జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్ కార్యాలయం, పి.ఐ.యు. డివిజన్, మహబూబ్‌నగర్ జిల్లా.**

**Lr.No. TO/121/2BHK/2025-26** టెండర్ ప్రకటన **తేది: 12.08.2025**

**పనుల సంఖ్య:** (01), మహబూబ్‌నగర్ జిల్లా భూత్‌పూర్ మండలంలో (01) పని కొరకు, **మొత్తం అంచనా విలువ:** రూ.34.10 లక్షలు, **టెండర్ ప్రకటన ప్రారంభ తేది:** 14.08.2025 నుండి 25.08.2025 వరకు, **తెరచు తేది:** 26.08.2025.

**సం/- జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్ కార్యాలయం, పిఐయు డివిజన్, మహబూబ్‌నగర్.**

DIPR R.O. No. : 6428-PP/CL/ADVT/1/2025-26, Date: 13-08-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
గాజులరామారం సర్కిల్-26

**NIT No. 11/DB/EE/GJRM/CIRCLE-26/KPZ/GHMC/2025-26** టెండర్ ప్రకటన **తేది: 13.08.2025**

**పని పేరు:** గణేష్ పండుగకు ఏర్పాట్లు, **అంచనా విలువ:** రూ.30.40 లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 14.08.2025న మ.02.00గం.ల నుండి, **బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 20.08.2025న మ.03.00గం.ల వరకు, **ఇఇ అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-26, జిహెచ్ఎంసి. ఫోన్ నెం. 9849906776. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్, జిహెచ్ఎంసి.**

DIPR R.O. No. : 6484-PP/CL/ADVT/1/2025-26, Date: 13-08-2025

దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవాస్థానం**
మైసిగండి గ్రామం, కడ్తాల్ మండలం, రంగారెడ్డి జిల్లా.

**Rc.No. 33/SMDSRD/2025** ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన **తేది: 13.08.2025**

(1) ఒక సంవత్సరం పాటు అనగా తేది: 01.11.2025 నుండి 31.10.2026 వరకు మైసిగండి, శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవాస్థానమునకు **సామాగ్రి సరఫరా** చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై టెండర్లను ఆహ్వానించడమైనవి. వివరాలకు http://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు (లేదా) సంప్రదించవలసిన నెం.లు: 9441059524, 9989174398, 9441088909.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శ్రీ మైసమ్మ దేవత శివాలయ రామాలయ దేవాస్థానం, మైసిగండి గ్రామం, కడ్తాల్ మండలం, రంగారెడ్డి జిల్లా - 509358**

DIPR R.O. No. : 6487-PP/CL/ADVT/1/2025-26, Date: 13-08-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## 19న జాబ్-మేళా

### 40 సీనియర్ రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల భర్తీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీ లోని ఎంప్లాయి మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మిత్రా ఏరిన ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 19 న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనుంది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆరట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. మిత్రా ఏరిన ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ లోని సీనియర్ రిలేషన్షిప్ మేనేజర్ 40 పోస్టులను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నారు డిగ్రీ చేసిన యువతి యువకులకు18 నుండి 30 సంవత్సరాల వయసు వారికి మాత్రమే ఈ జాబ్ మేళాలో అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ.15,000 నుండి రూ.20,000 వరకు వేతనం ఉండే ఈ సీనియర్ రిలేషన్షిప్ మేనేజర్ ఉద్యోగాలకు మరిన్ని వివరాలకు పరిపాలన విభాగం అధికారి శిరీష 7799884909 నెంబర్‌పై సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.



## సిపిఐ రాష్ట్ర మహాసభల విజయవంతానికి సహకరించండి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**ప్రజాపక్షం/దుండిగల్ :** ఆగష్టు 20 నుండి 22వరకు కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం లో నిర్వహిస్తున్నామని ఆ మహాసభల విజయవంతం కోసం అందరు సహకరిచాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబాశివరావు అన్నారు. ఈ మహాసభల విజయవంతం కోసం నేడు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పర్యటనలో భాగంగా కాంగ్రెస్ ఇంచార్జి కోలాన్ హనుమంత్ రెడ్డి ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ తెలంగాణా రాష్ట్ర 4వ మహాసభలకు రాష్ట్రం లోని 33 జిల్లాల నుండి ఎంపిక చెయ్యబడిన 1000 మంది ప్రతినిధులు పాల్గొంటారని, 3 రోజుల పాటు జరిగే చర్చల్లో పాల్గొని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజల సమస్యలు భవిష్యత్తులో పార్టీ ఉద్యమ నిర్మాణం కోసం తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ ఎదుగుదల కోసం సూచనలు సలహాలు ఇచ్చి రాబోవు 3 సంవత్సరాల కోసం దిశా నిర్దేశం చేస్తారని అన్నారు. ఈ మహాసభలకు అనేక పోరాటాలను నిర్వహించి జైలు జీవితాలను అనుభవించిన ఉద్యమకారులు, మేధావులు, యువకులు, విద్యార్థులు, కార్మికులు సంఘాల నాయకులు పాల్గొంటారని అన్నారు. కొలను హనుమంత్ రెడ్డి కూనంనేని ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యూసఫ్, రాష్ట్ర నాయకులు ఏసురత్నం, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మండల కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, నాయకులు యాదయ్య, దస్తగిరి, సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## డిజిపి కార్యాలయంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నషా ముక్త్ భారత్ అభియన్ లో భాగంగా హైదరాబాద్ లోని డిజిపి కార్యాలయంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్( పి అండ్ ఎల్ )ఎం.రమేష్ అధికారులు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల హానికరమైన ప్రభావం నుండి సమాజాన్ని, ముఖ్యంగా యువతను రక్షించడానికి పోలీసు లు నిబద్ధతను పునరుద్ఘాటించడ కోసం ప్రతిజ్ఞ చేశారు . ఈ సందర్భంగా ఐజిపి ఎం.రమేష్ మాట్లాడుతూ....మాదకద్రవ్యాల దుర్వినియోగం చేయడం వల్ల ప్రజారోగ్యం, భద్రత , యువతరం ల భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పు అని నొక్కి చెప్పారు. అవగాహన ప్రచారాలను ముమ్మరం చేయాలని, అమలు చర్యలను బలోపేతం చేయాలని మరియు మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు వినియోగాన్ని నిర్మూలించడానికి సమాజంతో కలిసి పనిచేయాలని ఆయన సిబ్బందిని కోరారు. ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఎం. రమణ కుమార్, ఎఐజి (ఎల్ అండ్ ఒ), డి ఎస్ పి ఉదయ్ భాస్కర్ ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## పఫ్‌లో పాము

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలోని శ్రీ లక్ష్మి బెంగళూరు బేకరిలో తీసుకున్న కర్రీ పఫ్‌లో పాము వచ్చిన ఘటనపై ఫిర్యాదు అందుకున్న మహబూబ్‌నగర్ జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ నీలిమ, సిబ్బందితో శ్రీ లక్ష్మి బెంగుళూరు బేకరీలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. బేకరీ నిర్వహణకు లైసెన్స్ లేదు. అపరిశుభ్రత వాతావరణంలో బన్స్, కేకులు, బిస్కెట్లు పఫ్‌లు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో పాటు కాలం చెల్లిన రసాయనాలు, పౌడర్లు వాడుతున్నట్లు గుర్తించారు. కాలం చెల్లిన వస్తువులను వాడుతుండటం పట్ల బేకరీ నిర్వాహకులపై ఫుడ్ ఇన్స్పెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్ రిపోర్టు వచ్చే వరకు బేకరీ మూసివేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్స్పెక్టర్ నీలిమ మాట్లాడుతూ ఇవాళ జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో పాము వచ్చిన పఫ్‌ను పరిశీలించి దాన్ని ల్యాబ్ కు పంపినట్లు తెలిపారు. ఈ ఘటనపై లోతుగా విచారణ చేపడతామని పాము వచ్చిన ల్యాబ్ రిపోర్టు వచ్చాక బేకరి యజమానిపై చర్యలు ఉంటాయన్నారు. లైసెన్స్ లేకపోవడం, కాలం చెల్లిన క్రిములు వాడడం పెద్ద నేరమని ఈ ఘటనపై కూడా ప్రస్తుతం నోటీసు జారీ చేశామని అన్నారు. పట్టణంలో ఎక్కడైనా సరై లైసెన్స్ లేకుండా బేకరిలు హోటల్‌లో నిర్వహణ చేపడితే చర్యలు చేపడతామని ఫుడ్ ఇన్స్పెక్టర్ నీలిమ హెచ్చరించారు.



సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దివంగత ఎన్. బాలమల్లేష్ కుటుంబ సభ్యులను బుధవారం వారి నివాసంలో పరామర్శించిన సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం.

## ఓట్ల చోరీకి వ్యతిరేకంగా 5 కోట్ల సంతకాలు సేకరించాలి

### పార్టీ శ్రేణులకు టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు

**ప్రజాపక్షం / హైదరాబాద్:** ''ఓట్ చోర్... గద్దె చోడ్'' (ఓట్ల దొంగలు గద్దె దిగండి) ఉద్యమానికి ఎఐసిసి పిలుపునిచ్చిందని, అందులో భాగంగా కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా పాల్గొని ఓట్ల చోరీకి వ్యతిరేకంగా 5 కోట్ల సంతకాలను సేకరించాలని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టిన 'బిజెపి ఈసి అక్రమాలపై ఓట్ చోరీ' అంశాన్ని ప్రజల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన బుధవారం జూమ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, జిల్లా ఇంచార్జ్‌లు మంత్రి పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లతోపాటు డిసిసి జిల్లా ఇంచార్జ్‌లు పాల్గొన్నారు.

**మూడు దశలలో ఉద్యమం**

ఆగస్టు 14న రాత్రి 8 గంటలకు దేశ వ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో మాస్ క్యాండిల్ ర్యాలీలు నిర్వహించాలని, ఈ ప్రదర్శనలో ఎంపిలు, ఎంఎల్‌ఎలు, రాష్ట్ర, డిసిసి కార్యవర్గం, ఎంఎల్‌సిలు, అనుబంధ సంఘాల నాయకులు, బ్లాక్, మండల అధ్యక్షులు అన్ని విభాగాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని మహేష్‌కుమార్‌గౌడ్ కోరారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 7వరకు భారీ రాష్ట్ర స్థాయి ప్రదర్శనలు జరపాలని, రాష్ట్ర స్థాయిలో రాజధాని హైదరాబాద్, ప్రధాన నగరాలలో ప్రదర్శన చేపట్టాలి. బిజెపి, ఈసి కుమ్మక్కు పై నాయకులు ప్రసంగించాలని, భారీ జన సమీకరణ చేపట్టాలన్నారు. పాదయాత్రలు, వాహన ప్రదర్శనలు చేపట్టాలని, ప్రజలను భాగస్వాములను చేసి బిజెపి ఓట్ చోరీపై ఎండగట్టాలన్నారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు జాతీయ స్థాయి లో ఉద్యమం నిర్వహించాలని, నెల రోజుల పాటు గడప గడపకు తిరిగి సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపట్టాలన్నారు.

**గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలు**

గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ కమిటీలు వెంటనే వేయాలని, మండల కమిటీలను నెలాఖరులోగా పూర్తి చేయాలని, గ్రామ కమిటీలను సెప్టెంబర్ 15 వరకు పూర్తి చేసి పంపాలని ఆయన పార్టీ జిల్లా బాధ్యులను ఆదేశించారు. ఈ నెల 24 నుంచి రెండో విడత జనహిత పాదయాత్ర ప్రారంభమవుతుందని, పాదయాత్ర'ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. పాదయాత్ర లో పెద్దఎత్తున ప్రజలు పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆస్తుల వివరాలు వెంటనే పంపాలన్నారు.

## రాహుల్‌కు మద్దతుగా నిలవండి

### దేశ ప్రజలను అభ్యర్థించిన టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓట్ల చోరీ విషయంలో ఎన్నికల కమిషన్ కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీకి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ ప్రజలు మద్దుతుగా నిలవాలని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అభ్యర్థించారు. హైదరాబాద్‌లో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ..ఓట్ల చోరీపై కేంద్ర ఎన్నికల కమిషనర్ బిజెపి, ఆర్‌ఎస్ఎస్ లు రాసిచ్చిన స్క్రిప్ట్‌లను చదువుతున్నారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్‌ను రాహుల్ గాంధీ ప్రశ్నించినందుకు బిజెపి ప్రభుత్వం రాహుల్‌పై కక్ష సాధింపులకు పాల్పడుతుందని అన్నారు. ఎలక్షన్ కమిషన్ బిజెపి అడుగుజాడల్లో నడుస్తుందని విమర్శించారు. బిజెపి, ఆర్‌ఎస్ఎస్‌లు ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. దేశ ప్రజల స్వేచ్ఛను అణగదొక్కే కుట్ర బిజెపి, ఆర్ఎస్ఎస్ చేస్తున్నాయన్నారు. ప్రతీ ఒక్కరికీ ఓటు ద్వారా స్వతంత్రం, స్వేచ్ఛ రాజ్యాంగం కల్పించిందన్నారు. ఎవ్వరూ ఊహించని విధంగా మూడోసారి మోదీ ప్రధాని అయ్యాక పలు అనుమానాలు వచ్చాయన్నారు. మోదీ ప్రధాని అవడానికి కారణమైన నలభైకి పైగా ఎంపిల సీట్లలో గెలిచిన ఓట్లు బోగస్ అని అనుమానం వస్తుందన్నారు. అది నిజమా అబద్ధమా చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల కమీషన్‌పై ఉందన్నారు.భద్రతగా భావించే ఎలక్షన్ కమీషన్ తప్పు దారి పట్టిందన్నారు. మారుమూల గ్రామాలలో, కనిపించని ప్రాంతాలలో దొంగ ఓట్లను నమోదు చేయించి గెలుపుకు ప్రణాళిక చేసారని ఆరోపించారు.దొంగ ఓట్ల ద్వారా బిజెపి అధికారం లోకి వచ్చారన్నారు. దేశం మొత్తం ఈ దొంగ ఓట్ల ప్రక్రియ జరిగిందన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ హయాంలో మాజీ సిఎం బిజెపి స్క్రిప్ట్ చదవాలి కాబట్టి కిరణ్ కుమార్ రెడ్డి అదే చేసాడని అన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి బిజెపి లీడరా, ఎన్నికల కమీషనరా అర్థం కాలేదని అన్నారు. పురంధేశ్వరి ఎన్‌టిఆర్ కూతురైనా బిజెపి స్క్రిప్టు చదవాల్సిందే నన్నారు.



## ప్రతి చిన్నారికీ ఆరోగ్య, సంతోషకరమైన బాల్యం

### అందించేందుకు దృష్టి పెట్టండి : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రతి చిన్నారికీ ఆరోగ్యకరమైన, సంతోషకరమైన బాల్యం అందించేందుకు 'మిషన్ వాత్సల్య' ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సూచించారు. జిల్లాల వారీగా సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ సచివాలయంలో మంత్రి సీతక్క అధ్యక్షతన '' బాలల హక్కుల కమిషన్'' కార్యకలాపాలపై బుధవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి, సభ్యులు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ సృజన, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలల హక్కుల కమిషన్ ఏర్పాడినప్పటి నుంచి ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలు, అమలు చేసిన చర్యలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి అవసరమైన వనరులపై చర్చ జరిగింది. జిల్లాస్థాయిలో మహిళా శిశు సంక్షేమ శాఖ నుండి మరింత సహకారం అందించాలని కమిషన్ విజ్ఞప్తి చేసింది.చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యుల నియామకానికి దరఖాస్తుల గడువు ఈ నెల 8తో ముగిసినప్పటికీ ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదని, దీంతో గడువు పెంపు సాధ్యాసాధ్యాలను పరిశీలించి, న్యాయపరమైన సలహా తీసుకొని తగిన నిర్ణయం తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. క్షేత్రస్థాయిలో బాలల హక్కుల కమిషన్ మరింత క్రియాశీలకంగా పని చేసేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందన్నారు.

## బంగ్లాదేశీయులపై కొరడా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో అక్రమంగా నివసిస్తున్న పలువురు బంగ్లాదేశీయులను తెలంగాణ పోలీసులు సరిహద్దు భద్రతా దళానికి (బీఎస్ఎఫ్) అప్పగించారు. ఈ విషయాన్ని తెలంగాణ పోలీసులు అధికారికంగా ధృవీకరించారు. సుమారు 20 మంది బంగ్లాదేశీయులను దేశ సరిహద్దు వద్ద బిఎస్ఎఫ్ అధికారులకు అప్పగించినట్లు రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. హైదరాబాద్ నగరంతో పాటు దేశవ్యాప్తంగా అక్రమంగా నివసిస్తున్న బంగ్లాదేశీయులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుంటున్నారు.

## ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీలు... ప్రమాణాలు పాటించాల్సిందే

### పిసిబి అధికారులపై మంత్రి సురేఖ ఆగ్రహం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని పర్యావరణాన్ని పరిరక్షించే ప్రక్రియలో ఫార్మా, డ్రగ్ కంపెనీలు... ప్రమాణాలు పాటించాలని తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. సెక్రటేరియట్‌లో బుధవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫార్మా, బల్క్ డ్రగ్ పరిశ్రమల అనుమతుల విషయంలో అవకతవకలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ముందు ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను మంత్రికి పిసిబి అధికారులు వివరించారు. సిపిసిబి(సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు)కి అందిన ఫిర్యాదుల వివరాలు కూడా అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో సెక్రటేరియట్‌లో బుధవారం ఫారెస్టు మినిస్టర్ ఛాంబర్‌లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. కాగా, ఈ సమావేశానికి హాజరైన అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ అహ్మద్ నదీం, పిసిబి మెంబర్ సెక్రటరీ రవి, సిఇ రఘు, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, వెంకన్న, రవి శంకర్, పోచంపల్లి, చౌటుప్పల్, చిట్యాల నుంచి పరిశ్రల ప్రతినిధులు సైతం పాల్గొన్నారు. కాగా, అనుమతులు లేని, అనుమతుల టైం అయిపోయిన కంపెనీలను ఎన్నిసార్లు రైడ్స్ చేశారో... స్థానికంగా గ్రౌండ్ వాటర్ కలుషితం అవుతున్న స్టేటస్ చెక్ చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రౌండ్ వాటర్ కలుషితం అయిన ప్రాంతాల్లో టాస్క్ ఫోర్స్ నుండి డ్రైవ్ చేపించారా? అంటూ మంత్రి ప్రశ్నలు వేశారు. ఎంతటి వారైనా పర్యావరణ పరిరక్షణ ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. అవసరం అయితే ప్రభుత్వం తరఫున టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఆ టాస్క్ ఫోర్స్ కమిటీలో ఒక ఐఏఎస్ ఆఫీసర్, ఒక ఐపిఎస్ ఆఫీసర్, ఫారెస్ట్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఎన్విరాన్మెంటల్ పరిరక్షకులు, సెంట్రల్ పిసిబి అధికారులు కూడా ఇందులో చేర్చి ఉన్నత స్థాయి కమిటీని వేస్తామని స్పష్టం చేశారు. అయితే, ప్రతి ఆరు నెలలకి ఒకసారి ఇన్‌స్పెక్షన్ చేస్తున్నట్టు మంత్రి సురేఖకి పిసిబి మెంబర్ సెక్రటరీ జి. రవి వివరించారు. కంప్యూటరైజ్డ్ ఇన్‌స్పెక్షన్ ప్రక్రియ కూడా చేపడుతున్నట్టు వెల్లడించారు. జనావాసాలున్న చోట ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీలు వాటిని స్థానచలనం చేసేందుకు కసరత్తు చేయాలన్నారు. సిఎం రేవంత్ రెడ్డి కూడా ఔటర్ రింగు రోడ్డు అవతలనే ఫార్మా కంపెనీలుండాలని చెప్పారని... ఆ మేరకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలు ఫార్మా, బల్క్ డ్రగ్ కంపెనీల ప్రతినిధులు మంత్రికి వివరించారు. నీటి కలుషితం కాకుండా ఉండేందుకు ఏ చర్యలు తీసుకుంటున్నారో మంత్రికి తెలిపారు. నీటి కలుషితం కావొద్దని... భావి తరాలకు నీటి వనరులను అందజేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని మంత్రి సురేఖ సూచన చేశారు. పొల్యూషన్ కంట్రోల్ ప్రమాణాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని... అందుకు సంబంధించిన నివేదిక ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు.



## మంత్రి శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ తాజాగా ప్రకటించిన 'ఇండియాస్ 100 మోస్ట్ ఇన్‌ఫ్లుయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ – 2025' జాబితాలో ఆయనకు చోటు లభించింది. తమ సమర్థవంతమైన నాయకత్వం, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహమిస్తూ భారత్ ను ఏఐ రంగంలో అగ్రగామిగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్న వ్యక్తులకు ఇందులో చోటు కల్పించారు. విధాన రూపకర్తల విభాగంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, పీయూష్ గోయల్, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, ఇండియా ఏఐ మిషన్ సలహాదారు ఆకృత్ వైష్, ఇండియా ఏఐ మిషన్ సీఈవో, ఎన్ఐసీ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, ఎన్ పీసీఐ సీఈవో దిలీప్ అస్బే, నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్, నాస్కామ్ మాజీ అధ్యక్షులు దేబజాని ఘోష్ తదితర ప్రముఖులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

ఏఐ రంగంలో రోల్ మోడల్ గా తెలంగాణ ...

మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో ఆర్టిఫిషియల్ టెక్నాలజీ (ఏఐ) రంగంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ మారిందని, అందుకే ఆయనను ఈ జాబితాలో చేర్చినట్లు అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ నిర్వాహకులు ప్రకటించారు. 'బాధ్యతాయుతమైన ఏఐ అమలు కోసం సమగ్ర ఏఐ ఆధారిత తెలంగాణ స్ట్రాటజీ అండ రోడ మ్యాప్ ను రూపొందించడంలో కీలకంగా వ్యవహరించారు. గుడ్ గవర్నెన్స్, నూతన ఆవిష్కరణలు, సురక్షితమైన డేటా షేరింగ్‌ను ప్రోత్సహించేలా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్ ను ప్రారంభించేందుకు చొరవ చూపారు' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబును కొనియాడారు. 'గ్లోబల్ ఏఐ సమ్మిట్ నిర్వహణలోనూ మంత్రి శ్రీధర్ బాబు కీలకంగా వ్యవహరించారు. తెలంగాణలో ఏఐ ఎకో సిస్టమ్ ను మరింత బలోపేతం చేసేలా 2025–26లో 100 గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లను ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. ఆర్ అండ డీ, నూతన ఆవిష్కరణలు, అత్యంత నైపుణ్యమున్న మానవ వనరులను తయారు చేయాలనే సంకల్పంతో ఏర్పాటు కానున్న ఏఐ యూనివర్సిటీ విషయంలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారు' అని ప్రశంసించారు. ఏఐ రంగంలో తెలంగాణ బ్రాండ మరింత విశ్వవ్యాప్తమయ్యేలా మంత్రి శ్రీధర్ బాబుకు దక్కిన ఈ గుర్తింపు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.సిఎం రేవంత్ రెడ్డి ప్రోత్సహంతోనే ఈ గుర్తింపు లభించిందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.




## ఒయులో ఘనంగా ఎఐఎస్ఎఫ్ వార్షికోత్సవాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) 90వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎఐఎస్ఎఫ్ మాజీ నేత, ఒయూ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఉప్పరి మల్లేష్ ఎఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఉత్తర ప్రదేశ్ బెనారస్ విశ్వవిద్యాలయంలో 1936 ఆగస్టు 12న భారతదేశంలో బ్రిటిష్ పాలన వ్యతిరేకంగా చేసిన పోరాటాలలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం (ఎఐఎస్ఎఫ్) విద్యార్థి సంఘమని స్వతంత్ర ఉద్యమంలో విద్యార్థులను, యువతను భాగస్వామ్యం చేసి స్వరాజ్యం సాధనకై పోరాటం నిర్వహించిందని ఆ క్రమంలో భారతదేశానికి స్వతంత్రం సిద్ధించడంలో కీలక పాత్ర పోషించిందని ఆయన అన్నారు. స్వతంత్ర అనంతరం శాస్త్రయ విద్యా విధానం అదేవిధంగా ప్రభుత్వ విద్యాకు అధిక నిధులు కేటాయించాలని ప్రభుత్వ విద్య పరిరక్షణకై అనేక పోరాటాల నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు. ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో పనిచేసిన వాళ్ళు ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు అదేవిధంగా ప్రభుత్వంలో ఉన్నత స్థాయి ఉద్యోగులుగా అనేకమంది స్థిరపడ్డారని ఆయన గుర్తు చేశారు. స్వతంత్రం సిద్ధించి 75 సంవత్సరాలు గడుస్తున్న సందర్భంలో కేంద్రలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ విద్యా రంగం పైన వాళ్లకు చిత్తశుద్ధి లేదని అన్నారు. నూతన విద్యా విధానం అంటూ విద్యను కార్పొరేటీ కరణ, శాస్త్రీయ విలువలు లేకుండా హేతుబద్ధతలేని మూఢనమ్మకాలను పెంచి పోషించే విలువలను తరగతి పాఠ్యపుస్తకాలలో చెప్పించి స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్న వీరుల, పోరాటాలను తొలగిస్తుందని అన్నారు. అదేవిధంగా కొఠారి కమిషన్ సూచించినట్టు కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి 10శాతం నిధులు ఇప్పటివరకు కేటాయించలేదని అన్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వాలు అమలు చేసిన నేషనల్ ఫెలోషిప్లు రద్దుచేసి ప్రైవేటు యూనివర్సిటీలకు ద్వారాలు తెరుస్తూ పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రి నియమించకుండా బడ్జెట్లో కేవలం 7.3శాతం నిధుల కేటాయించిందని పార్టీ మేనిఫెస్టోలో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ ఒయు అధ్యక్షులు లెనిన్ కార్యదర్శి నెల్లి సత్య, సహాయ కార్యదర్శి ఉప్పల ఉదయ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ ఓయూ నాయకులు అశ్వన్, మధు, లింగస్వామి, నిజాం కళాశాల కన్వీనర్ సుశాంత్, కార్తిక్, జితేందర్, అంజి, లింగా, శివ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో త్వరలో టూరిస్ట్ పోలీస్

### డిజిపి డాక్టర్ జితేందర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో టూరిస్టుల భద్రత కోసం త్వరలో టూరిస్ట్ పోలీసులను కేటాయించనున్నట్టు రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ వెల్లడించారు. తెలంగాణ టూరిజం శాఖ పోలీస్ శాఖల మధ్య సమన్వయ సమావేశం బుధవారం డిజిపి కార్యాలయంలో జరిగింది. టూరిజం శాఖ స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్, శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ , టూరిజం శాఖ ఎండి వల్లూరు క్రాంతి ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎం.డి సిహెచ్.ప్రియాంక, ఇతర పోలీసు అధికారులు ఈ సమన్వయ సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.... తొలి దశలో టూరిజం శాఖకు అవసరమైన 80 మంది పోలీసు సిబ్బందిని త్వరలో కేటాయిస్తామని తెలియజేశారు. సెప్టెంబర్ 27వ తేదీన జరగనున్న వరల్డ్ టూరిజం డే సందర్భంగా 'టూరిస్ట్ పోలీసు' వ్యవస్థ సిద్ధం చేయాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాలైన అనంతగిరి, సోమశిల, రామప్ప, యాదగిరి గుట్ట, పోచంపల్లి, నాగార్జునసాగర్ ,బుద్ధవనం, భద్రాచలం, అమ్రాబాద్ తదితర ప్రాంతాలలో టూరిస్ట్ పోలీసులు పని చేస్తారని అన్నారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి చెందేందుకు పోలీస్ శాఖ పర్యాటక శాఖకు పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. షూటింగ్ పర్మిషన్లు కోసం, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం పర్యాటక శాఖ విధి విధానాలను రూపొందించాలని డిజిపి సూచించారు. తద్వారా ఆయా కార్యక్రమాలకు భద్రత కల్పించడం పోలీస్ సిబ్బందికి సులభం అవుతుందని తెలిపారు. ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం సినీ నిర్మతలు ముందుగా తెలియజేస్తే కార్యక్రమాలకు భద్రత కల్పించే సమయం దొరుకుతుందన్నారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలను చేపట్టనునట్లు తెలిపారు. విదేశీ టూరిస్టులతో పాటు పాటు దేశంలో ఉన్న టూరిస్టులు విస్తృతంగా పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారని వారికి భద్రత కల్పించేందుకు టూరిస్ట్ పోలీసు అవసరం ఉందని తెలిపారు. ఆధ్యాత్మిక, మెడికల్, వినోదాత్మక పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చే వారి భద్రత కోసం టూరిస్ట్ పోలీసులను కేటాయించాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో ఐపిఎస్ అధికారులు విక్రమ్ సింగ్ మాన్, తఫ్సీర్ ఇక్బాల్, గజరావు భూపాల్, ఇందిర, రమణ కుమార్ పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## నియంత్రణ రేఖ వద్ద కాల్పులు.. భారత జవాను మృతి

**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లోని ఉరి సెక్టార్ సమీపంలో బుధవారం ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. నియంత్రణ రేఖ వద్ద జరిగిన కాల్పుల్లో ఓ సైనికుడు మృతిచెందాడు. ఇండియా, పాక్ సైనిక దళాలు ఫైరింగ్‌కు దిగాయి. చొరబాటు యత్నాన్ని ఆపే సమయంలో ఈ ఘటన జరిగింది. ఆర్మీ వర్గాల ప్రకారం.. ఆగస్టు 12వ తేదీ రాత్రి కొందరు చొరబాటుకు ప్రయత్నించారు. ఈ చొరబాటు భిన్నంగా సాగినట్లు చెబుతున్నారు. చొరబాటుదారులకు అండగా పాకిస్థాన్ ఆర్మీ ఫైరింగ్ జరిపినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్‌లు ఈ ప్రయత్నానికి సహకరించినట్లు స్పష్టమవుతోంది. చొరబాటు జరిగే సమయంలో.. ఎదురుకాల్పులు జరిగాయి. ఆ సమయంలో గాయపడ్డ జవాను ఆ తర్వాత ప్రాణాలు కోల్పోయాడు. అయితే వాతావరణం సరిగా లేకపోవడంతో చొరబాటుదారులు తప్పించుకున్నారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత తొలిసారి పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడింది.

# ఓటు హక్కు పరిరక్షణే ధ్యేయం

### ప్రశ్నించాలి... సమాధానాలు కోరాలి
### ఓటుపోతే హక్కులు, గుర్తింపు ఉండవు
### దేశ ప్రజలకు ఖర్గే, రాహుల్ పిలుపు
### ఓట్ల చోరీపై కాంగ్రెస్ పోరు ఉధృతం
### కొత్తగా 55 సెకన్ల వీడియో అస్త్రం



**న్యూఢిల్లీ:** ప్రజల ఓటు హక్కు పరిరక్షణే ధ్యేయం గా ఎన్నికల సంఘం, బిజెపిపై సమరాన్ని కాంగ్రెస్ వినూత్న రీతిలో ముందుకు తీసుకెళుతోంది. ఓటు దోపిడీకి గురైతే మీ హక్కులు, గుర్తింపు పోతాయంటూ ప్రజలను హెచ్చరించింది. ఓట్ల దొంగతనంపై ప్రశ్నించాలని, బాధ్యుల నుంచి సమాధానాలు కోరాలని ప్రజలకు కాంగ్రెస్ సూచించింది. ఇదే క్రమంలో 55 సెకన్ల నిడివిగల 'ఓట్ చోరీ' వీడియో అస్త్రాన్ని సంధించింది. నకిలీ ఓట్లు ఎలా పోలవుతాయో చూపించింది. 'గరీబ్ దాస్, జామ్నాదేవి దంపతులు ఓటు వేస్తేందుకు పోలింగ్ కేంద్రానికి వెళతారు. వారిని ఇద్దరు వ్యక్తులు అడ్డుకుంటారు. మీ ఓట్లు వేసేశాం, ఇక మీరు మీ ఇంటికి వెళ్లిపోండి అని అంటారు. అనంతరం ఆ ఇద్దరు వ్యక్తులు నకిలీ ఓట్లు వేసి, అక్కడే బల్లపై 'ఎలక్షన్ చోరీ ఆయోగ్' అని బోర్డు పెట్టుకొని ఉన్న అధికారికి 'థంబ్స్ అప్' (బొటన వేలు పైకెత్తి సైగ చేయడం) చూపగా, ఓకే అంతా నేను చూసుకుంటా అన్నట్లు ఆయన సైగ చేస్తారు. ఇద్దరు వ్యక్తులు బూత్ వద్ద మెట్లపై కూర్చొని తమ వద్ద ఉన్న ఓటరు కార్డులన్నీ చూసుకుంటుడంతో వీడియో ముగుస్తుంది. ఈ వీడియో ద్వారా ఓట్ల దొంగతనాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది.

బిజెపి కబంధ హస్తాల నుంచి రాజ్యాంగబద్ధ వ్యవస్థలను పరిరక్షించుకోవడం కోసం ప్రజలంతా గళం వినిపించాలంటూ లోక్‌సభ, రాజ్యసభలోని ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే బుధవారం ఎక్స్ మాధ్యమంగా పిలుపునిచ్చారు. 'మీ ఓటు చోరీ అయిందంటే మీ హక్కులు, మీ గుర్తింపు దోపిడీ అయినట్టే అంటూ హెచ్చరించారు. మీ ఓటు హక్కును దోచుకోనివ్వొద్దు అంటూ రాహుల్ సూచించారు. 'ప్రశ్నించండి, సమాధానాలను డిమాండ్ చేయండి! ఓట్ల దొంగతానికి వ్యతిరేకంగా గళమెత్తండి. మీ ఓటు హక్కును దోచుకోనివొద్దు. బీజేపీ కబంధ హస్తాల నుంచి రాజ్యాంగబద్ధ వ్యవస్థలకు విముక్తి కోసం ఐక్యంగా పోరాడదాం' అంటూ ప్రజలకు ఖర్గే సందేశమిచ్చారు. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా స్పందిస్తూ 'మీ హక్కులు, మీ గుర్తింపును కాపాడుకోవడం కోసం మీఓటు చోరీ కాకుండా చూసుకోవాలి. మీ ఓటును పరిరక్షించుకోండి. ఓట్ల దొంగతాన్ని ఎండగట్టండి' అంటూ పిలుపునిచ్చారు. ఈ 55సెకన్ల వీడియోను మంగళవారం ఉదయం ఇన్స్టాగ్రామ్‌లో పెట్టగా 1,21,358 మంది వీక్షించారు.


ఓట్ల దొంగతనం అన్నది చావోరేవో అన్నట్లుగా మారిందని కాంగ్రెస్ నాయకులు తేల్చిచెప్పారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం కోసం ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసుకున్నా రు. ఇదే అంశమై నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యూఐ)కి ఎఐసిసి ఇన్‌చార్జ్ కన్హయ కుమార్ మాట్లాడుతూ ఓట్ల చోరీ చాలా పెద్ద అంశమన్నారు. 'రాహుల్ గాంధీ నిజాలను వెలుగులోకి తెచ్చారు. ప్రజాస్వామ్యం గొంతు ఏ విధంగా నొక్కేస్తున్నారన్నది రుజువులు చూపారు' అని వెల్లడించారు. ఓట్ల చోరీ గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం 'లోకతంత్ర బచావో మషాల్ మార్చ్' పేరిట కాగడాల ప్రదర్శనను అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ చేపడుతోందన్నారు. ఈనెల 22 నుంచి సెప్టెంబరు 7వ తేదీ వరకు 'ఓట్ చోర్, గద్దీ ఛోడ్' (ఓట్ల దొంగ, గద్దె దిగు) నినాదాంతో అన్ని రాష్ట్రాల్లో ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 15 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు సంతకాల సేకరణ జరుగుతుందన్నారు. ఈ పోరాటంలో ఇండియా ఐక్యసంఘటన కలిసివున్నట్లు కన్హయ చెప్పారు.

### కాన్స్‌టిట్యూషన్ క్లబ్ హోరాహోరీ ఎన్నికల్లో

# రాజీవ్ ప్రతాప్ రూడీ విజయం

### కలిసొచ్చిన ఇండియా ఎంపిల మద్దతు
### ఆయన ప్రత్యర్థికి బిజెపి ప్రచారం

**న్యూఢిల్లీ :** కాన్స్‌టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా కార్యదర్శి(పరిపాలన)గా బిజెపి ఎంపి రాజీవ్ ప్రతాప్ రూడీ మరోసారి ఎన్నికయ్యారు. ఆయన 25 ఏళ్లకు పైగా ఈ పదవిలో కొనసాగుతున్నారు. సహచర బిజెపి నాయకుడు, మాజీ ఎంపి సంజీవ్ బల్యాపై హోరాహోరిగా జరిగిన ఎన్నికల్లో ఆయన వంద ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికలలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ వంటి ప్రముఖులు కూడా ఓటు వేశారు. రాజీవ్ ప్రతాప్ రూడీకి 391 ఓట్లు రాగా, బల్యాన్‌ను 291 ఓట్లు వచ్చాయి. ఆయన ప్యానెల్‌లో ఒకరు మినహాయి మిగతా సభ్యులందరూ 11 మంది కార్యనిర్వాహక సభ్యుల పదవులకు ఎన్నికయ్యారు. బిహార్‌లోని సరన్ నుండి ఐదవసారి లోక్‌సభ ఎంపిగా ఎన్నికైన రూడీ ప్యానల్‌లో కొత్త ఆఫీస్ బేరర్లలో బిజెపి, కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, టిఎంసి తదితర వివిధ పార్టీల సభ్యులు ఉన్నారు. ఒకే పార్టీకి చెందిన ఇద్దరు రాజకీయ నాయకులు పోటీ పడడంతో ఈ ఎన్నిక ఆసక్తికరంగా మారింది. ప్రతిపక్ష ఇండియా కూటమి సభ్యులు రూడీకి మద్దతు ఇవ్వగా, బిజెపి ఎంపి నిశికాంత్ దూబే నేతృత్వంలోని బల్యాన్ ప్రచారానికి అధికార పార్టీ సభ్యుల నుంచి ఎక్కువ మద్దతు లభించింది. వారిలో కొంతమంది ప్రస్తుత రుడీకి కూడా ఓటు వేశారు. బల్యాన్ బలం కారణంగానే సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఓటు వేయడానికి వచ్చారని దూబే చెప్పారు. 2005, 2010 లో రూడీపై కాంగ్రెస్ సభ్యుడు జై ప్రకాష్ అగర్వాల్ పోటీ చేసినప్పుడు సోనియాగాంధీ లేదా నాటి యుపిఎ ప్రభుత్వ మంత్రులు ఎవరూ ఓటు వేయడానికి రాలేదని ఆయన అన్నారు.1999లో నాటి స్పీకర్ జి.ఎం.సి. బాలయోగి ఈ పదవికి రూడీ నినామినేట్ చేసినప్పటి నుండి తాజా ఎన్నికల వరకు ఆయనకు ఎలాంటి ఎన్నికల సవాలు ఎదురు కాలేదని పేర్కొన్నారు. 2009లో ఈ పదవి, ఇతర నిర్వహణ పదవులకు ఎన్నికలు ప్రారంభమయ్యాయని ఆయన చెప్పారు. క్లబ్‌కు స్పీకర్ ఎక్స్‌అఫిషియో అధ్యక్షుడిగా ఉంటారు, అయితే సెక్రటరీ (అడ్మినిస్ట్రేషన్) దాని కార్యనిర్వాహక పనితీరులో కీలక పాత్ర పోషిస్తారు. అమిత్‌షా, బిజెపి అధ్యక్షుడు జె.పి.నడ్డా మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థి ఓడిపోయారని తృణమూల్ కాంగ్రెస్ ఎంపి సాగరికా ఘోష్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కొందరు గవర్నర్లు కూడా ఓటు వేశారు. 11 మంది సభ్యుల కార్యనిర్వాహక కమిటీకి ఎన్నికైన వారిలో నరేష్ అగర్వాల్, ప్రసూన్ బెనర్జీ, ప్రదీప్ గాంధీ, నవీన్ జిందాల్, దీపేందర్ సింగ్ హుడా, ఎన్.కె. ప్రేమచంద్రన్, ప్రదీప్ కుమార్ వర్మ, జస్బీర్ సింగ్ గిల్, కాలికేశ్ నారాయణ్ సింగ్ దేవ్, శ్రీరంగ అప్పా బర్నే, అక్షయ్ యాదవ్ ఉన్నారు.



# ఓటర్ ఫ్రెండ్లీగానే ఉంది కదా?

### సర్ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** బిహార్‌లో ఓటర్ల జాబితాను సవరించాలనే ఎన్నికల కమిషన్ (ఇసి) నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఏడు ధ్రువీకరణ పత్రాలకంటే.. ప్రస్తుతం 11 పత్రాలను అనుమతించడం ఓటర్లకు ప్రయోజనకరంగా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆధార్ మినహా అనేక ఇతర డాక్యుమెంట్లను పరిగణలోకి తీసుకోవడాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. గతంలో బిహార్‌లో నిర్వహించిన రివిజన్‌లో ఏడు ధ్రువీకరపత్రాలను అనుమతించారని.. ప్రత్యేక సవరణ (ఎస్‌ఐఆర్)లో 11 డాక్యుమెంట్లను ఇసి అనుమతి ఇస్తుందని.. దీన్ని పరిశీలిస్తే ఓటర్లకు అనుకూలంగానే కనిపిస్తుందని ధర్మాసనం తెలిపింది. ఆధార్ అనుమతించడం లేదనే పిటిషనర్ల వాదనను అర్థం చేసుకున్నప్పటికీ అనేక పత్రాలను పరిగణలోకి తీసుకుంటున్నట్లుగా ధర్మాసనం గుర్తు చేసింది. అయితే, ఈ వాదనలతో పిటిషనర్ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ విభేదించారు. ధ్రువపత్రాల సంఖ్య ఎక్కువగా ఉన్నా.. అందరికీ అందుబాటులో లేవని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాస్‌పోర్టులను ఉదహరించారు. బిహార్‌లో కేవలం ఒకటి నుంచి రెండుశాతం మంది వద్దే పాస్‌పోర్టులు ఉన్నాయన్నారు. దీనికి స్పందించిన ధర్మాసనం 36 లక్షల మందికి పాస్‌పోర్టులు ఉన్నాయని.. ఇది మంచి సంఖ్యగానే కనిపిస్తోందని చెప్పింది. ఆయా ప్రభుత్వ విభాగాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తర్వాతే ధ్రువపత్రాల జాబితా రూపొందిస్తారని జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ అంశంపై మంగళవారం సైతం సుప్రీంకోర్టులో విచారణ జరిగిన విషయం తెలిసిందే. పౌరులను చేర్చడం, కానివారిని ఓటరు జాబితా నుంచి మినహాయించడం ఎన్నికల కమిషన్ అధికార పరిధిలోనిదని ధర్మాసనం పేర్కొంది. సర్‌లో ఆధార్, ఓటర్ కార్డును పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమన్న ఇసి వాదనలను సమర్థించింది. పార్లమెంట్ లోపల, వెలుపల 'సర్' అంశంపై వివాదం పెరుగుతున్న నేపథ్యంలో.. ఇసి చేపట్టిన ఈ కార్యక్రమంపై విశ్వాసం కోల్పోవడమే సమస్య అని.. అంతకు మించి ఏమీ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.



## వీధి కుక్కలపై 'సుప్రీం' ఆదేశాలు.. పునఃపరిశీలిస్తాం : సిజెఐ

**న్యూఢిల్లీ :** ఢిల్లీ వీధుల్లో కుక్కలు కనిపించరాదని సుప్రీంకోర్టు సోమవారం ఢిల్లీ ప్రభుత్వ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. సుప్రీం ఆదేశాలపై పలువురి నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ స్పందించారు. ఉత్తర్వులను పునఃపరిశీలిస్తానని హామీ ఇచ్చారు. వీధి కుక్కలన్నింటినీ సాధ్యమైనంత త్వరితంగా స్టెరిలైజ్ చేసి షెల్టర్లకు తరలించాలని సుప్రీంకోర్టు ఢిల్లీఎన్‌సిఆర్ అధికారులను ఆదేశించింది. వీధి కుక్కల కాటు వల్ల రేబీస్ వ్యాధి వ్యాప్తి చెందుతోందని, ముఖ్యంగా పిల్లలు దీనికి గురవుతుండడంతో పరిస్థితి చాలా దయనీయంగా ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. వెంటనే వీధి కుక్కల కోసం షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోర్టు ఆదేశించింది. దాదాపు 5,000 వీధి కుక్కల కోసం 6 నుంచి 8 వారాలలో షెల్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తమ ఆదేశాలకు అవరోధాలు కల్పించడానికి వ్యక్తులు కాని, సంస్థలు కాని ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. అవసరమైతే కోర్టు ధిక్కరణ ప్రక్రియ చేపడతామని కూడా ధర్మాసనం హెచ్చరించింది. వీధి కుక్కలను పట్టుకోవడానికి వచ్చే సిబ్బందిని ఎవరైనా అడ్డుకుంటే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపింది. అయితే ఈ ఆదేశాలు దేశవ్యాప్తంగా భారీ చర్చకు దారితీశాయి.

సుప్రీంకోర్టు ఆదేశాలు అమానవీయంగా ఉన్నాయని జంతు ప్రేమికులు విమర్శిస్తున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలపై పలువురు రాజకీయ, సినీ సెలబ్రిటీల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాలను వ్యతిరేకించిన రాహుల్ గాంధీ దశాబ్దాల మానవీయ, సైన్స్ మద్దతు ఉన్న విధానాన్ని తిప్పికొట్టడంగా దీనిని అభివర్ణించారు. ఇటువంటి ఆదేశాలు చాలా క్రూరమైనవని, దూరదృష్టి లేనివని, పైగా ఇవి మనలోని మానవత్వాన్ని దూరం చేస్తాయని ఆయన విమర్శించారు. మూగజీవాలతో మనకు ఎంతమాత్రం సమస్య లేదని, వాటిని నిర్మూలించాలనడం సబబు కాదని ఆయన అన్నారు. మరోవైపు పలువురు సినీ సెలబ్రిటీలు ఈ ఆదేశాలను సమీక్షించాలని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌కు విజ్ఞప్తి చేస్తూ లేఖలు కూడా రాశారు.

# ఓట్ల చోరీకి ఇసితో బిజెపి కుట్ర

### తేజస్వీ యాదవ్



**పాట్నా :** ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఓట్ల చోరీకి పాల్పడేందుకు ఎన్నికల సంఘం బిజెపితో కుట్ర పడిందని ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ ఆరోపించారు. బిజెపి నాయకులకు ఒక్కొక్కరికి రెండు ఓటరు కార్డులు పొందడానికి సహాయం చేస్తోందన్నారు. ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలను సరిదిద్దకపోతే బిహార్ అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించవచ్చని తేజస్వీ పునరుద్ఘాటించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వాస్తవానికి, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ తరువాత ఇసి ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాను 'ఓట్ల దోపిడీ' అని పిలవాలని, రాష్ట్రంలో బిజెపి నాయకులు ఒక్కొక్కరు రెండు ఓటరు ఐడి కార్డులు పొందడానికి ఇసిసహాయం చేస్తోందిదని యాదవ్ మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో కలిసి తమ పార్టీ 'ఓటరు హక్కుల యాత్ర'లో పాల్గొంటుందని, ఓటర్లను కలుస్తుందని ఆర్‌జెడి నాయకుడు చెప్పారు. యాత్ర ముగిసిన తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొనాలా వద్దా అనే విషయాన్ని పరిశీలిస్తామని, ఎన్నికల కమిషన్ ప్రస్తుతం మాదిరిగానే వ్యవహరిస్తే ఎన్నికలను బహిష్కరించడంపై ఆలోచించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ముజఫర్‌పూర్ మేయర్ నిర్మలా దేవి రెండు ఓటరు ఐడి కార్డులను 'కలిగి ఉన్నారని ఆయన ఆరోపించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం, ప్రముఖ బిజెపి నాయకురాలు, రానున్న అసెంబ్లీ ఎన్నికలలో కాషాయ పార్టీ అభ్యర్థి అయిన ముజఫర్‌పూర్ మేయర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని రెండు వేర్వేరు బూత్‌లలో రెండు ఓటరు ఐడి కార్డులను కలిగి ఉన్నారన్నారు. ఆమెకు రెండు ఎంపిక్ ఐడిలు ఆర్‌ఇఎం 1251917, జిఎస్‌బి 1835164. ఆమె ఓటరు ఐడిలు ఉండగా, వయస్సు కూడా వేర్వేరుగా ఉందని ఆరోపించారు. ముజఫర్‌పూర్ మేయర్, బిజెపి నాయకుడికి రెండు ఓటరు ఐడి కార్డులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఎన్నికల కమిషన్ బుధవారం నోటీసు జారీ చేసి, 16 లోపు దానికి సమాధానం ఇవ్వాలని కోరిందని ఒక అధికారి తెలిపారని, బిజెపి కోసం బహుళ నకిలీ ఓటర్లను సృష్టించడానికి ఇసి దోహద పడిందని యాదవ్ ఆరోపించారు. బిహార్ ఉపముఖ్యమంత్రి విజయ్ కుమార్ సిన్హా కూడా ముసాయిదా ఓటర్ల జాబితాలో రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు ఓటరు కార్డులను కలిగి ఉన్నట్లు గుర్తించారని యాదవ్ పేర్కొన్నారు. బిహార్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇటీవల చేసిన ప్రకటనకు ప్రతిస్పందిస్తూ, 'చొరబాటుదారులను' ఎన్నికల ప్రక్రియలో పాల్గొనడానికి అనుమతించబోమని యాదవ్ అన్నారు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన ఓటర్లను ఇసి గుర్తించాలని డిమాండ్ చేశారు.

# సుశీల్ కుమార్ బెయిల్ రద్దు

### మరో వారంలోగా సరెండర్ కావాలని 'సుప్రీం' ఆదేశం

**న్యూఢిల్లీ :** ఒలింపిక్ పతక విజేత, రెజ్లర్ సుశీల్ కుమార్ బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఢిల్లీలోని ఛత్రాసాల్ స్టేడియం వద్ద జరిగిన మర్డర్ కేసులో రెజ్లర్ సుశీల్ జైలుశిక్ష ఎదుర్కొంటున్నారు. మాజీ జూనియర్ జాతీయ రెజ్లింగ్ చాంపియన్ సాగర్ ధన్‌కర్ మర్డర్ కేసులో సుశీల్ కుమార్‌పై ఆరోపణలు ఉన్నాయి. మార్చి 4వ తేదీన ఈ కేసులో ఢిల్లీ హైకోర్టు సుశీల్‌కు బెయిల్ మంజూరీ చేసింది. అయితే జస్టిస్ సంజయ్ కరోల్, ప్రశాంత్ కుమార్ మిశ్రాలకు చెందిన సుప్రీం ధర్మాసనం ఆ బెయిల్‌ను రద్దు చేసింది. మరో వారం లోగా సుశీల్ సరెండర్ కావాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఓ ప్రాపర్టీ విషయంలో రెజ్లర్ల మధ్య వివాదం చెలరేగింది. మే 2021లో ధన్‌కర్‌పై సుశీల్ కుమార్‌తో పాటు ఇతరులు దాడి చేశారు. ఆ ఘటనలో ధన్‌కర్‌కు చెందిన ఇద్దరు స్నేహితులు గాయపడ్డారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం ధన్‌కర్ తలకు తీవ్రగాయమైంది.

### జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ పిటిషన్

# 'నేడు' సుప్రీంకోర్టు విచారణ

**న్యూఢిల్లీ :** జమ్ము కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు నేడు (గురువారం) విచారించనుంది. ప్రధాన్యాయమూర్తి బిఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయమై విచారణ జరుపనుందని కాజ్ లిస్ట్ వెల్లడించింది. 2023 డిసెంబరు 11న సుప్రీంకోర్టు ఆర్టికల్ 370ను రద్దును ఏకగ్రీవంగా ప్రకటించింది. 2024 ఏప్రిల్ నాటికి జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీని నిర్వహించాలని, రెండు నెలల్లో దానికి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని గత ఏడాది కేంద్రానికి మార్గదర్శకాలు జారీచేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. విద్యావేత్త జవహర్ అహ్మద్ భట్, ఖుర్షెద్ అహ్మద్ మాలిక్ అనే సామాజికరాజకీయ కార్యకర్త ఇరువురూ ఈ అభ్యర్థనను దాఖలు చేశారు. 'పునరుద్ధరణలో జాప్యం ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన జమ్ముకశ్మీర్ ప్రభుత్వంలో తీవ్రమైన తగ్గుదలకు కారణం అవుతుంది. ఇది భారత రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణంలో భాగమైన భావన సంబంధిత తీవ్ర ఉల్లంఘనకు దారితీస్తుంది' అని ఆ అభ్యర్థన తెలిపింది.


# వచ్చే నెలలో అమెరికాకు మోదీ!

### ఐరాస సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే అవకాశం

**ఐక్యరాజ్యసమితి :** వచ్చే నెల సెప్టెంబర్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం (యుఎన్‌జిఎ) వార్షిక ఉన్నత స్థాయి సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించే అవకాశం ఉందని ఐరాస జారీ చేసిన వక్తల తాత్కాలిక జాబితా ప్రకారం తెలుస్తోంది.యుఎన్‌జిఎ 80వ సమావేశం సెప్టెంబర్ 9న ప్రారంభమవుతుంది. ఉన్నత స్థాయి సాధారణ చర్చ సెప్టెంబర్ 23,29 వరకు జరుగుతుంది. బ్రెజిల్ ఈ సమావేశంలో సంప్రదాయబద్ధంగా మొదటి వక్తగా ఉంటుంది, ఆ తర్వాత అమెరికా ప్రసంగిస్తుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన రెండవ పదవీకాలంలో మొదటిసారిగా సెప్టెంబర్ 23న ప్రసిద్ధ ఐరాస పోడియం నుండి ప్రపంచ నాయకులను ఉద్దేశించి ప్రసంగిస్తారు.80వ సమావేశం ఉన్నత స్థాయి చర్చ కోసం వక్తల తాత్కాలిక జాబితా ప్రకారం, భారతదేశం ప్రభుత్వ అధినేతసెప్టెంబర్ 26 ఉదయం సమావేశంలో ప్రసంగిస్తారు.అదే రోజు ఇజ్రాయెల్, చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ ప్రభుత్వ అధినేతలు కూడా ఐరాస సాధారణ చర్చలో ప్రసంగించనున్నారు. వక్తల జాబితా తాత్కాలికమైనది. రాబోయే కొన్ని వారాలలో షెడ్యూల్లు, వక్తలలో మార్పులు జరిగే అవకాశం ఉంది. జాబితా దీనికి అనుగుణంగా నవీకరించబడుతూనే ఉంటుంది.

### జనజీవనం అతలాకుతలం
### అనేక గ్రామాలకు స్తంభించిన రాకపోకలు...
### కృష్ణా నదికి భారీ వరద ప్రవాహం...
### ప్రకాశం బ్యారేజీ 70 గేట్లు ఎత్తివేత

# ఎపిలో కుండపోత



**అమరావతి :** అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి.గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు జనజీవనం అతలాకుతలమైంది. విజయవాడ, గుంటూరు నగరాల్లో రహదారులు చెరువులను తలపించాయి. వాగులు, వంకలు, ఏరులు ఉప్పొంగుతున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తుండడంతో కృష్ణా నదికి కూడా భారీ వరద వస్తోంది. దీంతో శ్రీశైలం నుంచి దిగువన ఉన్న ప్రకాశం బ్యారేజీ వరకు అన్నిప్రాజెక్టుల గేట్లు ఎత్తేశారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీకి సుమారు 4 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, మొత్తం 72 గేట్లు ఎత్తి వరద నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. వరద ప్రవాహం గంట గంటకూ పెరుగుతోంది. నదికి ఇరువైపులా చిన్నపాటి వాగుల వరద వచ్చి చేరుతుండడంతో, వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. గురువారం ఉదయానికి వరద 5 లక్షల క్యూసెక్కులు దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. నదీ తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతా ల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వేలాది ఎకరాల్లో పంట భూములు నీట మునిగాయి. వాగుల ఉధృతికి అనేక గ్రామాలకు వాహ న రాకపోకలు స్థంభించాయి. విజయవాడలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇద్దరు మరణించారు. మ్యాన్‌హోల్ కోసం తవ్వి న గుంతలో పడి ఒకరు, పడిన చెట్టును వెంటనే తొలగించకపోవడం వల్ల మరొకరు మృతిచెందారు. మృతుల్లో ఒకరు విజయవాడ నగర 53 వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు టీవీ మధుసూదన్ కావడం గమనార్హం. ఆయన మ్యాన్ హోల్‌లో పడి మృతి చెందగా, మూర్తిజా చెట్టుపడి మృతి చెందారు. పెదకూరపాడు మండలం పరసకాశీపాడు అడ్డరోడ్డు వద్ద కాలచక్ర రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో సత్తెనపల్లి– అమరావతి మార్గంలో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. కంభంపాడు–పరస గ్రామాల మధ్య నక్కల వాగు ఉద్ధతంగా ప్రవహిస్తోంది. దీంతో పరసగుంటూరు మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెదకూరపాడు మండలం తాళ్లూరు, పాటిబండ్ల గ్రామాల్లోని లోతట్టు ఇళ్లల్లోకి వర్షం నీరు చేరింది. జాలలుపురం, పాటిబండ్ల, కంభంపాడు, పరస గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామంలో వాగు పొంగిపొర్లుతోంది. ఈక్రమంలో పిడుగురాళ్ల, క్రోసూరుల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అచ్చంపేటను వర్షం నీరు చుట్టుముట్టింది. దీంతో సత్తెనపల్లి, అచ్చంపేట బస్సు సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. అచ్చంపేట విద్యుత్ ఉపకేంద్రం, ఎస్‌ఎస్పీ భవనంలోకి వరద నీరు ప్రవేశించింది. అమరావతిగుంటూరు మార్గంలోని నరుకుల్లపాడుయంద్రాయి వద్ద వాగు ఉద్ధతంగా ప్రవహిస్తోంది. దీంతో అమరావతి గుంటూరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ నుంచి భారీగా వరద నీరు రావడంతో పంట పొలాలు నీట మునిగాయి. అమరావతి మండలం పెద్ద మద్దూరు వద్ద వాగు ఉద్ధతంగా ప్రవహిస్తోంది. వంతెన పైకి నీరు చేరడంతో అమరావతివిజయవాడల మధ్య రాకపోకల నిలిచిపోయాయి. విజయవాడలో బుడమేరు వాగు ఉధతంగా ప్రవహిస్తోంది. గుణదల వంతెనపై నుంచి బుడమేరు ప్రవాహం కొనసాగుతోంది. ఇబ్రహీంపట్నంలోని చినలంక, పెద్దలంక ప్రాంతాలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తాడికొండ మండలం పొన్నెకల్లులో చెరువుకు గండి పడింది. ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు కాజా టోల్ గేట్ దగ్గర భారీగా వరద నీరు చేరుకుంది.

కోల్‌కత్తా–చెన్నై జాతీయ రహదారిపై వాహనాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దాచేపల్లి పట్టణంలోని రజక కాలనీ, బొడ్రాయి సెంటర్‌తో పాటు పలు కాలనీలు జలమయమయ్యాయి.కేసానుపల్లి గ్రామంలో వాగు పొంగిపొర్లుతోంది. కారంపూడిదాచేపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మాచవరం మండలం రుక్మిణి పురం గ్రామం వద్ద పిల్లేరు వాగు పొంగి పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మాచవరం మండలం గాంధీనగర్ వద్ద వరద నీటితో వాగు పొంగి పొర్లడంతో మాచవరంపిడుగురాళ్ల గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి.

**రైళ్ల రాకపోకలకు అంతరాయం**

భారీ వర్షాలకు పిడుగురాళ్లబెల్లంకొండ మధ్య వంతెన నంబర్59 వద్ద చేరిన నీరు ప్రమాద స్థాయికి చేరుకుంది. గుంటూరు తెనాలి మధ్య వంతెన నంబర్14 వద్ద, వెజెండ్లమణిపురం మధ్య వంతెన నంబర్14 వద్ద కూడా అదే పరిస్థితి నెలకొంది. దీంతో రైల్వే ప్రయాణికుల భద్రతను దష్టిలో పెట్టుకొని 30 కి.మీ./గం. వేగంతో మాత్రమే వెళ్లాలని రైల్వేశాఖ తన సిబ్బందికి అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. సిబ్బంది కూడా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారని, నీరు తగ్గిన తర్వాత మళ్లీ సాధారణ వేగం ప్రారంభమవుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

**విపత్తుల నిర్వహణ సంస్థ అప్రమత్తం**

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీవర్షాలు నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ అప్రమత్తమైంది. పశ్చిమమధ్య, వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీవర్షాలు నేపథ్యంలో విపత్తుల సంస్థ కార్యలయం నుంచి కోస్తా జిల్లాల కలెక్టర్లు, ప్రభుత్వ లైన్ డిపార్టమెంట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారారె, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో విపత్తుల నిర్వహణ శాఖ స్పెషల్ సీఎస్ జి.జయలక్ష్మి, డైరెక్టర్ ప్రఖర్ జైన్, ఎస్డీఆర్ఎఫ్ ఐజి రాజకుమారి, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్, ఐఎండి అమరావతి డైరెక్టర్ స్టెల్లా, ఎపిఎస్డీఎంఎ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్, అధికారులు పాల్గొన్నారు. ఆదివారం వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ళరాదని హెచ్చరించారు.అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థలోని కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలన్నారు.

ప్రజాపక్షం
గురువారం, 14 ఆగస్టు

# పట్టణ వరదలు.. ఎవరికీ పట్టని కష్టాలు

దేశవ్యాప్తంగా కుండపోత వర్షాలు భారీ నష్టాలను, అంతులేని కష్టాలను మిగిలిస్తున్నాయి. చిన్నపాటి వర్షాలకే జలయమవుతున్న నగరాల్లో జనజీవనం అస్తవ్యస్తమవుతున్నది. చెన్నై లేదా బెంగళూరు... ఢిల్లీ లేదా హైదరాబాదు.. నగరం ఏదైనా, చినుకుపడితే చాలు వెల్లువెత్తుతున్న 'పట్టణ వరదలు'. కానీ పాలకులకు పట్టని ప్రజల కష్టాలు. దేశమంతటా ఇదే ముఖచిత్రం. ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన దైన్యం. వర్షాలు తప్పవని తెలిసి కూడా, ఎక్కడ చూసినా వరద నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసే అక్రమ నిర్మాణాలే. ప్రభుత్వ యంత్రాంగాల నిర్లక్ష్య ధోరణులే. భారీ వర్షాలను, పెరిగే నీటి ప్రవాహాలను 'ప్రకృతి విలయాలు'గా చిత్రీకరించినంత మాత్రాన ప్రభుత్వాల బాధ్యతలు తీరిపోవు. వేళ్లూనుకున్న అవినీతి.. అంతులేని నిర్లక్ష్యమే నదీపరీవాహక ప్రాంతాల్లో జలప్రళయాలకు, నగరాల్లో దుర్భర జీవితాలకు ప్రధాన కారణం. సమస్యలు పునరావృతమవుతున్నాసరే, గతం నుంచి పాఠాలు నేర్చుకుంటున్న దాఖలాలు మృగ్యం. ఎన్నో సందర్భాల్లో వినాశకరమైన ఆకస్మిత వరదలకు కారణం ఏమిటో అధికారులకు తెలియకపోవడం ఆశ్చర్యకరం. భారీ వర్షాలు.. వరదలు.. జనావాసాలను ముంచెత్తడాలు వంటి ఘటనలు సంభవించిన చరిత్ర ఉన్నప్పటికీ, నివారణ చర్యలుశూన్యం. 'మేఘాల విస్ఫోటనం', 'ఆకస్మిక వరదలు'... వాడే పదాలు ఏవైతేనేం? జరుగుతున్నది అపార నష్టం. హైదరాబాద్ వంటి నగరాల్లో చిన్నపాటి వర్షాలకే జనావాసాలు మునిగిపోతున్నాయి.. రోడ్లు దెబ్బతింటున్నాయి.. ప్రతి సంవత్సరం ఈ దృశ్యాలు పదేపదే ఆవిష్కృతమవుతున్నాయి. కానీ ఇప్పటికీ స్పష్టమైన ప్రణాళికలు లేవు. వర్షం నీరు పోవడానికి చక్కటి డ్రైనేజీ వ్యవస్థ లేదు. రోడ్ల నిర్మాణంలో లెక్కలేనన్ని నాణ్యతా లోపాలు... అన్యాక్రాంతమవుతున్న కాలువలు, చెరువులు, కుంటలు. నదులకు చేరాల్సిన వరద నీరు అటు పొలాలకు, ఇటు నివాస ప్రాంతాలకు వచ్చి చేరుతున్నది. పంటలకు అపార నష్టాన్ని, ప్రజలకు అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతున్నది. ఏ రకంగా చూసినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వరద నీటి నిర్వహణలో దారుణంగా విఫలమవుతున్నాయి. ఒకే సమస్య పదేపదే వేధిస్తున్నప్పటికీ, నిద్రమత్తులో జోగుతునే ఉన్నాయి. వరదలు ముంచెత్తి ప్రాణాలు తీస్తున్నా స్పందించడం మానేస్తున్నాయి. అధిక శాతం నగరాల్లో వర్షపు కాలువలు కనీసం మూడునాలుగు దశాబ్దాల క్రితం వేసినవే. ఎక్కడ చూసినా ఖాళీ స్థలం తగ్గింది. కాంక్రీటు విస్తరించింది. పట్టణ వరదలకు కారణమవుతున్నది. నిజానికి ఇది సాధారణ సమస్య కాదు. దీని పరిష్కారానికి ప్రత్యేక మార్గదర్శకాలు అవసరం. కొన్ని చట్టాలు ఉన్నా... మార్గదర్శకాలు విడుదలైనా, చాలా రాష్ట్రాలు వాటిని అటకెక్కించాయి. చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నాయి. బాధ్యతను ప్రకృతి పైకి నెట్టి చోద్యం చూస్తున్నాయి. చెరువులు, వాగులు, నాలాలు, వరద నీటి పారుదల వ్యవస్థలన్నీ లేఅవుట్లుగా, పార్కింగ్ జోన్లుగా, గేటెడ్ కమ్యూనిటీలుగా మారిపోవడం ఎవరికీ కనిపించకపోవడం విచిత్రం. నగర కార్పొరేషన్, రెవెన్యూ, పోలీస్, ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ యంత్రాంగాల మధ్య సమన్వయం లేదనడానికి దేశంలోని మహానగరాలను నిరంతరం వేధిస్తున్న వరదలే నిదర్శనం. సాధారణ వర్షాలే జలప్రళయాలుగా మారుతున్న విధానమే తార్కాణం. నగరాలు ఎదుర్కొంటున్న 'వర్షాకాల సమస్య'లకు మానవ లోపాల వాటా 60 నుంచి 70 శాతమని అధ్యయనాలు తేల్చిచెప్తున్నాయి. ఆక్రమణలపై కఠిన చర్యలు అరుదు. వర్షాలు పడినప్పుడు... జనావాసాలు మునిగిపోయినప్పుడు, కొన్ని ప్రాణాలు గాల్లో కలిసినప్పుడు మాత్రమే తాత్కాలిక హడావుడి. అంతేతప్ప శాశ్వత పరిష్కారాలు మృగ్యం. 2005లో ముంబయి, 2015లో చెన్నై, 2020లో హైదరాబాదు, 2022లో బెంగళూరు.. ఎన్నడూ లేంతగా వరద నీటిలో చిక్కుకొని అల్లాడిన నాటి భీకర సందర్భాల నుంచి ప్రభుత్వాలు పాఠాలు నేర్చుకోలేదు. గత రెండు దశాబ్దాలుగా, నిర్మాణాత్మక చర్యలు చేపట్టలేదు. ఎక్కడా వర్షం నీరు భూమిలో కలిసే మార్గాలు లేవు. రుతుపవనాల ఆగమనానికి ముందే డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయడం, వరద నీటి ప్రవాహానికి అడ్డులేకుండా జాగ్రత్తలు తీసుకోవడం అనేవి కాగితాలకే పరిమితం. జాతీయ విపత్తు నిర్వహణ సాధికారిక సంస్థ (ఎన్‌డిఎంఎ) మార్గదర్శకాలు జారీ చేయడానికే పరిమితమైంది. మున్సిపాలిటీల్లో వాటి అమలు సక్రమంగా లేకపోయినా పట్టించుకునేవారు లేరు. అందుకు ఎవరూ బాధ్యత వహించరు. ఎవరూ జవాబుదారులు కారు. వాన నీరు పారడానికి అనువైన వ్యవస్థ ఉండాలన్న కనీస ఆలోచన కూడా ఎవరికీ లేదు. వర్షాలు, వరద నీటి సమస్యపై సరిగ్గా స్పందించడం లేదు, చర్యలు తీసుకోవడం లేదు. ఈ తీరు మారడానికి ప్రభుత్వ వ్యవస్థలు.... యంత్రాంగాలు చిత్తశుద్ధితో కృషి చేస్తే తప్ప నగరాలు, పట్టణాలకు వాన కష్టాలు తీరవు.

# భారతత ఐటి పరిశ్రమకు గడ్డు కాలం

**డాక్టర్ జ్ఞాన్ పాఠక్**

సుమారు 6 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించిన భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేటు రంగ యజమాని టాటా కన్సల్టెన్సీ సర్వీస్(టిసిఎస్) 12 వేల మంది ఉద్యోగులను లే–ఆఫ్ చేస్తున్నట్లు చేసిన ప్రకటన ఉద్యోగులలో తీవ్రమైన అభద్రత భావనను కల్పించడమే కాకుండా, మొత్తం ఐటి రంగంలోనూ తీవ్రమైన ఆందోళనను కలిగించింది. జీవితకాలం ఉద్యోగ కల్పనకు పేరొందిన టాటా తమ టిసిఎస్ సంస్థ ఉద్యోగులలో 2 శాతం తగ్గించుకోవడం గంభీరమైన అంశం.

కృత్రిమ మేధస్సు(ఎఐ) విస్తరణతో ఐటి రంగం ప్రపంచంలోని ఏ ఇతర పరిశ్రమ లేదా రంగం కంటే వేగంగా మార్పు చెందుతోంది. దీనికి భారతదేశం మినహాయింపు కాదు. టిసిఎస్ మేనేజింగ్ డైరెక్టర్ కె.క్రితివాసన్ ఈ చర్యకు ఎఐ అమలులోకి తేవటం కాకుండా ''పరిమిత ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యం సరిపోలకపోవడం'' కారణమని చెబుతున్నారు.

> *ఇదంతా కూడా ఎఐ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి అందుబాటులో లేకపోవడంతో (దీనినే టిసిఎస్''పరిమిత ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యం సరిపోలకపోవడం'' అంటోంది) పాటు ప్రపంచవ్యాప్తంగా ఐటి రంగంలో వ్యాపార నమూనా వేగంగా మార్పు చెందుతున్నట్లు స్పష్టం చేస్తుంది. టిసిఎస్, ఇతర అనేక భారతీయ ఐటి కంపెనీలు సాంప్రదాయంగా పెద్ద సంఖ్యలో తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే నైపుణ్య కార్మికులపై ఆధారపడుతున్నాయని గమనించాలి. వీరిలో అత్యధికులు సాఫ్ట్‌వేర్ సేవలు అందించడంలో నిమగ్నమై ఉన్నారు.*

ఆయన చెప్పినట్లే భావిస్తే, టిసిఎస్‌లో ప్రస్తుత లే–ఆఫ్‌లకు ఎఐ కారణం కాకుండా ఉండే అవకాశం ఉంది, అంతేగాక ఐటి రంగంలో ఎఐ వినియోగానికీ 'పరిమిత ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యం సరిపోలకపోవడం' అనే దానికీ సంబంధం లేదని విశ్వసించటానికీ వీలులేదు. ప్రస్తుత లే ఆఫ్‌లను అంతర్గతంగా జరుగుతున్న విస్తృతమైన, విచ్ఛిన్నకర మార్పులు కారణంగా ఐటి రంగం సాధారణంగా భావిస్తోంది. ఎఐ ప్రభావం పెరుగుదల దాన్ని అనేక రెట్లు పెంచింది.

కొన్ని భారతీయ ఐటి రంగ (చిన్న) కంపెనీలలో ఆర్థిక పరిస్థితులను చూసినట్లయితే ఇబ్బందులను అర్థం చేసుకోవచ్చు. స్వయంగా టిసిఎస్ వేతనాల పెంపు, ఇతర సంస్థల నుంచి చేర్చుకోవడాన్ని నిలిపివేసింది. కంపెనీ వాటాదారులకు గడిచిన నాలుగేళ్ళలో లాభాలు దాదాపు సున్నాగా ఉన్న విషయం తెలుసు. హెచ్‌సిఎల్ కేవలం 1–4 శాతమే వేతనాలను పెంచింది. కానీ మధ్య స్థాయి ఉద్యోగులకు ఇప్పటి వరకు ఎలాంటి పెరుగుదల లేదు. చివరి త్రైమాసికంలో, ఇన్ఫోసిస్ కేవలం 210 మందినే ఉద్యోగాలలోకి తీసుకున్నట్లు సమాచారం. ఇన్ఫోసిస్, విప్రో ఏటేటా వృద్ధిపై మౌనం దాల్చినట్లు తెలిసింది. అన్ని ప్రధాన భారతీయ ఐటి సర్వీసుల కంపెనీల రాబడి పడిపోవడమో లేదా స్తంభించడమో జరిగింది. ఇందుకు ప్రధానంగా అమెరికా, ఐరోపా దేశాలు విధిస్తున్న ప్రతికూల ఆర్థిక,




వాణిజ్య టారిఫ్‌లు, షరతులు, ఎఐ ఆటోమేషన్‌లే కారణం. భారతీయ కంపెనీలు పని ఆర్డర్లు పొందుతున్న మొత్తం పాశ్చాత్య దేశాలపై ఎఐ విస్తరణ ప్రభావం పడింది. ఆ ప్రభావం తిరిగి భారత ఐటి కంపెనీలపై పడుతోంది. ఇదంతా కూడా ఎఐ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి అందుబాటులో లేకపోవడంతో (దీనినే టిసిఎస్''పరిమిత ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యం సరిపోలకపోవడం'' అంటోంది) పాటు ప్రపంచవ్యాప్తంగా ఐటి రంగంలో వ్యాపార నమూనా వేగంగా మార్పు చెందుతున్నట్లు స్పష్టం చేస్తుంది. టిసిఎస్, ఇతర అనేక భారతీయ ఐటి కంపెనీలు సాంప్రదాయంగా పెద్ద సంఖ్యలో తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే నైపుణ్య కార్మికులపై ఆధారపడుతున్నాయని గమనించాలి. వీరిలో అత్యధికులు సాఫ్ట్‌వేర్ సేవలు అందించడంలో నిమగ్నమై ఉన్నారు. ఈ సేవల నమూనా ఇప్పుడు వెనకబడిందని టిసిఎస్ లే–ఆఫ్‌ల ద్వారా స్పష్టమవుతోంది. ఆ సంస్థ మారుతున్న క్షేత్ర స్థాయి పరిస్థితులతో పోటీ పడలేకపోతుంది. వారి అంతర్జాతీయ క్లయింట్‌లు తక్కువ ధరలకు, సాంకేతికంగా ఉత్తమ సేవలను కోరుతున్నారు. వారు ఎఐ ఆధారిత ఆటోమేషన్‌ను విపరీతంగా వినియోగించడం ద్వారా , పునరావృతమయ్యే అనేక పనులను వారు ఇప్పటికే ఆటోమేటెడ్ చేశారు. ప్రవేశ స్థాయి రొటీన్ ఉద్యోగాలు స్థానభ్రంశమవడమే కాకుండా, మధ్య స్థాయి ఉద్యోగాలు రూపాంతరం చెందుతున్నాయి. అనేక పనులకు గాను అంతర్జాతీయ కంపెనీలకు భారతీయ ఐటి కంపెనీల అత్యున్నత సేవలు ఇక ఎంత మాత్రం అవసరం లేదు.

ఇది ఐటి రంగంలో సాధారణ పరిస్థితి. అదే సమయంలో కొద్ది కంపెనీలు సమీప భవిష్యత్తులో మరింత మందిని ఉద్యోగాలలోకి తీసుకుంటామని ప్రకటనలు చేస్తుండడాన్ని విస్మరించలేము. ఉదాహరణకు ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 17 వేల మందిని తీసుకున్నట్లు ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఈ ఏడాదిలోనే మరో 20 వేల మంది గ్రాడ్యుయేట్‌లను తీసుకునే ప్రణాళికలు ఉన్నట్లుగా తెలిపింది. ఇలాంటి పెరుగుదలకు కీలక వృద్ధి చోదకశక్తిగా ఉన్న ఎఐ, క్లౌడ్, వ్యయ పొదుపు లదే ఘనత అని ఇన్ఫోసిస్ సిఇఒ పేర్కొన్నారు.

ఎఐ విస్తరణ, ఇతర నూతన, వినూత్న సాంకేతిక పరిజ్ఞానాల విస్తరణ మాత్రమే భారత ఐటి రంగం వృద్ధికి దోహదం చేస్తుందని సూచిస్తుంది. దీనితో పాటు ప్రస్తుత సర్వీసు ఆధారిత వ్యాపార నమూనాను సమూలంగా మార్చి, సాధ్యమైతే ఉత్పత్తి ఆధారిత నమూనాను ఎంచుకోవాలి. అనేక అంతర్జాతీయ కంపెనీలు భారతీయ ఐటి కంపెనీలపై ఆధారపడడాన్ని, ఖర్చులను తగ్గించుకునేందుకు తాజాగా తమ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్(జిసిసి)లను భారతదేశంలో తెరుస్తున్నాయి. 2023–24లో జిసిసి ఎకోసిస్టమ్‌లో 40 శాతం పెరుగుదల ఉండగా, సేవల ఆధారిత భారత ఐటి కంపెనీలు కేవలం 5 శాతం పెరుగుదలనే చూపిన విషయాన్ని గమనించాలి. ఖర్చులు, టెక్నాలజీ విషయాలలో ఎదుగుతున్న వియత్నాం, ఫిలిప్పీన్స్, మెక్సికో, తదితర ఇతర దేశాల ఐటి కంపెనీలతో మన భారతీయ ఐటి కంపెనీలు పోటీ పడాల్సి రావడాన్ని కూడా గమనించాలి. కొత్తగా ఉద్భవిస్తున్న పరిస్థితి మొత్తం దేశ ఆర్థిక రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈ రంగం 2023–24లో భారతదేశ జిడిపికి 7.5 శాతాన్ని అందజేయడంతో పాటు 50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించింది.

అనేక పరిశ్రమలలో డిజిటల్ రూపాంతరం పెరిగి, భారతదేశం విపరీతమైన వృద్ధిని చవిచూడడం ద్వారా 2025లో ఐటి సర్వీసులకు అంతర్జాతీయ డిమాండ్ పెరుగుతుందని భారతీయ ఐటి రంగంపై పాత అంచనా. ఐటి ఎగుమతులు 210 బిలియన్ డాలర్లకు చేరుతాయని, దేశంలో మొత్తంగా ఐటి వ్యయం 11.2 శాతం పెరిగి సుమారు 160 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. వివిధ పరిశ్రమలలో ఐటిలో ఉద్యోగ అవకాశాలు 15–20 శాతం పెరుగుతాయని ఆశించారు. భారత ఐటి రంగం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లను అధిగమించేందుకు వేగంగా ఎఐ,ఇతర సాంకేతిక పరిజ్ఞానాలను విస్తరించడం, వ్యాపారా నమూనాను మార్చటం, భారీ స్థాయిలో నైపుణ్యం, పునఃనైపుణ్యం పెంచడం అత్యవసరం.

> *ఇది ఐటి రంగంలో సాధారణ పరిస్థితి. అదే సమయంలో కొద్ది కంపెనీలు సమీప భవిష్యత్తులో మరింత మందిని ఉద్యోగాలలోకి తీసుకుంటామని ప్రకటనలు చేస్తుండడాన్ని విస్మరించలేము. ఉదాహరణకు ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 17 వేల మందిని తీసుకున్నట్లు ఇన్ఫోసిస్ ప్రకటించింది.*

> *అనేక పరిశ్రమలలో డిజిటల్ రూపాంతరం పెరిగి, భారతదేశం విపరీతమైన వృద్ధిని చవిచూడడం ద్వారా 2025లో ఐటి సర్వీసులకు అంతర్జాతీయ డిమాండ్ పెరుగుతుందని భారతీయ ఐటి రంగంపై పాత అంచనా. ఐటి ఎగుమతులు 210 బిలియన్ డాలర్లకు చేరుతాయని, దేశంలో మొత్తంగా ఐటి వ్యయం 11.2 శాతం పెరిగి సుమారు 160 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. వివిధ పరిశ్రమలలో ఐటిలో ఉద్యోగ అవకాశాలు 15–20 శాతం పెరుగుతాయని ఆశించారు.*

# చిన్నారుల్లో మానసిక సంక్షోభం

భయం, మౌనం, ఒత్తిడి అనేవి చిన్నారుల మనసులో పెరుగుతున్న కనిపించని సమస్యలు – తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సున్నితమైన స్పందనతోనే పరిష్కారం. ఆధునిక యుగంలో తల్లిదండ్రులు పిల్లల శారీరక ఆరోగ్యంపై శ్రద్ధ పెంచుకుంటున్నప్పటికీ, మానసిక ఆరోగ్యంపై అవగాహన మాత్రం ఇంకా వెనుకబడి ఉంది. స్కూల్‌లో ఒత్తిడి, ఇంట్లో గొడవలు, స్నేహితుల మధ్య పోలికలు. ఇవన్నీ పిల్లల మనసులో కనిపించని గాయాలను మిగులుస్తాయి. నా మనసు చెప్పాలనుకుంటున్నాను. కానీ భయం తో మౌనంగా ఉన్నా అని ఒక చిన్నారి చెప్పే మాట, మన సమాజం ఎంత వరకు పిల్లల భావోద్వేగాలను పట్టించుకుంటుందో ప్రశ్నిస్తుంది. మనం తరచుగా వారి బాహ్య ప్రవర్తనను మాత్రమే గమనిస్తాం. కానీ వారి అంతర్మనసులో ఏం జరుగుతుందో అర్థం చేసుకోవడంలో విఫలమవుతాం. ఇదే పరిస్థితి వారికి మానసిక సమస్యల దారితీసే మొదటి అడుగుగా మారుతుంది. పిల్లలు నిత్యం ఎదుర్కొంటున్న భావోద్వేగ ఒత్తిడులు, నిరసనలు, మౌనం ఇవన్నీ కనిపించని గాయాలుగా మిగిలిపోతున్నాయి. చీకట్లో నడిచేటప్పుడు నేను పట్టుకునే చేయి మీదే కావాలి అని తల్లిదండ్రులను కోరుకుంటున్న చిన్నారి మనసులు. పిల్లల మానసిక ఆరోగ్యం – కేవలం కనిపించేది కాదు, అనుభవించేది కూడా.



పిల్లల మనస్సు పచ్చని మొక్కలా సున్నితమైనది. ఒక చిన్న నిర్లక్ష్యం, కఠినమైన మాట, లేదా అశ్రద్ధ చూపు. ఇవి పిల్లల మనసులో భయం, ఆత్మనింద, నిరుత్సాహం వంటి విత్తనాలను నాటుతాయి. అవి పెరిగి పెద్ద మానసిక సమస్యలుగా మారే ప్రమాదం ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం, భారతదేశంలో 13–17 ఏళ్లలోపు పిల్లల్లో కనీసం 15% మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. ఆందోళన, డిప్రెషన్ ప్రధాన సమస్యలుగా గుర్తించడం జరిగింది. మానసిక ఆరోగ్యం అనేది కేవలం సమస్య లేకపోవడం కాదు. అది పిల్లలు తమ భావాలను అర్థం చేసుకోవడం, కమ్యూనిటీతో మంచి సంబంధాలు పెంచుకోవడం, ఒత్తిడిని ఎదుర్కోవడం, ఆత్మవిశ్వాసంతో ఎదగడం ఇవే పిల్లల మానసిక ఆరోగ్యానికి సూచిక. చాలా సార్లు పిల్లలు తమ బాధను చెప్పలేరు. కారణాలు అనేకం. నన్ను కోపంగా చూస్తారు అన్న భయం, నన్ను పిచ్చివాడిలా చూస్తారు అన్న అవమానం, భావాలను వ్యక్తపరచడానికి సరైన పదాలు తెలియకపోవడం, లేదా వాళ్లు వినరేమో అన్న నిరాశ. ఫలితంగా పిల్లలు మాట్లాడలేక మౌనంగా మారతారు, ఒంటరితనాన్ని ఎంచుకుంటారు లేదా ప్రతిఘటన ప్రవర్తనతో స్పందిస్తారు. పెద్దలు ఇంత చిన్నదానికే భయ మా? అని చిన్నచూపు చూడటం, లేదా సిగ్గుపడాలి అని మందలించడం. ఇవన్నీ పిల్లల్లో భయం కంటే అవమానం, నేరపరచే భావనను పిల్లల్లో పెంచుతాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల భయాలను అంగీకరించి, భరోసా కల్పించడం అత్యవసరం. నీకు భయం అనిపిస్తోందా? అని మృదువుగా అడగడం, వారి అనుభూతిని అర్థం చేసుకుంటున్నామనే భావన ఇవ్వడం, ఊహాజనిత భయాలను క్రమంగా వాస్తవానికి అనుసంధానం చేయ డం. ఇవన్నీ పిల్లలకు ధైర్యం నింపుతాయి. ప్రతి రోజు కనీసం 15 నిమిషాలు పిల్లలతో ప్రత్యేకంగా మాట్లాడటం, వారు చెప్పే చిన్న విషయాలను గౌరవించడం, అవసరమైతే కౌన్సిలర్ సలహా తీసుకోవడం, ఇవి పిల్లల మానసిక ఆరోగ్యాన్ని కాపాడే చిన్న చిన్న చిట్కాలే కావచ్చు కానీ చాలా ప్రభావవంతమైన మార్గాలుగా పని చేస్తాయి. చీకట్లో నడిచేటప్పుడు నేను పట్టుకునే చేయి మీరు కావాలి అనే ఒక చిన్నారి మాట మనకు గుర్తు చేస్తుంది. పిల్లల భద్రత కేవ లం భౌతిక రక్షణ కాదు, భావోద్వేగ రక్షణ కూడా అంతే ముఖ్యం. వారిని మనం అర్థం చేసుకున్నప్పుడు మాత్రమే వారు జీవితాంతం ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలరు.

**– డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి**
9703935321

# విద్యావంతుల్లో కూడా కొరవడిన ఆర్థిక అక్షరాస్యత!

'ధనం మూలం ఇదం జగత్' అంటారు ప్రపంచం ధనంతోనే నడుస్తుంది. డబ్బు ఎవరికీ చేదు కాదు. ధనమేరా అన్నిటికీ మూలం. ధనం విలువ తెలుసుకొనుట మానవ ధర్మం. డిజిటల్ యుగంలో ఆర్థిక వనరులే అన్నింటినీ శాసిస్తున్నాయి. నేటి మానవ బంధాలన్నీ వాణిజ్య బంధాలుగా మారాయి. డబ్బు సంపాదించడం ఒక ఎత్తు, సంపాదించిన డబ్బును వినియోగించడం మరో ఎత్తు. ఎంత సంపాదించామన్నదాని కన్న ఎంత ఆదా చేస్తున్నామన్నది ముఖ్యమని మన జీవిత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. ఆర్థిక క్రమశిక్షణ కొరవడిన కుటుంబాలు బజారున పడడం చూస్తున్నాం. ఆదాయాన్ని క్రమ ప్రణాళికతో ఖర్చు చేయడం వల్ల ఆ వ్యక్తితో పాటు కుటుంబం కూడా సుఖ సంతోషాలతో, ధైర్యంగా జీవన యానం కొనసాగిస్తారు. అనాలోచితంగా, విచ్చలవిడిగా ఖర్చు చేసిన వారు ఎంత సంపాదించినా ప్రయోజనం శూన్యమే. నేటి ఆదాయం రేపటికి పునాది కావాలి. ఆర్థిక క్రమశిక్షణ చిన్నతనం నుంచే అలవాటు కావాలి. ఉన్నత విద్యావంతుల్లో కూడా ఆర్థిక నిరక్షరాస్యత కనిపిస్తున్నది. ఆర్థిక అవగాహన లేమితో కుటుంబాలు అశాంతి నెలవులుగా మారుతున్నాయి. నేటి పిల్లలు, యువతలో ఆర్థిక నిరక్షరాస్యత రాజ్యమేలుతున్నది. ఎంత సంపాదించామన్నది ముఖ్యం కాదని, ఆదాయంలో ఎంత పొదుపు చేశామన్నదే ప్రధానమని మరిచిన ఏఐ ప్రపంచంలో మనం ఉన్నాం. నేటి పిల్లల నుంచి కురువృద్ధుల వరకు అందరికీ ఆర్థిక అక్షరాస్యత కల్పించటానికి ప్రతి ఏట 14 ఆగష్టున జాతీయ ఆర్థిక అవగాహన దినం లేదా నేషనల్ ఫైనాన్సియల్ అవేర్నెస్ డే పాటించడం జరుగుతోంది. మన విద్యా వ్యవస్థలో కూడా ఆర్థిక అక్షరాస్యతను బోధించడం లేదు. చిన్న పిల్లలకు పాకెట్ మనీ ఇచ్చినపుడు వారు 'గల్ల గురిగి'లో వేసి దాచుకోవడం మనకు తెలుసు. అదే అలవాటు క్రమంగా ఆర్థిక క్రమశిక్షణకు పునాదిగా మారుతుంది. చిన్నతనంలోనే విచ్చలవిడిగా ఖర్చు చేయడం అలవాటు అయితే రేపటి వారి భవిత అంధకారంలోకి జారిపోవడం ఖాయమని తెలుసుకోవాలి. పిల్లాడి స్థాయిలో అలవాటు అయిన ఆర్థిక క్రమశిక్షణ రేపటి కుటుంబ శాంతికి పునాదిగా మారుతుంది. జాతీయ ఆర్థిక అవగాహన దినం వేదికగా వేతనం పొందడం, పొదుపు చేయడం, ఆర్థిక ప్రణాళికలు వేయడం, కనీస ఖర్చులు చేయడం, తప్పని పరిస్థితుల్లో అప్పు చేయడం, ఆస్తులను పెట్టుకోవడం లేదా కాపాడుకోవడం లాంటి అంశాలను అవగాహన కలిగించాలి. మన నెలసరి ఆదాయంలో కొంత కుటుంబ ఖర్చులకు, కొంత పిల్లల చదువులకు, కొంత అత్యవసర సామాజిక ఖర్చులకు వెచ్చించిన పిదప తప్పనిసరిగా కొంత డబ్బును పొదుపు లేదా ఆదా చేయడం అలవాటుగా మారాలి. నేడు పొదుపు చేసిన ధనం రేపటి ఊహించని అత్యవసర సమయాల్లో మనల్ని ఆదుకుంటుంది. పొదుపు చేసిన డబ్బును సరైన పద్ధతిలో పెట్టుబడి పెడుతూ, మన ఆస్తిని పెంచుకోవచ్చు. చిరిగిన బట్టలు వేసుకోవడం, తెగిన చెప్పును తిరిగి తిరిగి వాడడం, సనీస అవసరాలకు ఖర్చు చేయకపోవడం, తింటే ఖర్చు అవుతుందని కాలే కడుపుతో పడుకోవడం లాంటివని పిసినారి గుణాలుగా భావిస్తాం. విలాసాలను కూడా కనీస అవసరాలు అనుకుంటూ, గోరుతో పోయే దానిని గొడ్డలి దాకా తెచ్చుకున్నట్లు, తక్కువ ఖర్చుతో జరిగే పనికి అనేక రెట్లు అధికంగా ధనాన్ని నీటి వలె ఖర్చు చేయడం వల్ల భవిష్యత్తు చిక్కుల్లో పడుతుంది, రుణ విష వలయంలోకి నెట్టివేస్తుంది. డబ్బు ఉన్నపుడు ఎగిరి పడడం, లేనప్పుడు కుంగిపోవడం ధీరత్వం కాదు. అప్పులు చేయడం, ఆర్థిక చిక్కులతో ఆత్మహత్య చేసుకోవడం వీరత్వం కాదు. ప్రాధాన్యాలను మరిచి విచక్షణారహితంగా ఖర్చు చేయవద్దు. కనీస అవసరాలకు, విలాసాలకు మధ్య వ్యత్యాసం తెలుసుకోవాలి. మన పిల్లలకు పాఠశాల స్థాయి నుంచి కంప్యూటర్ లిటరసీ నేర్పినట్లే, ఆ చిన్నారులకు ఫైనాన్సియల్ లిటరసీ కూడా నేర్పాలి. ఆకర్షణీయ వేతనం అందించిన విద్యకు సరిసమానంగా ఆదాయాన్ని ఖర్చు చేసే ఆర్థిక అక్షరాస్యత కూడా అవసరమని తెలుసుకోవాలి. చాప ఉన్నంత వరకే కాళ్లు చాపుకున్నట్లు, ఆదాయ పరిమితులను గమనించి ఖర్చులను కుదించుకోవాలి. అనారోగ్యాలు, ప్రమాదాలు చెప్పి రావు కాబట్టి రేపటి అత్యవసరాలను నేటి పొదుపు ఆదుకునే విధంగా ప్రణాళికలు వేసుకోవాలి. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్క బెట్టుకున్నట్లు, డబ్బు ఉన్నపుడే ఆదా చేయడం నేర్చుకోవాలి. మన నెలసరి ఆదాయంలో కొంత మొత్తం పొదుపు చేయడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలుసుకోవాలి. కుటుంబ అవసరాలు, పిల్లల విద్యకు తగిన ఖర్చులకు వెనకాడకుండా కొంత సొమ్మును విధిగా పొదుపు చేయాలి. ఉద్యోగంలో చేరిన రోజే పదవి విరమణ తేదీ ఖరారు అవుతుంది కాబట్టి తొలి నాళ్ల నుంచే పొదుపు మార్గం ఎంచుకోవాలి. ఆర్థిక క్రమశిక్షణతో వృత్తిలో ఎదుగుదల, సాఫీగా వైవాహిక జీవితం కొనసాగడం, స్వంత ఇల్లు కల సాకారం కావడం, పిల్లలకు ఉన్నత విద్య అందించడం, ఊహించని ఖర్చులను తట్టుకోవడం, వాహనాలను కలిగి ఉండడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. 'తెలియకపోవడం తప్పు కాదు, తెలిసి పొదుపు చేయకపోవడం తప్పు' అని గమనించాలి. ఆర్థిక క్రమశిక్షణ కొరవడిన కుటుంబాల్లో గొడవలు, అప్పుల బాధలు, అశాంతి, భవిష్యత్తు పట్ల అనిశ్చితి, మానసిక ఒత్తిడితో అనారోగ్యాలు,:కుటుంబ పోషణలో ఇబ్బందులు, పిల్లల పెంపకంలో అవాంతరాలు ఎదురవుతాయి. మన పిల్లలకు విద్యతో పాటు మంచి అలవాట్లు, మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాసం, కనీస కంప్యూటర్ పరిజ్ఞానం, ఆర్థిక అక్షరాస్యత లాంటి అంశాలను తప్పనిసరిగా నేర్పించాలి. నేటి తల్లితండ్రులతో పాటు ఉపాధ్యాయుల బాధ్యత అని మరువరాదు. నాడు నగదుతో మాత్రమే జరిగిన క్రయవిక్రయాలు నేటి యువత చేతుల్లో క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, ఆన్‌లైన్ చెల్లింపులు, ఈ వాణిజ్యాలు లాంటి సౌకర్యాలు కొన్ని సందర్భాల్లో ప్రమాదకర పరిస్థితులకు దారి తీయడం చూస్తున్నాం. నేటి యువత ఆర్థిక అక్షరాస్యత ప్రాధాన్యాన్ని తెలుసుకొని, పొదుపుకు ప్రాధాన్యమిస్తూ, ఖర్చులకు పరిమితులను ఏర్పరచుకొని ముందుకు సాగితే వారి భవిష్యత్తు సాఫీగా, ఆనందంగా కొనసాగుతుంది.



**– మధుపాళీ**
9949700037

# ధీర వనిత అనిశెట్టి రజిత

తెలుగు సాహిత్య లోకంలో ఒక ధిక్కార స్వరం మూగబోయింది. ప్రముఖ కవయిత్రి, ప్రజా గాయని, రచయిత్రి అనిశెట్టి రజిత గుండెపోటుతో ఆగస్ట్ 11, 2025న వరంగల్‌లో మనలను శాశ్వతంగా విడిచిపోయారు. ఆమె లేని లోటు కేవలం ఒక వ్యక్తి నష్టం మాత్రమే కాదు, తెలంగాణ సాహిత్యం, ఉద్యమాలకు, స్త్రీవాద భావనలకు తీరని లోటు. రజిత జీవితం ఒక స్ఫూర్తిదాయకం. శ్రమజీవుల పక్షాన నిలిచి, అణచివేతలకు వ్యతిరేకంగా కలం పట్టిన యోధురాలు. ఆమె రచనలు సామాజిక అసమానతలను ఎదిరిస్తూ, ప్రశ్నిస్తూ, మానవత్వాన్ని ప్రకటిస్తాయి. అనిశెట్టి రజిత 1958 ఏప్రిల్ 14న వరంగల్‌లో జన్మించారు. విద్యార్థి దశ నుంచే ఆకాశవాణి ద్వారా తెలంగాణ ఉద్యమ సంఘర్షణలు, కవి సమ్మేళనాలు, దాశరథి, ఆరుద్ర వంటి మహనీయుల ఉపన్యాసాలకు ఆకర్షితులయ్యారు. 1969లో తొమ్మిదో తరగతి చదువుతుండగానే తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పాల్గొన్నారు. మలిదశ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ ప్రోత్సాహంతో బహిరంగ సభల్లో ప్రసంగాలు చేసి, ప్రజలను ఉద్యమం వైపు మళ్లించారు. ఈ అనుభవాలు ఆమె రచనల్లో ప్రతిబింబిస్తాయి. 1973లో ఇంటర్ చదువుతున్నప్పుడు 'చైతన్యం పడగెత్తింది' అనే తొలి రచనతో సాహిత్య విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. 'గులాబీలు జ్వలిస్తున్నాయి' ఉద్యమ అనుభవాల నుంచి జన్మించింది. అందు లో తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ప్రతిధ్వనిస్తాయి. 'నేనొక నల్లమబ్బునవుతా' స్త్రీవాద ఉద్యమ ప్రభావంతో రూపుదిద్దుకుంది. మహిళల అణచివేతను విమర్శిస్తుంది. 'చెమట చెట్టు', 'ఓ లచ్చువ్వ', 'ఉసురు', 'గోరంత దీపాలు', 'దస్తఖత్', 'అనగనగా కాలం', 'మట్టి బంధం', 'నన్హే ఓ నన్హే', 'మార్కెట్ స్మార్ట్ శ్రీమతి', 'నిర్భయాకాశం కింద' వంటి సంపుటాలు ఆమె సాహిత్య పిపాసను చాటుతాయి. హైకూల సంపుటి, ఆచార్య పాకాల యశోదారెడ్డిపై మోనాగ్రాఫ్ కూడా రాశారు. మొత్తం 500కి పైగా కవితలు, 100కి పైగా వ్యాసాలు, 30కి పైగా పాటలు రచించారు. ఆమె సాహిత్యం కేవలం కళాత్మకం కాదు, సామాజిక మార్పుకు సాధనం. స్త్రీవాదం, దళిత ఉద్యమాలు, తెలంగాణ గొంతుకలు ఆమె రచనల్లో మిళితమవుతాయి. ఉదాహరణకు, 'నిన్ను నీవు వదులుకున్న రోజు' కవితలో ఆమె ఇలా అంటారు: 'నిన్ను నీవు వదులుకోని రోజు/ఎవరిని ప్రేమించలేవు/బతికున్న శవంగానే మిగిలిపోతావు'. ఇది వ్యక్తిగత స్వేచ్ఛ మరియు ప్రేమ మధ్య సంబంధాన్ని విశ్లేషిస్తుంది, మానవత్వాన్ని హృదయానికి దగ్గర చేస్తుంది. ఆమె వ్యక్తిత్వం స్నేహశీలి, సాదాసీదా. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) జాతీయ అధ్యక్షురాలిగా, సాహిత్య సమావేశాల్లో ఆమె మాటలు యువ రచయితలను ప్రేరేపిస్తాయి. ఆమె సాహిత్యం మట్టి బంధం లాంటిది సమాజం పట్ల బాధ్యతావంతమైనది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనేక అవార్డులు అందుకున్నారు: 2014లో తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, 2016లో అలిశెట్టి ప్రభాకర్ పురస్కారం. ఆమె రచనల్లో స్త్రీవాదం ప్రబలంగా కనిపిస్తుంది. 'ధిక్కారం' కవితలో: 'ఇక నీ ఆటలు సాగనివ్వం/ నీ తోకను ముడువకుంటే/ నీ పీకను వధ్యశిలపై పెట్టు/ నరకటానికి సిద్ధంగా ఉన్నాం/ఖబడ్దార్! మృగాధిపత్యమా'. ఇది పురుషాధిక్యతపై ధిక్కారం, స్త్రీల శక్తిని ప్రకటిస్తుంది. ఆమె సాహిత్యం మానవత్వాన్ని ఉద్దీప్తం చేస్తుంది – పీడితుల పక్షాన నిలిచి, సమానత్వం కోసం పోరాడుతుంది. రజిత మానవత్వం ఆమె చర్యల్లో ప్రతిఫలిస్తుంది. గతేడాది శరీరదానానికి అంగీకరించి, మరణానంతరం నేత్రదానం చేసి, భౌతికకాయాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఇది ఆమె సదాశయానికి నిదర్శనం. ఆమె రచనలు కేవలం పదాలు కావు, జీవిత దర్శనం. 'ఆఖరి మగాడు'లో: 'మేము ఊరుకోము, మనుస్మృతుల అగ్నికీలల్లో కాలము.. కదంతొక్కుతాం/ఈ యుద్ధంలో సమిధలై/ ఆఖరి మొగాళ్లుగా.. నిలుస్తారో మీ ఇష్టం!/ఆడవాళ్ళు పువ్వులే కాదు అగ్నిశిఖలని మరువకండి!'. ఇది స్త్రీలను అగ్నిశిఖలుగా చిత్రీకరిస్తూ, మార్పుకు పిలుపునిస్తుంది. ఆమె సాహిత్యం సమకాలీన సమస్యలను స్పృశిస్తుంది. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబానికి, బంధు, మిత్రులకు, సాహితీ అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. రజిత లాంటి యోధురాళ్లు మనకు నిరంతర స్ఫూర్తిగా నిలుస్తారు.



**– డా.కె.రామ్ కిశోర్**
9849328496

## డిప్యూటేషన్ రద్దు చేయాలని వినతి

**ప్రజాపక్షం/మక్తల్ :** (ఎంపిపిఎస్) పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుని డిప్యూటేషన్ రద్దు చేయాలని మండల విద్యాధికారికి గ్రామస్తుల ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. మక్తల్ మండల పరిధి లోని మధ్వార్ గ్రామంలో ఎంపిపిఎస్ పాఠశాలలో గత కొంత కాలం నుంచి పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రవీందర్ రెడ్డి డిప్యూటేషన్ పై వెళ్తున్నా డన్నా విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఉపాధ్యాయుడు వెళ్లడానికి వీల్లే దని ఇక్కడే పనిచేసేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గత సంవత్సరం ఒక ఉపాధ్యాయుని డిప్యూటేషన్‌పై పంపినందున మా విద్యార్థులకు చాలా నష్టం జరిగిందని, ప్రస్తుతం పాఠశాలలో 116, మంది విద్యార్థులు ఉన్నారని వారికి నష్టం జరుగకుండా ప్రభుత్వ నియమాల ప్రకా రం మా పాఠశాలకు కేటాయించిన నలుగురు, ఉపాధ్యాయులను ఇక్కడే ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డిప్యూటేషన్ పై వెళుతున్న ఉపా ధ్యాయుడు రవీందర్ రెడ్డి, డిప్యూటేషన్ రద్దు చేసి మా పాఠశాలకు పంప లని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కర్ని శ్రీనివాస్, ఆర్ఎంపీ రామకృష్ణ, బాలరాజు, కర్నే బాలరాజ్, గుడిసె రాజు, కర్ని హుస్సేన్, పేట అంజప్ప, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల సివిల్ నిర్మాణ పనులపై సమీక్షా సమావేశం



**ప్రజాపక్షం/మద్దూర్ :** మద్దూర్ పట్టణ కేంద్రంలోని గర్ల్స్ హైస్కూల్లో బుధవారం పాఠశాల నిర్మాణ సివిల్ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్ సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు మండలాల పరిధిలో యుడైస్ డాటా వెంటనే అప్డేట్ చేయాలన్నారు. డ్రాప్ బాక్స్‌లోని స్టూడెంట్స్ ఇంపోర్టు వెంటనే చేయాలన్నారు. విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులు వెంటనే పూర్తి చేయలన్నారు. అప్పర్ పర్సంటేజ్ పెంచి [illegible] చేయాలన్నారు. ఓపెన్ స్కూల్లో అడ్మిషన్లు పెంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కు మార్, డిఇవో గోవిందరాజు, ఎంఇవోలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ కిందపడి వ్యక్తి అక్కడికక్కడే మృతి



**ప్రజాపక్షం/ మద్దూర్ :** ట్రాక్టర్ కిందపడి ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘ టన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మండల పరిధిలోని హన్మ్యానాయక్ తాండ దగ్గర ఈ ఘటన చోటు చేసుకుంది. అదే గ్రామానికి చెందిన గణేష్ నాయక్ తన ఇంటి నిర్మాణం కోసం రాళ్ళను ట్రాక్టర్ లోడ్‌తో వస్తున్న తరుణంలో తాండ దగ్గర ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి అక్కడిక క్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరు కున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## మాదకద్రవ్యాలపై అవగాహన

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** మండల పరిధిలోని భూనీడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం రోజు విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పాల్ ప్రసన్నరాణి మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు మరియు అధ్యాపకులు కలిసి సాము హిక ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అద్యపకులు మధూసు దన్ రెడ్డి, భాస్కర్, హేమలత, సుల్తానా, మోహన్ రెడ్డి, సంజీవ్, మల్లేష్ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలకు భద్రత కట్టుదిట్టం : జిల్లా ఎస్పీ



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నారాయణపేట జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో స్వతంత్ర వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పరిశీలించారు. రానున్న రెండు రోజులలో భారీ వర్షాలు ఉన్నందున స్వతంత్ర దినోత్సవ వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ అధికారులతో కలిసి తగు ఏర్పాట్లను చేయాలని, పరేడ్ మైదానంలో సాయుధ పోలీసుల కవాతును బాగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. వేడుకలను తిలకించడానికి వచ్చే అతిథులకు, విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఎస్పీ తెలిపారు. ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ యం.డీ, రియాజ్ హుల్ హక్, ఆర్ఐ నరసింహ, ఆర్‌యస్ఐలు ఉన్నారు.

## బిసి బిల్లుపై బిజెపిది ద్వంద్వ వైఖరి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్‌పై మండల బిజెపినా యకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకొని దమ్ముంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నుంచి తల్లోజు ఆచారి కల్వకుర్తి నియోజకవర్గానికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మబ్బురామరాజు, ఆస్పత్రి అభివృ ద్ధికమిటి సభ్యురాలు రేష్మబేగం డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయ ణరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అభివృద్ధిప థంలో నడిపిస్తున్నారని సందేహం ఉంటే బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రాజకీయంగా పోటిపడుదామని, కాని చిల్లరరాజకీ యాలు మానుకోవాలని బిజెపి నాయకులకు హితవు పలికారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించే ఆనంద్‌కుమార్‌ని విమర్శించే స్థాయి మీకు ఉందా అని ప్రశ్నించారు. కల్వకుర్తి పట్టణ ప్రజలు గుర్తుపట్టని వ్యక్తి బిజెపి పార్టీలో చైర్మన్ అభ్యర్థిని చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో లేని సమయంలో ఏడుమంది కౌన్సిలర్లు గెలవడం జరిగిం దని, మీకు ఒకసీటు వచ్చిన విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లాప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు పుస్తకాలరాహుల్, చంద్ర కాంత్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు ఎజాస్, చిన్నరవి, శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు వెంకటరెడ్డి, సంతుయాదవ్, శ్యాంసుం దర్‌రెడ్డి, ఆరిఫ్, దశనాయక్, మైనార్టీ నాయకురాలు రెహానా పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కమ్యునిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



**ప్రజాపక్షం/నారాయ-ణపేట్ :** కోస్గి మండల కేంద్రంలోని అట్కర్ గల్లిలో బుధవారం తెల్ల వారుజామున 6 గంట ల నుండి 8 గంటల వరకు 6 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో ఆకస్మికంగా (కార్డన్ సెర్చ్) కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి సుమారు 250 ఇండ్లను సోదాలు నిర్వహించి కొంతమంది వ్యక్తిగత వివరాలు సేకరించి ఎవరైనా కొత్త వ్యక్తులు ఉన్నారా అని, సరైన పత్రాలు లేని 56 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ నేరాల నిర్మూలన కొరకే కమ్యునిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని, ప్రజల రక్షణ, ప్రజలకు భద్రత భావం, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించడం గురించి, ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు గాని వచ్చి షెల్టర్ తీసుకుం టున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని, చట్టవ్యతిరేకమైన కార్యకలా పాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజల భద్రత పరిరక్షణ కోసం ఇలాంటి కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు భవిష్య త్తులో కూడా కొనసాగుతాయని ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని, డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోస్గి సీఐ సైదులు, ఎస్ఐ లు బాలరాజు, విజయ్ కుమార్, రాముడు, ఎస్‌యం నవీన్, రమేష్, మహేశ్వరి, గాయత్రి, పోలీసు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# నవజాతశిశువులకు విధిగా పోలియో చుక్కలు

### కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ప్రజాపక్షం/పాన్‌గల్ :** నవజాత శిశువులందరికి పోలియో చుక్కలతో పాటు అన్ని రకాల రోగ నిరోధక టీకాలను సకాలంలో సమాచారం అందించి వేయించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం పాన్‌గల్ మండల పరిధిలోని అన్నారం గ్రామ పంచాయతీలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ క్రమంలో అక్కడే చిన్నా రులకు సిబ్బంది రోగ నిరోధక టీకాలు వేయడాన్ని పరిశీలించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవజాత శిశువులందరికి పోలియో సహ అన్ని రకాల రోగ నిరోధక టీకాలను సకాలంలో సమాచారం అందించి వేయించా లని ఆదేశించారు. తల్లిపాల ద్వారా బిడ్డలకు రోగ నిరోధక శక్తి పెరుగుతుం దని , మొదటి ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లిపాలే ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

**యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు ...**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరు వుల గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల గోదాంలో సేల్ రిజిస్టర్ ను పరిశీలించిన కలెక్టర్ యూరియా నిల్వ వివరాలను తనిఖీ చేశారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా నిల్వ ఉందని, రైతులు ఆందోళన పడ కుండా ప్రస్తుతం అవసరమైన మోతాదులో మాత్రమే తీసుకువెళ్లేలా అవగా హన కల్పించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా యూరియా కొనుగోలు చేయడానికి వచ్చిన ఓ రైతుతో కలెక్టర్ మాట్లాడారు. ఎన్ని ఎకరాల్లో పంట వేశారు. ఎన్ని బస్తాలు తీసుకెళ్తున్నారు అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**బట్టీ విధానానికి స్వస్తి పలకాలి....**

పాన్‌గల్ మండల పరిధిలోని శాఖాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. డిఈఓతో కలిసి పాఠశాలలో గత ఏడాది పాస్ పర్సంటేజ్‌ను, ఈ ఏడాది విద్యార్థుల పర్ఫామె న్స్‌కు సంబంధించిన రిపోర్టులను తెప్పించుకొని పరిశీలన చేసి ఈ సారి ఒక్కరు కూడా ఫెయిల్ అవ్వకుండా జాగ్రత్తగా సన్నద్ధం చేయాలని సూచిం చారు. పాఠశాలల్లోని కంప్యూటర్ ల్యాబ్‌ను సందర్శించి వెనుకబడిన విద్యార్థు లకు ఏ విధంగా శిక్షణ ఇస్తున్నారనే విషయాన్ని పరిశీలించారు. విద్యార్థు



లకు టైంటేబుల్‌కు అనుగుణంగా శిక్షణ ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు బట్టి పట్టే విధానానికి స్వస్తి చెప్పి సహ జంగా ఆలోచన పద్ధతిని పెంపొందించుకోవాలని తద్వారా విషయాలను సులువుగార్థం చేసుకోగలమని చెప్పారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధి కారి ఆంజనేయులు గౌడ్, జిల్లా విద్యాధికారి అబ్దుల్ గని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ సాయినాథ్ రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీఓ గోవిందరావు, ఎంఈఓ శ్రీనివాసులు, వ్యవ సాయ అధికారి డాకేశ్వర్ గౌడ పిహెచ్‌సి డా.చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

# డిసిఎంఎస్, మన గ్రోమోర్ సెంటర్‌లలో కలెక్టర్ తనిఖీలు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో డిసిఎం ఎస్ మన గ్రోమోర్ సెంటర్‌లను బుధవారం కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. రిజిస్టర్లను తనిఖీ చేసి, యూరియా లభ్యత, పంపిణీ విధా నాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా అందరి రైతులకు అందేటట్లు చూడాలని ఎమ్మార్పీని మించి అమ్మిన వారిపై చర్యలు ఉంటాయని చెప్పారు. అలాగే వారు అక్కడ ఉన్న రైతులతో మాట్లా డారు. వారి వెంట జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేశ్, మండల వ్యవ సాయ అధికారి పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

**వృద్ధులు, దివ్యాంగులు అర్జీలను సత్వరం పరిష్కరించాలి**

వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను జాప్యం చేయకుండా సత్వరం పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రతినెల మొదటి బుధవారం జరిగే వృద్ధుల, దివ్యాంగుల ప్రజావాణి కార్యక్రమం కొన్ని అనివార్య కార ణాల వలన రెండో బుధవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. 19 మంది ఫిర్యాదులను స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా మొదటి బుధవారం తహసీల్దార్ కార్యా లయంలో జరిగే ఈ కార్యక్రమంలో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసు కురావాలని సంబంధిత అధికారులతో సమస్యలు తప్పక పరిష్కారమవుతా యని కలెక్టర్ భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులు వివిధ సమస్యలపై అర్జీలను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కె.కృష్ణ, డిఆర్‌డిఏ అదనపు శారద, గృహ నిర్మాణ శాఖ పిడి వైద్యం భాస్కర్, అర్బన్ సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు తదతరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ వితరణ




**ప్రజాపక్షం/వీపనగండ్ల :** విద్యార్థులకు రక్షిత మంచినీటిని అందించాలన్న ఉద్దేశంతో హైదరాబాద్‌కు చెందిన కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ మండలంలోని బొల్లారం ప్రాథమిక పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్‌ను ఉచి తంగా అందజేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బొల్లారం సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు వాటర్ బాటిల్స్‌ను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహ, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు నిరంజన్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘు, కమ్యూ నిటి డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ముజీబ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దారిదోపిడీ దొంగల అరెస్టు



**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల పరిధిలోని నక్కల పండగ తండా వద్ద ఇటీవల జరిగిన దారిదోపిడికి సంబంధించి దొంగలను జడ్చర్ల పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి రూ.72,500 రికవరీ చేసినట్టు డిఎస్పి వెంకటేశ్వర్లు తెలి పారు. బుధవారం సాయంత్రం జడ్చర్ల పట్టణంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జడ్చర్ల సిఐ కమలాకర్లు మాట్లా డుతూ ఈ నెల 7వ తారీకు నాదు రెడ్డి వైన్స్ సంబంధించి వైన్స్ మూసివేసి మహబూబ్‌నగర్ వెళ్తుండగా దారి కాచి ఇద్దరు వ్యక్తుల కళ్లలో కారం కొట్టి బ్యాగులో ఉన్న లక్షా నలభై నాలుగు వేల రూపాయలను ఎత్తుకెళ్లారు. వెంటనే బాధితుడు జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో రంగంలోకి దిగిన పోలీసులు బుధవారం మధ్యాహ్నం మహబూబ్‌నగర్ వెళ్లే రహదారి దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు తారసపడడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. దాంతో వారిరువురూ రెడ్డి దగ్గర నగదు లాక్కెళ్లింది తామేనని ఒప్పుకుని మిగిలిన రూ.72500 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మిగతా డబ్బులు, మొబైల్ ఇతర ఖర్చులు చేసుకున్నట్లు దొంగలు పోలీసు లకు వివరించినట్లు తెలిపారు. దోపిడికి పాల్పడిన వారిలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం వీరన్నపేటకు చెందిన రవితేజ, బాలాజీలను రిమాండ్‌కు తర లించినట్లు వారు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## రైతులకు సకాలంలో రుణాలు



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** రైతు లకు సకాలంలో పంటరుణాలు రెన్యువల్ చేసి తిరిగి రుణాలు ఇవ్వాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ అధి కారి రమేష్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని పాలెం గ్రామంలో గల యూని యన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ అధికారులు రమేష్‌బాబు, రాజేష్‌బాబు బ్యాంకులోని సిబ్బందితో మాట్లాడుతూ రైతులకు సకాలంలో పంటరుణాలు తూచ తప్పకుండా అర్హులైనవారికి వీలైనంత త్వరగా ఇవ్వాలని తెలిపారు. బ్రాంచులో ఉన్న కంప్యూటర్‌ను బాగుచేయించి కేవైసి సమస్యలను తొలగిం చారు. కొద్దిసేపు బ్యాంకు ఖాతాదారులతో అధికారులు బ్యాంకు సేవల గు రించి పూర్తిగా తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బ్యాంక్ మేనే జర్ శ్రావణ్ మాట్లాడుతూ పంటరుణాలతోపాటు అర్హులైనవారికి ఇతర రుణా లనుకూడా సకాలంలో ఇస్తున్నట్లు తెలిపారు.

# మక్తల్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ సీహెచ్‌సీ (సామాజిక ఆరోగ్య కేంద్రం)ని బుధవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ప్రసూతి గది, స్కానింగ్, ల్యాబ్, దయాలసిస్ సెంటర్, జనరల్ వార్డు, డ్రగ్స్ స్టోర్ ను ఆమె పరిశీలించారు. ఆస్పత్రిలో నెలకు ఎన్ని ప్రసావాలు జరుగుతున్నాయని అడి గి తెలుసుకున్నారు. ఆస్పత్రి ల్యాబ్‌కు వెళ్లిన కలెక్టర్ అక్కడ రోజుకు ఎన్ని రక్త పరీక్షలు ఎలాంటి పరీక్షలు ఎంత మందికి చేస్తున్నారని, టీబీ కోసం సేకరిం చిన నమూనాలకు ఎక్కడ స్టోర్ చేస్తున్నారని, చేసిన పరీక్షల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేస్తున్నారా? లేదా? అని ప్రశ్నించారు. ఆస్పత్రిలో నమోదు అవుతున్న సీజనల్ వ్యాధుల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ కేసులేమీ లేవు కదా అని ప్రశ్నించగా ఇప్పటిదాకా వైరల్ ఫీవర్ కేసులే ఎక్కు వగా నమోదు అయ్యాయని సిబ్బంది తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్ర మత్తత అవసరం అన్నారు. డ్రగ్స్ స్టోర్‌కి వెళ్ళి నిల్వ ఉన్న మందులను పరి శీలించారు. డ్రగ్స్ కాల పరిమితి ఎలా తెలుస్తుందని డ్రగ్స్ స్టోర్ ఫార్మా సిస్టును అడగడంతో డ్రగ్స్ వచ్చినప్పుడు తాము రిజిస్టర్‌తోపాటు కంప్యూ టర్‌లోనూ నమోదు చేస్తామని, మందుల నిల్వను బట్టి కాల పరిమితి ముగి సిన వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని ఫార్మాసిస్టు కలెక్టర్‌కు తెలిపారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండలానికి సంబంధించిన సీఎం సహాయ నిధి కోసం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.జిల్లెల చిన్నారెడ్డిని సంప్రదించగా వారి ప్రత్యేక చొరవతో బాధితులందరికి సీఎం సహాయ నిధి చెక్కులను వారికి అందించడం జరిగింది. వారి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు 17 మంది లబ్దిదారులకు రూ.3,37,500 విలువైన చెక్కులను బాధితులకు, బాధిత కుటుంబ సభ్యులకు అందజేయడం జరి గింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాంపురం సహదేవుడు, పెద్దమందడి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెంటన్న యాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు మన్యం, కృపాకర్ రెడ్డి, విజయ్ గౌడ్, పాతపల్లి చంద్రశేఖర్, ఎల్లస్వామి నాయుడు, నవీన్ గౌడ్, రాజు నాయక్, యూత్ కాంగ్రెస్ నాయకులు రాగి అక్షయ్ కుమార్, అసెంబ్లీ యూత్ కాంగ్రె స్ వైస్ ప్రెసిడెంట్, ఎండి.ఇర్ఫాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రోహిత్, పి.అనిల్, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఆరీఫ్, శివకు మార్, శాఖపురం తిరుపతయ్య, అయ్యవారిపల్లి కురుమూర్తి, బొట్టు శ్రీను, శ్రీనివాస్ రెడ్డి, రామాంజేయులు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# 100 మంది పేద విద్యార్థులకు ఉచిత ఇంజినీరింగ్ విద్య




ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** 100 మంది పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను ఉచితంగా అందిస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువుకోవాలని ఆసక్తి ఉండి, చదువుకోవడానికి స్థోమత లేని నిరుపేద విద్యార్థులకు ఉచితంగా మహబూబ్‌నగర్ నగరంలోని జికె ఇంజనీరింగ్ కళాశాలలో మేనేజ్‌మెంట్ కోటాలో 100 మంది విద్యార్థులకు ఉచితంగా ప్రవేశాలు కల్పించి, తన సొంత నిధులతో ఇంజనీరింగ్ విద్యను చదివించను న్నట్లు ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్ ను ఎడ్యుకేషనల్ హబ్‌గా అభి వృద్ధి చేయాలని 18 నెలలుగా పాజిటివ్ దృక్పథంతో పనిచేస్తున్నామని, అందులో భాగంగా పాలమూరు యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజ్ మరి యు లా కళాశాలలను మంజూరు చేయించుకోవడం జరిగిందని, ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో మహబూబ్‌నగర్‌కు ఐఐఐటీ కళాశాల సైతం మంజూరు కావడం జరిగిందని, అలాగే మైనార్టీ విద్యార్థుల కోసం కూడా జికె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలను ముఖ్య మంత్రిని ఒప్పించి మంజూరు చేయించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, సిజె బెనహర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం : ఎస్పీ రావుల గిరిధర్

**ప్రజాపక్షం/వనపర్తి :** రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ లేకుండా ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని ఎస్పీ అన్నారు. నాషా ముక్త్ భారత్ అభియాన్ 2025 లో భాగంగా మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలన, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా తీసుకుంటున్న చర్యలలో మాదకద్రవ్య దుర్వినియోగం, దుష్ప్రభావాల గురించి విస్తృత అవగాహన కల్పించే లక్ష్యం తో దేశవ్యాప్తంగా నాషా ముక్త్ భారత్ అభియాన్‌ను అమలు చేస్తోందని అన్నారు. ఈ అవగాహన ప్రచారం 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం వనపర్తి జిల్లా పరిధిలో మాదకద్రవ్య దుర్వినియోగానికి వ్యతిరే కంగా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు, ప్రజల నుండి విస్తృత భాగస్వామ్యాన్ని చేయాలనే ముఖ్య ఉద్దే శ్యంతో సామూహిక ప్రతిజ్ఞను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, జిల్లా పోలీస్ కార్యాలయం ఏఓ సునందన, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, డిసిఆర్బి ఎస్ఐ తిరుపతిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ రామేశ్వర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది , పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వీపనగండ్లలో ....**

ఆరోగ్యానికి హని కలిగించే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి భవిష్యత్తుకు బాటలకు వేసుకుందామని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శివగౌడ్ అన్నారు. నషా ముక్తాభారత్ అభియాన్ కార్యక్రమంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శివగౌడ్ మాట్లాడుతూ గం జాయి, గుట్కా, హెరైయిన్, మద్యం, శరీరానికి, మానసిక స్థితికి మార్పులు తీసుకొచ్చే హానికరమైన రసాయన పదార్థాలని వీటికి దూరంగా ఉండాలని, సైబర్ నేరాల వల్ల మోసపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లెక్చర్ బి. లక్ష్మీనారాయణ, స్టూడెంట్ కౌన్సిలర్ కల్పన , హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కళాశాల అధ్యా పకులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆశించిన ఫలితాలు సాధించేందుకు కృషి



**ప్రజాపక్షం/కృష్ణ:** బుధవారం కృష్ణ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి నిజాముద్దీన్ పర్యవేక్షించడం జరిగింది. పర్యవేక్షణలో భాగంగా 4 వ, 5వ తరగతి ఇంగ్లీష్ బోధిస్తున్న తర గతులను పరిశీలించి 4వ తరగతిలో ఏకలవ్య, 5వ తరగతిలో లెట్స్ బి ఫ్రెండ్స్ అనే పాఠములను విని పిల్లలతో ఇంటరాక్ట్ అయి వారితో బోర్డు పై రాసిన ఇంగ్లీష్ పదాలను, పాఠ్యపుస్తకాన్ని చదివించి అందులో వివిధ ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో విద్యార్థుల గురించి చర్చిస్తూ ప్రతి పిల్లవాడు తరగతి గదిలో ఆశించిన అభ్యసన ఫలితాలను సాధించుటలోను, వ్రాత నైపు ణ్యంలో వారిని మెరుగుపరచుటలోను, పిల్లలు ధారాళంగా చదివేందుకు ప్రత్యేక ప్రణాళికను ఏర్పాటు చేయుటకు గాను తెలిసిన మేళుకువలను విద్యార్థులకు నేర్పించాలి అన్నారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని పరి శీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించుటలో ఎలాంటి రాజీ పడొద్దు అని, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా విద్యార్థుల పట్ల తగిన జాగ్రత్తలతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల ప్రధానోపాధ్యాయులు యస్.తాయప్ప, ఉపాధ్యాయ బృందం, మధ్యాహ్న భోజన సిబ్బంది పాల్గొన్నారు.

## తాటికల్ హైస్కూల్‌లో పెరిగిన అడ్మిషన్లు




**ప్రజాపక్షం/నల్లగొండ(నకిరేకల్ ):** 2025/26 విద్యా సంవత్సరానికి మండలంలోని తాటికల్ ఉన్నత పాఠశాలలో 50 అడ్మిషన్లు రావడం అభినందనీయమని మండల విద్యాధికారి మేక నాగయ్య అన్నారు. ప్రొఫసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా ఉపాధ్యాయుల కృషి, పాఠశాల పట్ల తల్లిదండ్రుల విశ్వాసం ఈ విజయానికి కారణం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమాజం సహకరించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్య కేవలం సర్కార్ పాఠశాలల వల్ల మాత్రమే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న, పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్ చంద్ర మార్త రాములు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## డిపాజిటర్ల డబ్బులు వాడుకున్న వ్యక్తి అరెస్టు

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** డిపాజిట్ చేసిన డబ్బులు సుమారు రూ.53 వేలు వాడుకుని డిపాజిటర్ల డబ్బులు మోసం చేసిన మాలోతు దుర్గాప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అడ్డగూడూరు మండలంలోని డి.రేపాక గ్రామంలో 27.08.2022 నుండి 17.10.2023 వరకు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా పనిచేసిన మాలోతు దుర్గాప్రసాద్(21) తండ్రి రాంకోటి అనే వ్యక్తి డి రేపాక బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్‌లోని డిపాజిట్ చేసిన డబ్బులు రూ.53 వేలు వాడుకొని ఐదుగురు డిపాజిటర్లను మోసగించాడు. కాగా నిందితుడు దుర్గాప్రసాద్‌ను బుధ వారం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపారు.



## అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 26 సంవత్సరాలు జైలుశిక్ష

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితునికి 26 సంవత్సరాలు జైలు శిక్ష తో పాటు 40 వేల జరిమాన విధించడం జరిగిందని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిదిలో మైనర్ బాలికపై అత్యాచారా పాల్పడిన ఘటనలో నిందితుడు గ్యారల శివ శంకర్ అలియాస్ శివ కుమార్ పై బాధితురాలు పిర్యాదు మేరకు 2006 లో చిల్డ్రన్ యాక్ట్ క్రింద కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. నిన్న కోర్టుకు హాజరుకాకపోవడంతో శివకుమార్ పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయగా వన్‌టౌన్ పోలీస్‌లు నిందితున్ని పట్టుబడి చేసి కోర్టులో హాజరు పరచగా ఏడిజెటు కమ్ ఎస్‌సి,ఎస్‌టి కోర్టు,అత్యాచారం, అండ్ ఫోక్సో కేసుల ఫాస్ట్ ర్యాక్ కోర్ట్ నిందితునికి 26 ఏళ్ల జైలు శిక్ష, తో పాటు 40 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చిందనీ తెలిపారు. ఈ కేసులలో సరైన ఆధారాలు సేకరించి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు సమర్పించి నిందితులకి శిక్ష పడే విధంగా చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ గోపి సిఐ వన్ టౌన్ పీఎ స్,ప్రస్తుతం సిఐ, రాజశేఖర్ రెడ్డి,వన్ టౌన్ పీఎస్, పిపి వేముల రంజిత్ కుమార్, సిడిఓ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ సిబ్బంది రబ్బానీ, శంకర్, షకీల్, శ్రీకాంత్,సైదులు, భరోసా లీగల్ ఆఫీసర్ కల్పన, లైజన్ అధికారులు, పి.నరేందర్, ఎన్.మల్లికార్జున్ లను జిల్లా ఎస్పి అభినందించారు.

## గౌరికుంటతండా వరద బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** ఎడతెరపి లేని వర్షాల కారణంగా వచ్చిన వరదలతో గత రెండు రోజుల క్రితం అర్ధరాత్రి మండల పరిధిలోని గౌరికుంట తండాలోని పలు కుటుంబాల ఇండ్లల్లోకి వరద నీరు రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ గౌరికుంట తండాలో పర్యటించి ముంపు బాధితులతో మాట్లాడి వరదలకు గల కారణాలను అధికారులు, తండా ప్రజలతో తెలుసుకున్నారు. తక్షణమే చర్యలు చేపట్టాలని నీటి పారుదల ఏఈకి సూచించారు. తండా ప్రజలు ఎవరు అధైర్య పడొద్దని, ఎలాంటి ఇబ్బందులు కలిగిన తనకు సమాచారం ఇవ్వాలని కోరారు. వరదలకు గురైన బాధితులకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తండా ప్రజలకు హామీ ఇచ్చారు. వర్షాకాలం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈకార్యక్రమంలో తహాశీల్దార్ నరేందర్, ఎంపిడివో బాలరాజురెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపిటిసిలు జగన్, లాలు, రాజు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి



**ప్రజాపక్షం/యాదాద్రి :** మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు శక్తివంచన లేకుండా కృషి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నశా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం పురస్కరించుకొని జిల్లా మహిళ శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞను రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి చేయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిప్రతి ఒక్కరూ అవ్వాలని, మాదకద్రవ్యాల నిర్మూలనకు శక్తివంచన లేకుండా పోరాడాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్ ప్రసాద్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుడిసెలను తొలగించి, తగులబెట్టిన అధికారులపై చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తమ గుడిసెలను అక్రమంగా, దౌర్జన్యంగా ముందస్తు నోటీసులు లేకుండా గుడిసెలను తొలగించి, తగలబెట్టిన అధికారులపై చర్యలు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని పెద్దవూర మండలం పోతునూరు గ్రామ దళిత ప్రజలు డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పోతునూరు గ్రామ దళిత ప్రజలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోతునూరు గ్రామ శివారులో సర్వేనెంబర్ 290,298 లో ప్రభుత్వ భూమి ఉన్నదని ఆ ప్రభుత్వ భూమిలో, పోతునూరు గ్రామస్తులమైన తాము గత కొన్ని సంవత్సరాల క్రితం గుడిసెలు వేసుకొని 60కి పైగా కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాని తెలిపారు. కానీఅదే గ్రామానికి చెందిన మేదారం యాదయ్య అనే వ్యక్తి తప్పుడు ఆధారాలతో కూడిన పట్టా కాగితం తెచ్చుకొని దీని పై సర్వ హక్కులు నాకే చెందుతాయనీ పోలీసులతో, స్థానిక ఎమ్మార్వో సమక్షంలో దగ్గరుండి ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా మా గుడిసెలు తగలబెట్టించడం తో పాటు దౌర్జన్యంగా మమ్మల్ని కొట్టి, ఆ స్థలం నుంచి గెంటివేసి, తమకు ఆస్తి నష్టం చేశారని అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని కోరారు.

## వర్షాల దృష్ట్యా సెలవు ప్రకటించాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వాతావరణ నిపుణులు ప్రకటించిన నేపధ్యంలో భారీ వర్షాలు కురుస్తున్న జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, కార్యాలయాలకు ప్రభుత్వం రెండు రోజులు సెలవులు ఇవ్వాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్‌నాయక్ అన్నారు. బుధవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు ఇప్పటికే వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని, అనేక ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయని అన్నారు.

# విదేశీ బహుళజాతి సంస్థలు 'గోబ్యాక్'

### వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో స్వేచ్ఛా వాణిజ్యాన్ని నిరసిస్తూ ప్రధాని మోడీ, ట్రంప్‌ల దిష్టిబొమ్మలు దహనం

**ప్రజాపక్షం/కోదాడ :** స్వేచ్ఛ వాణిజ్యం పేరుతో దేశాన్ని బహుళ జాతి సంస్థలు లూటీ చేస్తున్నాయని రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొడ్డ వెంకటయ్య అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలో సంయుక్తా కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో స్వేచ్ఛ వాణిజ్యాన్ని నిరసిస్తూ ప్రధాని మోడీ, ట్రంప్‌ల దిష్టిబొమ్మలను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. విదేశీ సంస్థలు గో బ్యాక్ అని నినాదాలు చేశారు. దేశంలో సుమారు 40వేల బహుళ జాతీయ సంస్థలు ఉన్నాయని, విత్తనాలలో కార్గిల్, మోనోశాంటో, సిజెంటా, ఆహార రవాణా వస్తువుల విక్రయాలలో అమెజాన్, వాల్‌మార్ట్, మిడ్‌ల్యాండ్, ఊబర్ లాంటి అనేకం పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన విదేశీ బహుళజాతి సంస్థలను బహిష్కరించాలని అన్నారు. సమగ్ర వాణిజ్య ఒప్పందాలపై సంతకాలకు ఆరాటపడిన మోడీ నేడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మన వస్తువులపై 50 శాతం సుంకాలు విధిస్తుంటే నోరు మెదపడం లేదని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశ ప్రజానీకం సంఘటితమై క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో విదేశీ కార్పోరేట్ శక్తులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మిట్టగనుపుల ముత్యాలు, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లు ప్రసాద్, రైతు సంఘం మహిళా నాయకురాలు దొడ్డ సీతమ్మ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అన్నెం పాపిరెడ్డి, డివైఎఫ్ఐ డివిజన్ నాయకుడు పోకల సాయి, మద్దెల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వ్యవసాయరంగంలో అమెరికాతో జరిగే వాణిజ్య ఒప్పందాలను కేంద్రం విరమించుకోవాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య, ఏఐకేఎస్ రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్లు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా నాయకులు బిల్లా కనకయ్య, వీరేపల్లి వెంకటేశ్వర్లు, ఏఐకేఎఫ్ రాష్ట్ర నాయకులు వస్కుల సైదమ్మ, పోతుగంటి కాశీ, నాయకులు రవినాయక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మునుగోడు:** కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతు ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఏఐటియుసి మండల గౌరవాధ్యక్షులు చాపల శ్రీను పిలుపునిచ్చారు. కేంద్రం ప్రభుత్వం దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తూ, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చి రైతులకు ప్రజలకు ప్రజా పంపిణీ పథకాలను పాతరవేసే దిశలో అడుగులు వేస్తున్నందుకు నిరసనగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ఏఐటియుసి రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమంలో ఏఐటియుసి మండల కార్యదర్శి బెల్లం శివయ్య, రైతు సంఘం మండల కౌన్సిల్‌సభ్యులు అందుగులనరేష్,శిరగొని మారయ్య, తాపీ సంఘం మండల.అధ్యక్షులు పందుల చిన్న నరసింహ పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/మర్రిగూడ:** కేంద్ర ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాద అడుగులకు మాడుగులొత్తుతూ దేశ సార్వభౌమత్వాన్ని ట్రంప్‌కు తాకట్టు పెట్టే విధంగా ఉన్నాయని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బుర్ర శేఖర్ అన్నారు. గీత కార్మిక సంఘం నాయకులు నిరంజన్, రైతు సంఘం మండల అధ్యక్షులు నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి అంజయ్య,బాలకిషన్, రాజయ్య, వెంకటయ్య, మార య్య, కొమరయ్య కృష్ణయ్య యాదయ్య, రవి, నజీర్ పాల్గొన్నారు.






# అసలైన దద్దమ్మలు బిఆర్ఎస్ పాలకులే

### కెసిఆర్,కెటిఆర్ లకు ఊడిగం చేశారు జిల్లా అభివృద్ధిని విస్మరించారు: ఎమ్మెల్సీ శంకర్ నాయక్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూచి జీర్ణించుకోలేక ఆరోపణలు చేస్తున్నారని ప్రజలే మీపై తిరగబడే రోజులు దగ్గరపడ్డాయని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అన్నారు. బుధవారం పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఎల్‌బిసి,డిండి, నక్కల గండి ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలోనే అన్ని పూర్తి చేస్తామని మేం చేసిన అభివృద్ధి మీరు చేసిన అవినీతిపై చర్చకు బిఆర్ఎస్ పాలకులు సిద్ధమేనా అని సవాలు విసిరారు. జగదీశ్ రెడ్డి 10 సంవత్సరాలు మంత్రిగా ఉండి నల్లగొండ జిల్లా ప్రజలకు చేసింది ఏం లేదని కెసిఆర్,కెటిఆర్‌లకు ఊడిగం చేశాడు తప్ప జిల్లా అభివృద్ధిని ఏనాడు పట్టించుకోలేదని ఆరోపించారు.మా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి జిల్లాను సర్వతోముఖ అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని తెలిపారు. నీలాగా భూ దందాలు, ఇసుక దందా కంకర దందా చేసిన చరిత్ర మీకు ఉందని మా మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కత్తుల కోటి, మామిడి కార్తీక్, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు: జిల్లా ఎస్పి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవర్ పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్ లో బాగంగా మాదక ద్రవ్యాల దుర్వినియోగం వ్యతిరేకంగా మాదక ద్రవ్యాల నిర్మూలనపై బుధవారం పట్టణంలోని కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అభియాన్ లో బాగంగా మాదక ద్రవ్యాల దుర్వినియోగం వ్యతిరేకంగా మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా యువత మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల జరిగే నష్టాలు,వాటి బారిన పడకుండా విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థి దశలో మాదక ద్రవ్యాల మాయలో పడి జీవితం వృథా చేసుకోకూడదని, ఒక్కసారి డ్రగ్స్ వాడితే అది మెల్లమెల్లగా వ్యసనంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. డ్రగ్స్ వాడకం వలన యువత యొక్క శారీరక, మానసిక ఆరోగ్య విచ్ఛిన్నం కావడంతో పాటు, ఆర్థిక సమస్యలు,సమాజంలో గౌరవం లేకుండా పోతుందని అన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను క్రయవిక్రయాలు, సరఫరా చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే, టోల్ ఫ్రీ నెంబర్ 8712670266 కు సమాచారం తెలపాలని కోరారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి, టూ టౌన్ సిఐ రాఘవరావు, ఎస్ఐ సైదులు, కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్, అధ్యాపకులు విద్యార్ధిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దు

### మూసీ వరద ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, రాచకొండ సిపి

**ప్రజాపక్షం/వలిగొండ/భూదాన్ పోచంపల్లి :** వలిగొండ మండలం సంగెం భీమలింగంలో లెవెల్ బ్రిడ్జిని యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావు, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు పరిశీలించారు. ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండి బ్రిడ్జి దాటే సాహసం ఎవరు చేయొద్దని అన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అవసరమైతేనే ఇంటి నుంచి బయటికి ఎవరు కూడా రావద్దు అని అన్నారు. విద్యుత్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. జిల్లాలో 5, 6 మండలాలు స్వయంగా



తాను వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు జిల్లాలో సుమారు 56లో లైన్ వరద ప్రవాహం గుర్తించినట్టు వాటి వద్ద పోలీసు సిబ్బంది నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. యువకులు అత్యుత్సాహంతో వాగు దాటాలని ప్రయత్నాలు చెయ్యవద్దు ఎప్పటికప్పుడు పోలీస్ సిబ్బంది సూచనలను పాటించాలని ప్రజలకు సూచించారు. రెండు, మూడు రోజులు కుంభవృష్టి వర్షాలు ఉన్న నేపథ్యంలో గొర్ల, బర్రెల కాపర్లు ఎవరు కూడా వాగుల వద్ద పశువులను మేపవద్దని సూచించారు.

**మూసీ వరదను పరిశీలించిన రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు**

హైదరాబాద్లో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల ప్రభావంతో మూసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు వలిగొండ మండలం సంగెంలో లెవెల్ బ్రిడ్జి వద్ద వరద ఉద్రితిని పరిశీలించారు.





## విద్యార్థులను స్కూల్‌కు కారులో తీసుకెళ్లిన సూర్యాపేట జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** మఠంపల్లి రఘునాథపాలెం రోడ్డులో మఠంపల్లి బ్రిడ్జి వద్ద నీరు పొంగి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రఘునాథపాలెం వెళ్లే మోడల్ స్కూల్ విద్యార్థులు వాగు దాటేందుకు ఇబ్బంది పడుతుండడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ వారిని తన కారులో ఎక్కించుకొని మఠంపల్లి మోడల్ స్కూల్‌కు క్షేమంగా తీసుకెళ్లారు. ఒక వేళ రాత్రి వరకు వరద తగ్గకపోతే రాత్రికి భోజనం ఏర్పాటు చేసి వర్షం తగ్గిన తర్వాత వాహనం ఏర్పాటు చేసి విద్యార్థులను వారి ఇంటికి పంపించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల పట్ల జిల్లా కలెక్టర్ చూపించిన ప్రేమ, శ్రద్ధలపై గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్వయంగా తన కారులో తీసుకువెళ్ళి పాఠశాలలో వదలడమే కాకుండా క్షేమంగా తిరిగి వారి ఇండ్లకు చేరేలా తీసుకున్న శ్రద్ధ నిజంగా గొప్ప విషయం. అంతకు ముందు జిల్లా కలెక్టర్ మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామంలో మేళ్లచెర్వు వెళ్ళే రోడ్డు బ్రిడ్జిపై చెరువు నుండి నీరు ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలను బ్రిడ్జిపై నుండి వెళ్లకుండా గ్రామ పంచాయితీ సిబ్బంది అక్కడే ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డిఓ శ్రీనివాసులు, తహశీల్దార్ మంగా రాథోడ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలపై ఎఐఎస్‌ఎఫ్ సమరశీల పోరాటాలు : కొండల్

**ప్రజాపక్షం/కోదాడ :** విద్యారంగ సమస్యలపై ఏఐఎస్‌ఎఫ్ సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని ఆ సంఘం మాజీ రాష్ట్ర నాయకులు చేపూరి కొండల్, జిల్లా కార్యదర్శి తమ్మనబోయిన నరేష్‌లు అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని శ్రీవిద్య జూనియర్ కళాశాల వద్ద అఖిల భారత విద్యార్థి సమాఖ్య 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జెండాను ఆవిష్కరించి వారు మాట్లాడారు. నూతన విద్యావిధానం అంటూ విద్యను కార్పోరేటీకరణ, శాస్త్రీయ విలువలు లేకుండా హేతుబద్ధతలేని మూఢ నమ్మకాలను పెంచి పోషించే విలువలను తరగతి పాఠ్యపుస్తకాలలో చెప్పించి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వీరుల, పోరాటాలను తొలగిస్తుందన్నారు. కొఠారి కమీషన్ సూచించినట్లు కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 10 శాతం నిధులు ఇప్పటి వరకు కేటాయించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకుండా బడ్జెట్‌లో కేవలం 7.3శాతం నిధులు కేటాయించిందని పార్టీ మేనిఫెస్టోలో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేస్తామని హామి ఇచ్చారని గుర్తు చేశారు. 8వేల కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. దీనికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాత్విక్, నిరంజన్, విజయ్, నందు, భారతి, శైలజ, విజయ, వసంత తదితరులు పాల్గొన్నారు.




# క్రీడ

## 2030 కామన్వెల్త్ గేమ్స్ నిర్వహించేందుకు భారత్ బిడ్!

# ఐఓసి గ్రీన్ సిగ్నల్

2030 కామన్వెల్త్ క్రీడలను నిర్వహించడానికి భారత ఒలింపిక్ సంఘం అధికారికంగా ఆమోదం తెలిపింది. 2030 కామన్వెల్త్ క్రీడలకు అహ్మదాబాద్ వేదికగా నిర్వహించేందుకు బిడ్‌ను సిద్ధం చేస్తుండగా.. బుధవారం జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి పోటీ నుంచి కెనడా తప్పుకోవడంతో భారత్‌కు అవకాశాలు పెరిగాయి. ఇప్పటికే ఆసక్తిని వ్యక్తం చేసిన భారత్.. బిడ్ పత్రాలను ఈ నెల 31లోగా అందజేయాల్సి ఉంది. మెగా ఈవెంట్‌కు అయ్యే ఖర్చులన్నింటినీ భారత ప్రభుత్వమే భరిస్తుందని ఐవోసీ స్పష్టం చేసింది. సమావేశం



అనంతరం ఐవోసీ సంయుక్త కార్యదర్శి కల్యాణ్ చౌబే మాట్లాడుతూ కామన్వెల్త్ క్రీడలకు సంబంధించి జనరల్ హౌస్ ప్రతిపాదనలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని చెప్పారు. సన్నాహకాలను వేగవంతం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల కామన్వెల్త్ స్పోర్ట్ గేమ్స్ డైరెక్టర్ డారెన్ హాల్ నేతృత్వంలోని బృందం అహ్మదాబాద్‌లోని క్రీడా వేదికలను పరిశీలించడంతో పాటు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతోనూ సమావేశమైన విషయం తెలిసిందే. మరోసారి ప్రతినిధి బృందం సైతం ఈ నెలలో పర్యటించనున్నది. ఈ నెల చివరలో కామన్వెల్త్ క్రీడల ప్రతినిధి బృందం అహ్మదాబాద్‌కు చేరుకుంటుందని భావిస్తున్నారు. నవంబర్ చివరి వారంలో గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ క్రీడల జనరల్ అసెంబ్లీ ఆతిథ్య దేశాన్ని నిర్ణయిస్తుంది. వచ్చే ఏడాది గ్లాస్గో వేదికగా జరుగనున్న క్రీడల తరహాలో కాకుండా.. 2030 పూర్తిస్థాయిలో క్రీడలను నిర్వహించనున్నట్లు ఐవోసీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు రోహిత్ రాజ్‌పాల్ పేర్కొన్నారు. షూటింగ్, ఆర్చరీ, రెజ్లింగ్ తదితర క్రీడలతోప ఆటు కబడ్డీ, ఖోఖో పోటీలను సైతం ఈ క్రీడల్లో చేర్చాలని యోచిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. భారత్ గతంలోనూ కామన్వెల్త్ గేమ్స్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. 2010లో ఢిల్లీ వేదికగా విజయవంతంగా నిర్వహించింది.

# ఐసిసి వన్డే ర్యాంకింగ్స్

## రెండోస్థానానికి హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ..!

### నెంబర్ వన్‌గా గిల్..!

పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌ను ఐసీసీ బుధవారం ప్రకటించింది. ర్యాంకింగ్స్‌లో టీమిండియా వన్డే జట్టు కెప్టెన్ రెండో స్థానానికి చేరుకున్నాడు. ఒక స్థానాన్ని మెరుగుపరుచుకొని.. పాకిస్తాన్ స్టార్ బ్యాట్స్‌మెన్ బాబర్ అజామ్‌ను వెనక్కి నెట్టాడు. ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో బాబర్ పెద్దగా ప్రభావం చూపించలేకపోయాడు. ప్రస్తుతం బాబర్ మూడోస్థానానికి చేరుకున్నాడు. తాజా ఐసీసీ వన్డే బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ నెంబర్ వన్‌గా కొనసాగుతున్నాడు. గిల్ ఖాతాలో 784 పాయింట్లు, రోహిత్ ఖాతాలో 756 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. టీమిండియా డ్యాషింగ్ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ నాలుగో స్థానంలో ఉన్నాడు. విరాట్




ఖాతాలో 736 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. అక్టోబర్‌లో భారత జట్టు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నది. ఇరుజట్ల మధ్య మూడు మ్యాచుల వన్డే సిరీస్ జరుగనున్నది. ఐసీసీ విడుదల చేసిన పురుషుల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్15లో ఐదుగురు టీమిండియా ఆటగాళ్లు ఉన్నారు. శ్రేయాస్ అయ్యర్ ఎనిమిది స్థానంలో ఉండగా.. వికెట్ కీపర్ కం బ్యాట్స్‌మెన్ కేఎల్ రాహుల్ 15వ స్థానంలో ఉన్నాడు. రోహిత్, ఇద్దరు చివరిసారిగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో వన్డే ఫార్మాట్‌లో ఆడారు. ఐపీఎల్ 2025 మధ్యలో టెస్ట్ క్రికెట్ రిటైర్మెంట్ ప్రకటించారు. ఇద్దరూ ఆగస్టులో బంగ్లాతో జరిగే వన్డే సిరీస్‌కు మళ్లీ మైదానంలోకి అడుగుపెడుతారని భావించినా.. ద్వైపాక్షిక సిరీస్ 2026కి వాయిదా పడింది. ప్రస్తుతం రోహిత్, విరాట్ ఇద్దరు ప్రాక్టీస్ మొదలుపెట్టారు.

## ఇషాన్ జట్టుకు షాక్..




ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత పేస్ బౌలర్ ఆకాశ్ దీప్ మంచి ప్రదర్శన చేశాడు. బర్మింగ్‌హామ్‌లో జరిగిన టెస్ట్‌లో 10 వికెట్లు తీసిన అతడు.. ఓవల్ వేదికగా జరిగిన టెస్ట్‌లో నైట్ వాచ్‌మెన్‌గా బ్యాటింగ్‌కి వచ్చి అర్ధ శతకం సాధించాడు. అసలు విషయానికొస్తే.. దులిప్ ట్రోఫీ2025 ప్రారంభానికి ముందు ఇషాన్ కిషన్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న ఈస్ట్ జోన్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. ఆకాశ్ దీప్ ఈ టోర్నమెంట్‌లో ఈస్ట్ జోన్ తరఫున ఆడాల్సి ఉంది. కానీ, అనూహ్యంగా అతడిని జట్టు నుంచి తప్పించి అస్సాంకు చెందిన పేసర్ ముక్తర్ హుసేన్‌ని జట్టులోకి తీసుకున్నారు. కొన్ని రోజుల క్రితం ప్రకటించిన 15 మంది సభ్యులతో కూడిన జట్టులో ఆకాశ్‌దీప్ కూడా ఉన్నాడు. మహ్మద్ షమీ, ముకేశ్ కుమార్‌లతో కలిసి అతడు బౌలింగ్ చేస్తాడని అంతా భావించారు. కానీ అనుకోకుండా అతన్ని జట్టు నుంచి తప్పించారు. పిటిఐ ప్రకారం ఆకాశ్‌దీప్ జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సిఎ)లో విశ్రాంతి తీసుకోవాలి కాబట్టే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇక ఈస్ట్ జోన్‌కు ఇషాన్ కిషన్ సారథ్యం వహిస్తుండగా.. వైస్ కెప్టెన్‌గా అభిమన్యు ఈశ్వరన్ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ జట్టులో రియాన్ పరాగ్ చోటు దక్కించుకోగా.. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికయ్యాడు.


ఫోకస్




తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా గూడూరు ప్రాంతం భౌగోళికంగా అత్యంత ప్రాచీనమైనది. దీని మూలాలు బౌద్ధ, జైన మతానికి చెందినవిగా ఉన్నాయి. శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, రాష్ట్ర కూటులు, పశ్చిమ చాళుక్యులు, కందూరి చోడులు తరువాత మధ్య యుగంలో కాకతీయులు, పద్మనాయకులు, బహ్మనీలు, కుతుబ్‌షాహీలు, అసిఫ్ జాహీలు ఈ ప్రాంతాన్ని పాలించారు. తెలంగాణ ప్రాంతానికి చెందిన గూడూరు శాసనాల పరంగా, సాహిత్య పరంగా అత్యంత చారిత్రక ప్రాధాన్యం కలది. ఇటీవలనే పాలడుగు రత్నాకరరావు అనే ప్రముఖ తెలంగాణ రచయిత, గూడూరులో పనిచేసిన వ్యక్తి 'గూడూరు చరిత్ర ' అని ఒక పుస్తకం వెలువరించారు.



# తెలంగాణ గూడూరు గుర్తే వేరు!



ఇక్కడ ఒక విషయం జ్ఞప్తిలో ఉంచుకోవాలి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఒక 'గూడూరు' ఉంది. ఇది చెన్నై దగ్గర ఉంటుంది. ఆ గూడూరు వేరు. తెలంగాణ గూడూరు వేరు. ఆంధ్రాలోని గూడూరు కూడా చోళరాజుల కాలం నుంచీ ఉన్నదే. ఆ రాజుల కాలంలో నిర్మించిన అలఘునాథ స్వామి దేవాలయం ఇప్పటికీ అక్కడ ఉంది. అంతే తప్ప శాసనాల పరంగా తెలుగు చరిత్ర, సాహిత్య నేపథ్య పరంగా ఇది తెలంగాణ గూడూరులా ప్రసిద్ధి కాదు... అంతేకాదు, చారిత్రక, శాసన సాహిత్య ప్రాధాన్యం కూడా లేదు. ప్రాచీన శాసనాల రిత్యా కూడా తెలంగాణ గూడూరు శాసనాలు అత్యంత పురాతనమైనవి. ఇటీవలే గూడూరు ప్రఖ్యాత తెలుగు శాసనానికి 900ల సంవత్సరాలు నిండిన సందర్భంగా గత ఏడాది డిసెంబర్ 24న ప్రత్యేక వేడుకలు జరుపుకొన్న సందర్భంగా, డాక్టర్ శంకరమంచి శ్యాం ప్రసాద్ ఒక పత్రికకు రాసిన వ్యాసంలో 'తెలంగాణలోని చరిత్రాత్మకమైన శాసనాలలో జనగామ జిల్లాలోని గూడూరు శాసనానికి ఒక ప్రత్యేకత ఉన్నది. ప్రామాణికమైన తెలుగు పద్య రచనకు ఇది ఆధారం. కుర్క్యాల శాసనంలో అందమైన కందం కనపడితే, ఇక్కడ వత్త పద్యాలున్నాయి. దీనిని క్రోధినామ సంవత్సరం పుష్య బహుళ పాడ్యమి బుధవారం, అనగా 1124, డిసెంబర్ 24వ తేదీ నాడు వేయించారు. విరియాల వంశానికి చెందిన మల్లన ఇందులో తన పూర్వీకుల ప్రసంశతో పాటు గూడూరు మల్లేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించి సాగు నీటి చెరువును, తాగు నీటి బావిని తవ్వించి స్వామి ధూప దీప నైవేద్యాలకై బమ్మెరను మధిర గ్రామంగా దానం చేసినట్లు ఈ శాసనంలో ఉంది. మూడువైపులా కన్నడంలో, ఒకవైపు తెలుగు భాషలో ఉన్న ఈ శాసనంలో మూడు చంపకమాల, రెండు ఉత్పల మాల పద్యాలున్నాయి. కన్నడ లిపిలో 111 పంక్తులు, తెలుగులో 36 పంక్తులు ఉన్నాయి' అని వివరించారు. ఈ నేపథ్యంలో శ్రీ పోతన చైతన్య వేదిక సంస్థ 'గూడూరు శిలాశాసన స్మృతీ' అనే గ్రంథాన్ని వెలువరించింది. అయితే, ఈ ప్రత్యేకత కలిగిన తెలుగు శాసనం చెప్పే చరిత్ర వేరే ఉంది. ఒక శాసనం ఒక రాజు వేసిన ఒక ప్రకటనను చెబుతుందని అందరూ సాధారణంగా భావిస్తారు. కానీ, 'విరియాల కామవసాని' శాసనంగా పేరొందిన ఈ శాసనం తనలో బయటికి తెలియని ఒక గొప్ప తెలుగు వారి చరిత్రను నిక్షిప్తం చేసుకొందని గొప్ప చరిత్రకారుడు, శిల్పశాస్త్రంపై పూర్తి పట్టు సాధించిన ఈమని శివనాగిరెడ్డి తన పుస్తకం 'అలనాటి మేటి తెలంగాణ శాసనాలు'లో రాశారు. 'నిజానికి ఈ శాసనం విరియాల కామవసానిది కాదు. ఆమె విడుదల చేయలేదు. అయితే, ఈ శాసనంలో ఆమె చేపట్టిన ఒక ఘనకార్యం కాకతీయుల చరిత్రను ఒక మలుపు తిప్పింది' అని అంటారు ఆయన. కాకతీయులు కేవలం సామంతుల్లాగానే మిగిలిపోకుండా, వారు స్వతంత్ర రాజులుగా నిలదొక్కుకొని, తరువాతి కాలంలో ఒక విశాల సామ్రాజ్యాన్ని పాలించటానికి దోహదపడిన సంఘటనకు నాంది పలికిందీ శాసనం' అని ఈమని అభిప్రాయం. మరి ఇంతకీ ఈ శాసనం ఎవరిది? జయంతీపురం పురం నుంచి పాలిస్తున్న కల్యాణ చక్రవర్తులలో ఒకరైన ఆరో విక్రమాదిత్యుని (క్రీ.శ. 1076–1127) కుమారుడు, కొలనుపాక నుంచి పాలిస్తున్న యువరాజు కుమార సోమేశ్వరుని దండ నాయకుడైన స్వామిపయ్య విన్నపమున్న శాసనం. కాబట్టి ఇది 'స్వామి పయ్య శాసనం' అనవచ్చు. విరియాల వంశీకుడైన మల్లుడు, గుముడూరులో నిర్మించిన శివాలయాన్ని ప్రస్తావిస్తున్న శాసనం గాబట్టి, 'విరియాల మల్లుని శాసనం' అనికూడా అనవచ్చు. కళ్యాణ చక్రవర్తుల ప్రభుత్వాన్ని కీర్తిస్తున్న శాసనం కాబట్టి ఇది వారి శాసనం అనికూడా భావించవచ్చునంటారు ఈమని. అంతటితో అయిపోలేదు. ఒక చారిత్రక అవసరంగా, కాకతీయ గరుడ బేతరాజును అనుమకొండ సింహాసనం పైన కూర్చుండబెట్టటానికి మరో రాజు సహకారంతో, సార్వభౌముని ఒప్పించిన రాజకీయ చతురురాలు కామావసాని కాబట్టి ఇది ఆమె పేరుపై 'విరియాల కామవసాని శాసనం' అంటే కూడా సరిపోతుంది. ఇలా ఒక్క శాసనం ఇంత చరిత్ర చెప్పింది కాబట్టి 'విరియాల కామవసాని గూడూరు శాసనంగా ప్రసిద్ధికెక్కింది. కాగా, ఈ 'కామవసాని' ఎవరు?' అన్న ప్రశ్న సహజంగానే ఉదయిస్తుంది. ఈమె ఒక సామాన్య సైన్యాధ్యక్షుడి ఇల్లాలు. ఆమె భర్త పేరు ఎర్ర నరేంద్రుడు. తన పుట్టింటి వారు నిస్సహాయ స్థితిలో ఉంటే భర్తతో కలిసి చక్రవర్తులను ఒప్పించి తగిన సహాయ సహకారాలు అందించింది. ఒక గొప్ప సామ్రాజ్యం వెలుగొందడానికి మూల కారకురాలైంది. 'గ్రామంలోని పురాతన ఆనవాళ్లు అయిన పాటిగడ్డ, శివాలయం, ఊరచెరువు, మహంకాళమ్మ బావి, శిలా శాసనం, వీరగల్లు, గడి, మసీదు, బురుజులు వీటితో పాటు ఊరిలో అక్కడక్కడా కనిపించే రాతిస్థంభాలు, దేవతల విగ్రహాలు మొదలగు వాటితోపాటు చరిత్రకారులు, శాసన పరిశోధకులు, సాహితీకారులు, గ్రామ పెద్దలూ మొదలగు వారి అనుభవాలను, సంబంధిత పుస్తకాలను క్రోడీకరించితే వచ్చినదే ఈ పుస్తకం' అని అంటారు రత్నాకరరావు. క్రీ.పూ. 200 నుంచి క్రీ.శ. 200 వరకూ శాతవాహనుల కాలం సూచించే అనేక సంకేతాలను విశ్లేషించటంతో పుస్తక రచనకు ఉపక్రమించారు రత్నాకరరావు. పైన ఉదహరించిన డాక్టర్ శంకరమంచి శ్యామ్ ప్రసాద్ ఈ పుస్తకానికి ముందు మాట రాసి, 'గూడూరు చరిత్ర ప్రాముఖ్యతను' ఆసక్తికరంగా ఆవిష్కరించారు. నిజానికి, 'చరిత్ర శోధన, సాహిత్య చరిత్ర శోధన ప్రస్తుతం వేరు వేరు మార్గాలలో పయనిస్తోంది. దీనివలన చరిత్రలో అంతర్భాగం కావలసినవి చరిత్ర పుస్తకాల ఆవలనే ఉండిపోతున్నాయి' అని గతంలో ప్రసిద్ధ చరిత్రకారుడు ఆచార్య వకుళాభరణం రామకష్ణ ఒక సైద్ధాంతిక సూత్రీకరణ చేశారు. కాటమరాజుల చక్రంలో ఏ యే రాజులు ఏ కాలంలో ఉన్నారో ఆచార్య తంగిరాల వారు చాలా వివరంగా విశ్లేషించినా, అది ప్రచురణ అయినా ఇప్పటికీ చరిత్ర శోధకులు రాసే చరిత్ర పుటలలో ఎక్కలేదు. ప్రస్తుతం 'గూడూరు చరిత్ర' అలాంటిదే. అంతే గాదు... ఈమని 'అలనాటి మేటి తెలంగాణ శాసనాలు', డాక్టర్ భిన్నోరి మనోహరి ఉటంకించిన బహుముఖీయమైన 'శాసన పర్వం' కూడా ఇంకా చరిత్ర పుటలలోకి రాలేదు. ఏవో కొన్ని టూకీగా తప్ప. ఇలా రానివి ఎన్నో ఉండగా చరిత్ర విద్యార్థులు తెలంగాణ, ఆంధ్రాల చరిత్ర పట్ల ఎంతవరకు సరైన దక్పథం పెంపొందించుకొంటారన్నది ప్రశ్న.

–డా. కొప్పరపు నారాయణ మూర్తి

## ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరసిస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ జిజిహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటి సిబ్బందికి గత మూడు సంవత్సరాల నుండి పెండింగులో ఉన్న పిఎఫ్, ఇఎస్‌ఐ పూర్తి వివరాలు తెలియజేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26,000 చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి కార్పొరేషన్, గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఉపాధ్యక్షుడు చిరంజీవి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి)జిల్లా కార్యదర్శి మల్లేష్, కార్మికులు మురళి, నవీన్, మమత, గంగన్న, కమలాకర్, శ్రీకాంత్,చందు, నిరోష, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఆదుకోవాలి

### యూరియా కోసం సిపిఐ, రైతుసంఘం ధర్నా



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని కంకర బోర్డ్‌లో గల రైతు సహకార కేంద్రం పిఎసిఎస్ సెంటర్ వద్ద సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులకు యూరియా బస్తాలు ఇవ్వాలని రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారధిరెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేక వీరన్న మాట్లాడుతూ అదును కాలంలో రైతులకు యూరియా బస్తాలు సకాలంలో అందించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఒకవైపు వర్షాలు కురుస్తుంటే యూరియాలేక రైతులు నష్టపోతున్నారన్నారు. కేంద్రం తెలంగాణకు రావలసిన యూరియా కోటాను సత్వరమే విడుదల చేసి రాష్ట్రంలో ఇబ్బందులు కలగకుండా చూడాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా నిస్సహాయతతో చూడకుండా కేంద్రంతో కొట్లాడి రైతులకు సకాలంలో యూరియా అందే తట్టు చూడాలని డిమాండ్ చేశారు. ఎడిఎ శ్రీనివాసరావు, ఎఒ తిరుపతిరెడ్డి మూడు రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో రైతులు కిషన్ సతీష్, సాలి, వీరన్న, బాలాజీ, వెంకన్న, సురేష్, భగవాన్, రాజేష్, కళ్యాణ్ మరియు మేక వీరన్న, పెరుగు కుమార్, రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, తండా సందీప్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, ఆబోతు అశోక్, మంద శంకర్, తండ సతీష్, తేజ, వినయ్, తండా శ్రీనాథ్, గాదం శ్యాంప్రసాద్ యాదవ్, డి రమేష్, పృధ్వి సాయి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం

### భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాలు వెంటనే ఉపసంహరించుకోవాలి

### ట్రంప్, కేంద్రప్రభుత్వం దిష్టిబొమ్మలు దహనం చేసిన రైతు, ప్రజాసంఘాలు



నల్లగొండ...



దేవరకొండ...

**ప్రజాపక్షం/నల్లగొండ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజా రామచంద్రం ఆరోపించారు. దేశ వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం నల్లగొండ పట్టణంలోని సుభాష్ విగ్రహం దగ్గర ఎఐటియుసి, రైతుసంఘం ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వం, ట్రంప్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సంపద సృష్టించే రైతు, కార్మికవర్గం నోట్లో మట్టి కొడుతూ ధనవంతుల కొమ్ము గాస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విధానాలు తిప్పికొట్టాలన్నారు. అమెరికా భారత వస్తువులపై సుంకాలు పెంచుతున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని వారు ఆరోపించారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బు వీరస్వామి, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కేవీస్ రెడ్డి, కోశాధికారి దోనకొండ వెంకన్న, సహాయ కార్యదర్శి బరిగల వెంకటేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండమీద వెంకన్న, యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, గుండె రవి, శంకర్ ,లెనిన్, ఎం.ముత్యాలు, నందం, సత్యనారాయణ రామకోటి, వెంకటయ్య దోటి పందరి, యూసుఫ్ మదార్, విజయ్‌రెడ్డి, అక్కలయ్య, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

**దేవరకొండ :** దేశవ్యాప్త నిరసనలో భాగంగా దేవరకొండలో రైతు సంఘం, ఎఐటియుసి, సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ట్రంప్, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలతో ర్యాలీ నిర్వహించి, అనంతరం బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై దహనం చేశారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మైనోద్దీన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోచి పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పల్లా రంగారెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు అంజల్‌రావు, వెంకటేశ్వర్లు, మైనోద్దీన్, ఉస్సేన్, మాధవరెడ్డి, పుల్లయ్య, గోవర్ధన్, శ్రీను, చక్రి, నగేష్, జామిల్, రాములు, వెంకటయ్య, గోపి, శ్రీను, మల్లేష్, శివ, కృష్ణయ్య, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ :** అమెరికా సామ్రాజ్యవాదం నుండి మన దేశ సార్వభత్వాన్ని కాపాడుకుందామని కార్మిక, రైతు సంఘాల నాయకులు గన్నార రమేష్, ముక్కెర రామస్వామి, సోమిరెడ్డి శ్రీనివాస్, ఈసంపల్లి బాబు, అక్కనపల్లి యాదగిరి అన్నారు. జాతీయ సంఘాల పిలుపులో భాగంగా ఆల్ ట్రేడ్ యూనియన్స్ రైతు సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో ఎస్‌కెఎం జిల్లా అధ్యక్షుడు రాచర్ల బాలరాజు అధ్యక్షతన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల నాయకులు నర్రా ప్రతాప్, వీరగోని శంకరయ్య, చిర్ర సూరి, తిరుపతి, కోరబోయిన కుమార స్వామి, మాలోత్ సాగర్, ఎండి యాకూబ్, బొట్ల శ్రీనివాస్, సుంకా మొగిలి, ఎండి మెహబూబ్ పాషా, మల్లికార్జున్, ఓదేల్, రత్నం పాల్గొన్నారు.

**భువనగిరి :**క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల సాధన కోసం, కార్మిక చట్టాల పరిరక్షణకై ఉద్యమించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి గోరెటి రాములు, ఎండి ఇమ్రాన్ పిలుపునిచ్చారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు, రైతు సంఘాల పిలుపు మేరకు భువనగిరిలోని భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదురుగా ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సామల భాస్కర్, పుట్ట రమేష్, ముంతాజ్ బేగం కాశపాక దయాకర్, గౌరవంతుల శ్రీనివాస్, మదుగుల స్వామి, బొజ్జ గణేష్, జహంగీర్, మల్లేష్, నరేష్, బోయిని బిక్షపతి, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** భారతదేశంపై అమెరికా 50 శాతం సుంకాన్ని విధించడానికి వ్యతిరేకిస్తూ క్విట్ ఇండియా స్ఫూర్తితో క్విట్ కార్పోరేట్ అనే నినాదంతో ఎఐటియుసి, రైతు సంఘం ఆధ్వర్యంలో అమెరిక దేశాధ్యక్షుడు టంప్ దిష్టిబొమ్మతో సిపిఐ కార్యాలయం నుండి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎంఎ రెహమాన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తాము పండించే ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని ఎన్నో సంవత్సరాల నుంచి పోరాటాలు చేసిన కేంద్రం పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, శివశంకర్ మోహబూబ్, ఖాన్. ఖాజీ, లక్ష్మి శివలీల, నర్సమ్మ, కట్టు మహేష్, సుజాత ,సునీత పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

**హుజూర్‌నగర్ :** దేశంలోని మోదీ ప్రభుత్వం బడా బాబులకు, పారిశ్రామికవేత్తలకు కొమ్ము కాస్తుందని ఆల్ ఇండియా కిసాన్‌సభ జాతీయ కౌన్సిల్ సభ్యులు కొప్పోజు సూర్యనారాయణ, ఎఐకెఎస్ రాష్ట్ర నాయకులు పల్లె వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, ఎఐకెఎస్ జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య ఆరోపించారు. బుధవారం ఎస్‌కెఎం జాతీయ కమిటీ పిలుపు మేరకు హుజూర్‌నగర్‌లోని ఇందిరా సెంటర్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, దేశ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జక్కుల రమేష్, యల్లావుల రమేష్, పొనుగుపాటి వాసుదేవరావు, సోమగాని కృష్ణ, దుగ్గి బ్రహ్మం, వట్టె సైదులు, హుస్సేన్, వెంకటరెడ్డి, నాగయ్య, చందర్‌రావు, వీరమల్లు, వీరయ్య, భిక్షం, ప్రసాద్, మల్లయ్య, రమణ పాల్గొన్నారు.

**సూర్యాపేట టౌన్ :** కార్పొరేట్ శక్తులు భారత వ్యవసాయ రంగాన్ని విడిచి పెట్టాలని ఎస్‌కెఎం జిల్లా కన్వీనర్ మండారి డేవిడ్ కుమార్, ఎఐకెఎఫ్ రాష్ట్ర నాయకులు వరికుప్పల వెంకన్న, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, వ్యకాసం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌కెఎం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద అమెరికా అధ్యక్షుడు ట్రంప్, దేశ ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బెల్లంకొండ సత్యనారాయణ, దంతాల రాంబాబు, కునుకుంట్ల సైదులు, నారబోయిన వెంకట్ యాదవ్, వల్లపుదాసు సాయికుమార్, పోలెబోయిన కిరణ్, జె నరసింహారావు, ఎల్గూరి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

**పాల్వంచ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మనదేశంపై విధిస్తున్న సుంకాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పెదవి విప్పాలని అఖిలపక్షనాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షులు ట్రంప్‌ల దిష్టిబొమ్మలను బుధవారం దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఐ, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐఎంఎల్ , టియుసిఐ నాయకులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, కొత్వాల శ్రీనివాసరావు, దొడ్డా రవికుమార్, కల్లూరి కిషోర్, గౌని నాగేశ్వరరావు, అడుసుమిల్లి సాయిబాబ, వి.పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, చెరుకూరి శేఖర్‌బాబు, కొంగర అప్పారావు, బానోత్ రంజిత్, బిక్కూలాల్, లాల్‌సింగ్, కరీం, సురేష్, సుధాకర ప్రభాకర్, రామక్రిష్ణ పాల్గొన్నారు.


సూర్యాపేట...



వరంగల్...


హుజూర్‌నగర్...


పాల్వంచ...


సంగారెడ్డి...



యాదాద్రి...

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ గవర్నర్ దత్తాత్రేయ

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** బిజెపి నాయకులు గొంగళ్ల బాలేష్ అన్న గొంగళ్ల కృష్ణ కుమారుని వివాహం బుధవారం అవుషాపూర్ గ్రామంలోని రాక్ ఎంక్లేవ్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఈటల రాజేందర్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్,మేడ్చల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్‌లు హాజరై


నూతన వధువరులు మధుసూదన్,ప్రజ్ఞలను ఆశీర్వదించారు.

## కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆసుపత్రి ఏర్పాటు చేస్తా : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/చర్లపల్లి :** కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తానని ఉప్పల్ ఎంఎల్ఎ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేస్2లోని సిఐఏ భవనంలో చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం,ఐలా,లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డెన్ జూబ్లీ,లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత మల్టీ వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి,సిఐఏ డి శ్రీనివాస్‌రెడ్డి,ఐలా చైర్మన్ గోవింద్‌రెడ్డిలతో కలసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్లపల్లి పారిశ్రామివాడలో కార్మికుల పరిరక్షణకు 100 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు.జీనియా,ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, రెనోవా డిడిహెచ్ ఆసుపత్రి,ఎంఎస్‌రెడ్డి లయన్స్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో 2 వేల మందికి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పావనీ రెడ్డి,ఐలా మాజీ అధ్యక్షులు కె హరీష్‌రెడ్డి, పిఎస్ మోహన్,రాఘవయ్య,గంగాధర్‌బాబు,సుధాకర్‌రెడ్డి,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజానికి పాటుపడాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టటంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా పిలుపిచ్చారు. నషా ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా యువత పాటుపడాలని, డ్రగ్స్ తీసుకొనే వారితో పాటు సరఫరా చేస్తున్న సమాచారం తెలిస్తే బాధ్యతాయుతంగా 1908కు సమాచారం అందించాలని, సమాచారమిచ్చిన వారి విషయం గుప్తంగా ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికా గుప్తా, డిఆర్‌ఓ హరిప్రియ, ఏఓ రాంమోహన్, జిల్లా సంక్షేమ శాఖాధికారి శారద, కమ్యూనిటి ఎడ్యుకేటర్ విజయ, వివిధ ప్రభుత్వ శాఖాధికారులు, సిబ్బంది కల్సి మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిన చేసారు.

## చర్లపల్లిలో స్వచ్ఛ భారత్



**ప్రజాపక్షం/చర్లపల్లి :** చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి బస్‌స్టాప్‌లో బిజెపి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు.బిజెపి నాయకుల ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని శుభ్రం చేసి పూలమాల వేసి నివాళులర్పించి పార్టీ ఆదేశాల మేరకు పెద్ద చర్లపల్లి చౌరస్తాలో పరిసరాలను శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో స్వచ్ఛ్ భారత్ డివిజన్ ఇన్‌చార్జ్ శంకర్ వంశరాజ్,రైల్వే బోర్డు మెంబర్ కొమ్మ నర్సింగ్ రావు,నాయకులు డి నాధం, కె నాగమణి,ఇస్తావత్ హరినాయక్,రామకృష్ణగౌడ్,వి రాంబాబు,ఎండి ఎజాజ్,రాజు,రాజేష్‌వంశరాజ్,కిషన్,బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగరవేద్దాం

పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్




**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఆపరేషన్ సింధూర్ విజయానికి చిహ్నంగా ప్రతి ఒక ఇంటిపైన జాతీయ పతాకాన్ని ఎగురవేద్దామని పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. బిజెపి జిల్లా పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ ఏర్పాటుచేసిన పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల గ్రామం నుండి నారపల్లి వరకు తిరంగా ర్యాలీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్,మేడ్చల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి,మాజీ జిల్లా అధ్యక్షులు విక్రం రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ 79వ స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఆపరేషన్ సింధూర్ విజయానికి చిహ్నంగా మన దేశ సైనికుల పరాక్రమంపై గర్వంతో ప్రతి ఒక్కరూ ఇంటిపైన జాతీయ పతాకాన్ని ఎగరేద్దాం మన దేశభక్తిని చాటి చెప్పే విధంగా ముందుకు పోదామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ నాయకులు బిక్కు నాథ్ నాయక్, బిజెపి మండల అధ్యక్షులు బస్వారాజు గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి, ఓబీసీ నాయకులు కాలేరు రామోజీ,మహేష్, రాంపల్లి గిరి గౌడ్, సురేష్ నాయక్,మహిళామోర్చ నాయకురాలు రాష్ట్ర నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు రాజకీయ పార్టీలకు షోకాజ్ నోటీసులు

గత ఆరేళ్లుగా పోటీ చేయలేదు, గుర్తింపు తొలగిస్తాం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** గత ఆరేళ్లుగా ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేయని కారణంగా నాలుగు రాజకీయ పార్టీలకు ఎలక్షన్ కమిషన్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆల్ ఇండియా బిసి,ఓబిసి పార్టీ,నవ భారత్ నేషనల్ పార్టీ, తెలంగాణా ప్రగతి సమితి, తెలంగాణా ఇండిపెండెంట్ పార్టీలు రాజకీయ పార్టీలుగా నమోదు చేసుకొని ఇప్పటి వరకు లోకసభ, శాసన సభ ఎన్నికల్లో తమ పార్టీల తరపున అభ్యర్థులను పోటీ చేయలేదని, ఈ కారణంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల జాబితా నుండి తొలగించేందుకు ప్రతిపాదించిన మేరకు ఆయా పార్టీల అధ్యక్షుడు కానీ ప్రధాన కార్యదర్శి కానీ ఈ నెల 15 నాటికి సరైన ఆధారాలతో అఫిడవిట్ ద్వారా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి ప్రత్యక్షంగా జవాబు ఇవ్వాలని, లేని పక్షంలో ఆ పార్టీల గుర్తింపు రద్దు చేస్తామని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మను చౌదరి షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు.

# భయం... భయం మేడ్చల్ జిల్లావ్యాప్తంగా కుండపోత వర్షం

- చెరువులను తలపిస్తున్న రహదార్లు
- ఎక్కడ పడితే అక్కడ ట్రాఫిక్‌జామ్, వర్షపు నీటితో గుంతలు



**ప్రజాపక్షం/మేడ్చల్‌మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా గత మూడు రోజులుగా కుండపోత వర్షం దంచి కొడుతోంది. శుక్రవారం వరకు అతి భారీ వర్షాలున్నాయని వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లా కలెక్టర్ అధికారులను అప్రమత్తం చేస్తూ అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు వెళ్లాలంటూ సూచనలిచ్చారు. బుధవారం జిల్లాలోని మూడుచింతలపల్లి మండలంలో 11.7 మి.మి గా అధిక వర్షపాతం నమోదైంది. పలు చోట్ల లోతట్టు ప్రాంతాలన్ని జలమయం అవుతున్నాయి. రోడ్లపై వర్షం నీరు చిన్న పాటి చెరువుల్లా పారుతుండటం, తద్వారా ఏర్పడ్డ గుంతలు కనపడకుండా పోవటం ప్రమాదకరంగా మారాయి. పలు ప్రధాన రహదారులతో పాటు చిన్నచిన్న గల్లీలోనూ హైటెక్ సిటితో పాటు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార పనులకు రాకపోకలు వేలాది సంఖ్యలో ప్రయాణించే వాహనదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కారణంగా కూకట్‌పల్లి, తార్నాక, జీడిమెట్ల, బాలానగర్, బోయినపల్లి, ఉప్పల్, మేడిపల్లి, సుచిత్ర, కొంపల్లి, ఘట్‌కేసర్ తదితర ప్రాంతాల్లో వర్షం కారణంగా రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు భయం భయంతో పయనించాల్సి వస్తోంది. మరో పక్క నాలాలు,డ్రైనేజి మ్యాన్‌హోల్లు పొంగి రోడ్లపై వర్షంపు వరదతో పాటు మురుగు నీరు ఏరులై పారుతోంది. పలు కాలనీల్లో రోడ్లు కాలువలుగా, ఖాళీ ప్రదేశాలు చెరువులను తలపిస్తున్నాయి. ఈ కారణంగా తమ ఇళ్లలోంచి బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లనూ మేఘావృతమై రోజంతా చినుకు చినుకు వర్షంతో మొదలై సాయంత్రమయ్యే సరికి కుండపోత వర్షం కురుస్తోంది. జిల్లాలోని ఉప్పల్, రామంతాపూర్, తార్నాక, కూకట్‌పల్లి, మేడ్చల్, మూడుచింతలపల్లి, శామీర్‌పేట, మల్కాజిగిరి, మౌలాలి, హబ్సిగూడ, బాలానగర్, జీడిమెట్ల, సూరారం, కొంపల్లి,సుచిత్ర, ఆల్వాల్ తదితర ప్రాంతాల్లో వాహనదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు.

### 47% అధిక వర్షపాతం

ఈ ఏడాది వర్షాకాలంలో గత జూన్ ఒకటో తేదీ నుండి నేటి వరకు 304.9 మి.మిల సాధారణ వర్షపాతాని కంటె 448.9 మిమి వర్షం కురిసి 47% అధిక వర్షపాతం నమోదైంది. బుధవారం జిల్లాలో గాజులరామారంలో 60.8 మిమిగా అధిక వర్షం పడింది.

## కంపు కొడుతున్న అంబేద్కర్ చౌరస్తా...!

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే అంటున్న అధికారులు
- తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్న ప్రజలు



**ప్రజాపక్షం/కొడంగల్ :** వర్షకాల సీజన్‌లో వర్షపు నీరు మురుగు కాల్వలోకి వచ్చి మురుగునీరు అంత రోడ్లపైకి రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురి కావడమే కాకుండా దుర్వాసనతో కంపు కొడుతుందని కొడంగల్ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని తాండూర్ రోడ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్డును ఆక్రమించి పలువురు వ్యాపారస్థులు మురుగుకాల్వలపై అక్రమ కట్టడాలు కట్టుకుని తమ వ్యాపారాలను జోరుగా సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మురుగుకాల్వలు సరిగ్గా పనిచేయకపోవడం, మున్సిపల్ కార్మికులకు కూడా వ్యాపారస్థులు సహకరించకపోవడంతో మురుగు కాల్వలను పట్టించుకునే నాథుడే కరువైయ్యారు. పై నుంచి మురుగునీరు అంత వచ్చి అంబేద్కర్ చౌరస్తాలోకి వచ్చి అక్కడ నిల్వ ఉండటం రోడ్లపైకి మురుగునీరు రావడంతో అందులో నుంచే ప్రజలు కాలినడకన నడవటంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. చిన్న చిన్న వ్యాపారస్థులు కూడా అదే మురుగునీటి పక్కనే వ్యాపారాలు చేసుకొవడం చూపరులను ఆశ్చర్యానికి గురి చేస్తు ముక్కున వేలుసుకుంటున్నారు. దీంతో పాటు వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉంటడం కారణంగా అంబేద్కర్ చౌరస్తాలో రోడ్లు మొత్తం మురుగుమయంగా మారడంతో ప్రజలు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అంబేద్కర్ చౌరస్తా విస్తరణ పనులు చేపట్టడగా కాంట్రాక్టర్ పనులను నత్తనడకన సాగిస్తుండటం వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పాడుతుంది.

### కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి

అంబేద్కర్ చౌరస్తా విస్తరణ పనులలో బాగంగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లనే రోడ్డు పూర్తిగా నాశనం అవుతున్నాయని కొడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ అన్నారు. ప్రస్తుతం వర్షకాలం కావడంతో విస్తరంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మురుగునీరు అంత రోడ్డపైకి రావడంపై గత నాలుగు ఐదు రోజులుగా కాంట్రాక్టర్‌కు సంబందిత శాఖ అధికారులకు ఫోన్ చేసి సమస్యలను వివరించి పనులను త్వరితగతిన చేపట్టాలని కోరినప్పటికి వారు స్పందించకపోవడం బాదకరంగా ఉందని వాపోతున్నారు. ఒక పక్క ప్రజలు ఇబ్బందులకు గురవుతు దుర్వాసన వెదజల్లుతున్న కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో పై జిల్లా స్థాయి అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు.

**మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్**

## ఉప్పల్ నియోజకవర్గంలో ప్రచార రథం






### మహాసభలను విజయవంతం చేయాలి : జి.దామోదర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి /జవహర్‌నగర్:** జిల్లాలో నాలుగు రోజుల పాటు జరుగనున్న సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి కోరారు. మహాసభలకు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని ఆయన బుధవారం ఇసిఐఎల్‌లోని పార్టీ కార్యాలయం నీలం రాజశేఖరరెడ్డి భవన్ నుండి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు ప్రచార రథం ఉప్పల్ నియోజకవర్గంలో సంచరిస్తూ కాలనీలు, బస్తీల్లో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేయటం ద్వారా మహాసభలకు భారీగా హాజరు కావాలని ప్రచారం కొనసాగిస్తుందని తెలిపారు. మొదటి రోజున ఇసిఐఎల్, కుషాయిగూడ, చర్లపల్లి, ఎఎస్‌రావు నగర్, హెచ్‌బి కాలనీ, అశోక్‌నగర్, మల్లాపూర్, నాచారం, హబ్సిగూడ, ఉప్పల్, చిలుకానగర్, రామంతాపూర్ ప్రాంతాల్లో ప్రచారం సాగించిందన్నారు. ఈ కార్యక్రమం లో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.సత్యప్రసాద్, నియోజకవర్గ సభ్యులు నారా నర్సింహా, సాయిలు, కిరణ్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతలు మహేష్, సుధీర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### జవహర్‌నగర్‌లో ఎమ్మెల్సీ నెల్లికంటి

మహాసభల నేపథ్యంలో జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బుధవారం జరిగిన ఇంటింటి ప్రచార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వందేళ్లుగా సిపిఐ ప్రజల వెన్నంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాటి అనేక ఫలితాలు సాధించిందన్నారు. గత పదేళ్లుగా పాలించిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లు ఇవ్వకుండా మభ్యపెట్టి గులాబీ శ్రేణులకు ఇళ్లను కట్టబెట్టిందని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నరసింహ, రాష్ట్ర నాయకులు రవిచంద్రన్, కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, ఆల్వాల్ మండల కార్యదర్శి అమరావతిబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగయ్య, గిరిజన సమైక్య ప్రధాన కార్యదర్శి స్వరూప, కీసర మండల సిపిఐ సహాయ కార్యదర్శి రవి నాయక్, మండల అధ్యక్షులు, ఎఐటియుసి అంబాల ఎల్లయ్య, కాప్రా మండల సహాయ కార్యదర్శి లక్ష్మి నారాయణ, మహిళా సమైక్య అధ్యక్షురాలు కోనాసు జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ డిప్యూటేషన్ రద్దు చేయాలని విద్యార్థుల ధర్నా,రాస్తారోకో

**ప్రజాపక్షం/కొందుర్గు:** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల చెరుకుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరిని డిప్యూటేషన్‌పై పంపించడాన్ని నిరసిస్తూ బుధవారం పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు ధర్నా, పరిగి షాద్‌నగర్ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు డిప్యూటేషన్ పై వెళ్లిన టీచర్ డిప్యూటేషన్ రద్దుచేయాలని నినాదాలు చేశారు. డిప్యూటేషన్ సంబంధించి వివరాల్లోకి వెళితే కొందుర్గు మండలంలోని చెరుకుపల్లి గ్రామపంచాయతీలో ఉన్న ఏకైక ప్రాథమిక పాఠశాలలో 47మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో ఇద్దరూ ఉపాధ్యాయులు పనిచేస్తు ఉండేవారు. వారిలో ఒకరు డిప్యూటేషన్ పై జిల్లాలోని గండిపేట్ మండలంకు వెళ్లడం జరిగింది. అక్కడికి వెళ్లిన ఉపాధ్యాయులతో ఇక్కడ సమస్య మొదలైంది. 47 మంది ఉన్న విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయునితో పాఠశాలను నడిపించలనే ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆలోచనను విరమించుకోవాలని, తక్షణమే డిప్యూటేషన్ రద్దు చేసి ఇద్దరు ఉపాధ్యాయులను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు డిమాండ్ చేస్తూ ఎంఇఒ ఆఫీస్ ముందు ధర్నాతో పాటు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో సంబంధిత అధికారులు అక్కడికి వచ్చి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు సత్యనారాయణ, కుమార్, రాజు,శ్రీను, సునీత,శివాని,తదితరులు పాల్గొన్నారు.





## 72 గంటలు భారీ వర్షాలు... హై అలర్ట్

- వరద ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- విద్యుత్, రెవెన్యూ, పోలీస్,హైడ్రా, వైద్య బృందాలు సిద్ధం : కమిషనర్ ఎ.శైలజ

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** రాష్ట్రం లో రాబోయే 72 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో బుధవారం బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో కమీషనర్ ఏ.శైలజ అధ్యక్షతన విద్యుత్, రెవెన్యూ, పోలీస్,హైడ్రా, వైద్య ఆరోగ్య, ఇరిగేషన్ శాఖల అధికారులతో ప్రత్యక సమావేశం ఏర్పాటు చేసి అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ శైలజ మాట్లాడుతూ, వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించడం, ప్రమాద ప్రాంతాలను గుర్తించి రక్షణ బృందాలను సిద్ధం చేశామని తెలిపారు. నగరంలోని ప్రజలు అత్యవసర సమయంలో మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 04027215959 ను సంప్రదిచాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా, సిఐ గోవిందా రెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ శ్యామ్ సుందర్ రావు, డిఈ చిరంజీవి, ఇరిగేషన్ ఏఈ పరమేష్, మెడికల్ ఆఫీసర్ ప్రణీత్, హైడ్రా అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలపై అధికారుల సమావేశం




**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో హెవీ రైన్స్ కారణంగా రాగల 2 రోజుల్లో అధిక వర్షాభావం ఉన్నందువల్ల ముందుగా చేపట్టవలసిన చర్యలపై (పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ట్రాఫిక్, ఎలక్ట్రికల్, ఇరిగేషన్) మొదలగు డిపార్ట్మెంట్‌ల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా చెరువులు, ఎఫ్‌టిఎల్ లెవెల్ ఎప్పటికప్పుడు చూసుకోవాలని, చెరువు కట్టలు తెగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల పైన, అదే విధంగా ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ నుండి ఎక్కువ వర్షాలు ఉన్నప్పుడు గాలికి కరెంటు తీగలు, స్తంభాలు తెగిపడుతుంటాయి కావున సమస్యలు జరగకుండా చూసుకోవాలని, వానలు ఎక్కువ ఉండి రోడ్ల పైన నీళ్లు పొంగినప్పుడు, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని, అధికారులు చర్చించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్ నాయక్, గండి మైసమ్మ తాసిల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్ జీడిమెట్ల ట్రాఫిక్ ఏసీపి ట్రాఫిక్ సిఐ పోలీస్ దుండిగల్ సిఐ, ఎలక్ట్రికల్ ఇంజనీర్ గండి మైసమ్మ ఇరిగేషన్ ఏఈ మున్సిపల్ వార్డ్ ఆఫీసర్స్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి 4వ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

సిపిఐ మేడ్చల్ జిల్లా నాయకులు బొడ్డుపల్లి కృష్ణ



**ప్రజాపక్షం/ సరూర్‌నగర్ :** సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి 4వ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ మేడ్చల్ జిల్లా నాయకులు బొడ్డుపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం కొత్తపేట డివిజన్‌లోని నాగోల్ డాంగె భవన్‌లో స్థానిక నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బొడ్డుపల్లి కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై సిపిఐ 4వ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్‌డిఏ ప్రభుత్వం మోడీ నాయకత్వంలో దొంగ ఓట్లతో, దొంగ నోట్లతో అధికారినికి ఎక్కి దేశ ప్రజలను రైతులను, కార్మికులను, నిరుద్యోగులను, విద్యార్థులను, గాలికి వదిలేశారని మండిపడ్డారు. పెట్టుబడి దారులకు కొమ్ము కాస్తూ పార్లమెంటును మొత్తం వ్యాపారస్తులతో, పెట్టుబడిదారులతో నింపేసిందని విమర్శించారు. 79 సంవత్సరాల స్వాతంత్ర భారత దేశంలో ప్రజాసేవ ప్రజాపాలన శాసన, పరిపాలనను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రజల మనోబావాలను అవకాశంగా తీసుకోని మొన్నటి వరకు రామ మందిరం పేరుతో అధికారానికి వచ్చి, నేడు అధికారాన్ని కాపాడుకోవడానికి సీతా మందిరం అంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఉడుతల మల్లేష్, కె.వెంకటేశ్వర్లు, పి.శివ కుమార్, ఎస్.కార్తిక్, సిహెచ్.ఈశ్వర్, పి.మదు తదితరులు పాల్గొన్నారు.

## శాసన ప్రక్రియపై అవగాహనకు విద్యార్థుల అసెంబ్లీ పర్యటన



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** విద్యార్థులకు శాసన ప్రక్రియపై ప్రత్యక్ష అనుభవం కల్పించాలనే లక్ష్యంతో అర్థశాస్త్ర ఐఏఎస్ అకాడమీ సీనియర్ ఫ్యాకల్టీలు సతీశ్ పెండ్యాల, అలేఖ్య నాగమోతు ఆధ్వర్యంలో రాష్ట్ర శాసనసభ క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన వ్యవస్థ, విధానాలు, ప్రజాస్వామ్యంలో శాసనసభ పాత్రపై అవగాహన కల్పించారు. ఇందుకు సహకరించిన శాసనసభ కార్యదర్శి నరసింహాచార్యులుకు అకాడమీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. తరగతిగదిలో పాఠాలు నేర్చుకోవడం ఎంత ముఖ్యమో, శాసనసభను ప్రత్యక్షంగా చూడటం ద్వారా విద్యార్థుల సిద్ధాంతాన్ని వాస్తవ అనుభవంతో మిళితం చేసుకోవచ్చని సతీశ్ పెండ్యాల తెలిపారు. విద్య, పౌర అవగాహన, ప్రజాసేవలో విజయానికి కావాల్సిన నైపుణ్యాల పెంపునకు అకాడమీ కృషిచేస్తున్నదని పేర్కొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సాగర్ రహదారిపై వన్యప్రాణులకు రక్షణ కరువు

### గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

**ప్రజాపక్షం/యాచారం :** గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గున్‌గల్ అటవీ ప్రాంతం సాగర్ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైద్రాబాద్–నాగార్జునసాగర్ ప్రధాన రహదారి రోజురోజుకు రద్దీగా మారుతుంది. సాగర్ రహదారిపై ఎక్కడా స్పీడు బ్రేకర్లు లేకపోవడంతలో వాహనాలు వేగంగా వెళుతున్నాయి. రెండు నెలల క్రితం సైతం జింక మృతి చెందింది. ఆ విషయం మరువక ముందే మళ్ళీ రోడ్డు ప్రమాదంలో జింక మృతి చెందడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. వన్యప్రాణులున్న ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో వన్యప్రాణులు అంతరించిపోయే ప్రమాదం ఉందని అందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఆపదలో ఉన్నవారికి అండ సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే ప్రకాశ్



**ప్రజాపక్షం/శంషాబాద్ :** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మున్సిపాలిటీ 8వ వార్డులో లబ్ధిదారులు శీలం నాగరాజు,శీలం సిద్ధులుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులను ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్,అందజేశారు. కార్యక్రమంలో తోకల మురళీకృష్ణ , మాజీ కౌన్సిలర్ ఆయిల్ కుమార్ పాల్గొన్నారు. చెక్కులు అందజేసిన అనంతరం తోకల మురళీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఆపదలో ఉన్న ప్రజలకు నిజమైన ఆధారమని తెలిపారు.

## కాలనీల అభివృద్ధికి కృషి

### హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ సుజాతనాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాలనీల అభివృద్ధి కోసం తన కృషి ఎల్లప్పుడు ఉంటుందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బానోతు సుజాత నాయక్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని భీమా నగర్ కాలనీలో పార్కు అభివృద్ధి కోసం 22 లక్షల అర్బన్ బయో డైవర్సరీ నిధులతో అభివృద్ధి పనులను కాలనీ వాసుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హస్తినాపురం డివిజన్ అభివృద్ధి కోసం అధిక ప్రధాన్యత కల్పిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రతి కాలనీలకు అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. అభివృద్ధి పనులను కాలనీ వాసులు సహాకరించాలని ఆమె కోరారు. కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేష్, నరసింహారెడ్డి, కృష్ణ, నరసింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గొపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్ రహిత సమాజానికి అందరి భాగస్వామ్యం కావాలి

### డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ సదానందం



**ప్రజాపక్షం/గండిపేట :** డ్రగ్ రహిత సమాజానికి అందరి భాగస్వామ్యం కావాలని డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ సదానందం అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని రవాణా శాఖ కార్యాలయంలో వాహనదారులతో డీటీసీ సదానందం బుధవారం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నేను మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండటానికి కృషి చేస్తానని డ్రగ్స్ అమ్మకం కొనుగోలు అక్రమ రవాణా చేసి వ్యక్తుల సమాచారాన్ని నిబద్ధత అధికారులకు తెలియజేస్తానని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామ్ని అవుతానని వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏవో ఎస్ హనుమంతు, పద్మ ,ఎం.వి.ఐ కృష్ణ వేణి వానదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా హర్ ఘర్ తిరంగా వేడుకలు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి విద్యావంతులుగా ఎదగాలని బిజెపి తెలంగాణ సంఘటన మంత్రి చంద్రశేఖర్‌జి అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ జి ముఖ్యఅతిథిగా హాజరై రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ సిఈఓ మల్కా యశస్వి, కార్పోరేషన్ బిజెపి అధ్యక్షులు రామిడి వీరకర్ణరెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, మాజీ కార్పోరేటర్‌లు గడ్డం లక్ష్మారెడ్డి, గూడెపు ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా శ్రేయస్సుకు నిరంతరం కృషి

**ప్రజాపక్షం/శంషాబాద్ :** రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ప్రజల శ్రేయస్సు కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తున్న మహానేత అని సుల్తాన్‌పల్లి మాజీ సర్పంచ్ దండు ఇస్తారి అన్నారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామానికి చెందిన నహీదాకు,నీరటి యాదమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఇస్తారి మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపల్, మండల పరిధిలో వేలాదిమంది సిఎం రిలీఫ్ ఫండ్, శాదీ ముబారక్,కళ్యాణలక్ష్మి వంటి పథకాల ద్వారా లబ్ధి పొందడంలో ఎమ్మెల్యే కృషి కీలకమని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎల్గని ప్రభాకర్ గౌడ్, మల్లికార్జున్, రాజు గౌడ్, తెరుపల్లి సిద్దయ్య, మైలారం రాజు, శివ గౌడ్, క్యామా సాయి కిరణ్, నిరటి సుధాకర్, నిరటి మహేందర్, మొహమ్మద్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

# అప్రమత్తమైన హైడ్రా...

### హైదరాబాద్‌లో 436 నీటమునిగే ప్రాంతాలు...
### 150 సమస్యాత్మకమైన ప్రాంతాల్లో హెవీ మోటార్లు ...

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హైడ్రా మరింత అప్రమత్తమైంది. ఎప్పటి కప్పుడు క్యాచ్‌పిట్లలో, కల్వర్టుల్లో చెత్తను తొలగిస్తూ, వరద సాఫీగా సాగేలా హైడ్రా బృందాలు పని చేస్తున్నాయి. హైదరాబాద్ నగర వ్యాప్తంగా 436 ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉందని గుర్తించిన హైడ్రా బృందం ఇందులో సమస్యాత్మకమైన 150 ప్రాంతాలలో హెవీ మోటార్లు బిగించి, వరద సాఫీగా వెళ్లేలా ఏర్పాట్లు చేసింది. మరో 142 ప్రాంతాల్లో కూడా ఇవే ఏర్పాట్లు చేసింది. కొద్దిపాటి సమస్య ఉండే 144 ప్రాంతాలలో వరద ముంచెత్తకుండా చర్యలు తీసుకుంటోంది. హైడ్రా ,డిఆర్ ఎఫ్ 51 బృందాలు రంగంలో ఉండగా, 150 మాన్సూన్ ఎమర్జన్సీ టీములు పని చేస్తున్నాయి. 3565 మంది విధుల్లో నిమగ్నమయ్యారు. అలాగే 9 బోట్లను సిద్ధం చేశారు.

### 309 ప్రాంతాల్లో నిత్యం నిఘా..

నగరంలో 309 ప్రాంతాల్లో నిత్యం నిఘా పెట్టింది. వర్షం వస్తున్నప్పుడు వరదను అంచనా వేసి మ్యాన్ హోళ్లను తెరవడం, తర్వాత మూసేయడం.. క్యాచ్‌పిట్ల వద్ద చెత్తను నిరంతరం తీసివేసే విధులో వీరంతా ఉంటారు. వీరికి తోడు 20 బృందాలు నిత్యం ట్రాఫిక్ పోలీసులతో ఉంటూ,వర్షం వల్ల



ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. చెట్లు పడిపోతే వెను వెంటనే తొలగించేందుకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే ట్రాఫిక్ జామ్‌లలో సులభంగా వెళ్లేందుకు 21 బైకు బృందాలు కూడా ఉన్నాయి. నీరు నిలిచే ప్రాంతాల్లో 212 డి వాటరింగ్ పంపులను అందుబాటులో పెట్టారు. ఐఎండి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ, మూడు పోలీసు కమిషనరేట్లతో పాటు జిహెచ్ ఎంసి, ఫైర్ కంట్రోల్ రూములలోకూడా హైడ్రా సిబ్బంది అందుబాటులో ఉన్నది. కాగా వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు సంక్షిప్త సమాచారం చేరవేయడంతో పాటు జిహెచ్ ఎంసి, ట్రాఫిక్ ఇలా సంబంధిత విభాగాలతో సమన్వయంగా పని చేస్తూ ఎక్కడా సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేసింది.హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

### కలుషిత నీరు, సీవరేజి
## సమస్యలపై ప్రత్యేక దృష్టి

### జలమండలి ఎండి అశోక్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఇఆర్‌టి బృందాలు అప్రమత్తంగా ఉండాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో సీవరేజి ఒవర్‌ఫ్లో సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. జిహెచ్‌ఎంసి, హైడ్రా గుర్తించిన 141 నీరు నిలిచే హాట్‌స్పాట్లను పర్యవేక్షించాలని, ఎక్కడైనా మ్యాన్‌హోల్స్ ఉప్పొంగితే వెంటనే పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. సీవరేజి తరచూ ఓవర్‌ఫ్లో అయ్యే ప్రాంతాల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మ్యాన్‌హోల్స్ నుంచి తీసిన వ్యర్థాలను వెంటనే తొలగించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. తాగునీరు సరఫరా అయ్యే సమయంలో కచ్చితంగా మంచినీటి నాణ్యతను పరీక్షించాలని అధికారులను ఆదేశించారు. బస్తీలు, లోతట్టు ప్రాంతాల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. క్లోరిన్ బిల్లలను ఇంటింటికీ పంపిణీ చేసి, వాటిని వినియోగించి, నీటిని శుద్ధి చేసుకునే తీరుపై ప్రజలకు అవగాహన కల్పించాలని అశోక్ రెడ్డి సూచించారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, సింగూరు రిజర్వాయర్ల వరద పరిస్థితిని ప్రతి గంటకోసారి పర్యవేక్షించి, నీటి ప్రవాహం ఉన్న దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్స్ మూతలను తెరవవద్దని ఆయన కోరారు. ఎక్కడైనా నీరు నిలిచినా, మ్యాన్‌హోల్‌మూత ధ్వంసమైనా, తెరిచి ఉన్నా జలమండలి కస్టమర్ కేర్ నెంబరు 155313కు ఫోన్ చేయాలని అశోక్ రెడ్డి సూచించారు.

## పాఠశాలలు తనిఖీ చేసిన అధికారులు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర స్థాయి విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేశారు. బుధవారం రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆకాడమిక్ మానిటరింగ్‌లో భాగంగా రాష్ట్ర స్థాయి విద్యాశాఖ అధికారులు ఫరూక్‌నగర్ మండలంలోని బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, ఎంఆర్‌సి భవిత సెంటర్‌ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో డిఎస్సీతోపాటు విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు అంధించే మధ్యాహ్న భోజన పథకం వివరాల నమోదు, పాఠ్యం ప్రణాళికలు, పీరియడ్ ప్లాన్స్, డైరీ నమోదు, పాఠ్య భోదన వంటి విషయాలను విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఎంఆర్‌సిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆనందం ఇస్తున్నాయని, ఫరూఖ్‌నగర్ మండలంలో ఉన్న పాఠశాలలు భాగున్నాయని స్థానిక అధికారులను, ఉపాధ్యాయులను అభినంధించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎం ప్రధానోపాధ్యాయురాలు భాగ్యమ్మ, జిహెచ్‌ఎం పద్మనళిని, ఉపాధ్యాయులు శశికళ, స్రవంతి, వెంకటేష్, సిఆర్‌పిలు రాధాకృష్ణ, రవీందర్, నాగమణి, భాగ్యలక్ష్మీ , రాజ్‌కుమార్, జగన్, అనితలు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజానికి సమష్టిగా కృషి

### అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం, పోలీసు శాఖ, యువత, సమాజంలోని అన్ని వర్గాలు సమష్టిగా కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కె చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. మిషన్ పరివర్తన సామూహిక ప్రతిజ్ఞ కార్యకలాపం నషా ముక్త్ భారత్ అభియాన్ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి "మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ వాడకం వలన కలిగే దుష్పరిణామాల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండి, నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియచేస్తానని,డ్రగ్ రహిత జీవనశైలిని అనుసరిస్తానని, డ్రగ్‌రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామినవుతానని" ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, చేపట్టవలసిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాలు సేవిస్తే కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం,పోలీసు శాఖ,యువత, సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సాధారణ ప్రజలు, విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజం తమ బాధ్యతగా భావించాలని, తమ పరిసరాల్లో, కాలేజీలు, పాఠశాలల్లో మత్తు పదార్థాల వాడకం గురించి పరిశీలిస్తూ ఉండాలన్నారు. తెలిసి తెలియక మత్తు పదార్థాల బారిన పడడం వల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని, యువత శారీరక,మానసిక ఆరోగ్యాన్ని మత్తు పదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని చెప్పారు. డ్రగ్స్ మీద పోలీసులు చేస్తున్న పోరాటంలో యువత తమ వంతు భాధ్యత నిర్వహించాలని,డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతో పాటు,తమ దృష్టికి వచ్చే నిషేధిత డ్రగ్స్ సరఫరా మరియు వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

# వరద ముంపు తగ్గించేందుకు చర్యలు

### సరూర్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన టన్నల్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** భవిష్యత్తులో వచ్చే వర్షాకాలం దృష్టిలో పెట్టుకోని సరూర్ నగర్ ప్రాంతంలో ముంపును తగ్గించేందుకు అనేక రకాల పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని ఎల్‌బినగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం వర్షాకాలం దృష్టిలో పెట్టుకోని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సరూర్‌నగర్ కట్ట మీద గతంలో నిర్మించిన నూతన టన్నల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరూర్‌నగర్ ప్రాంతంలో ముంపును తగ్గించేందుకు అనేక రకాల పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగా ప్రియదర్శిని పార్కుల్ మసీదు వద్ద గతంలో మూడు గేట్లతో పాటు దానికి అనుగూణంగా అక్కడే మరో ముడు గేట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకోని నీటి మట్టాన్ని నియంత్రణ కోసం ఈ గేట్లు ఉపయోగపడతాయని, ఒక వేళ భారీ వర్షాలు పడి చెరువులో నీరు బయటకు వచ్చి కాలనీలు ముంచెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలుగా టన్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ టన్నలింగ్ ఏర్పాటు దాదాపు మూడు నుండి నాలుగు నెలల పాటు నత్తనడకన సాగిన పనులకు అధికంగా కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించి పనులను వేగవంతంగా పూర్తిచేయించడం జరిగిందన్నారు. చెరువులోని నీటి మట్టాన్ని నియంత్రణ మా లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే రెండు మార్గాల ద్వారా నీరు బయటకు విడుదల చేయడం జరుగుందని, ప్రస్తుతం నిర్మించిన మూడో టన్నల్ వల్ల చెరువులో ఉన్న నీరు త్వరగా బయటకు పోవడానికి వీలు ఉంటుందన్నారు. తద్వారా నీరు ఓవర్ ఫ్లో కాకుండా కింద ఉన్న కాలనీలు అయిన కోదండరాంనగర్, కమలానగర్‌లు ముంపు ప్రాంతం నుంచి రక్షించబడతాయని తెలిపారు. అలాగే రాబోయే రోజుల్లో న్యూ గడ్డిఅన్నారం కాలనీ వాసుల వరదనీటి సమస్యలు కూడా పరిష్కారం చేయడం జరుగుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, ఎల్‌బినగర్ బిఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షులు రవిముదిరాజ్, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ మాజీ ధర్మకర్త చాతిరి మధుసాగర్, విక్కి, ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నిరంగాల అభివృద్ధికి సహకారం

### కోర్టు సముదాయంలో సిసి రోడ్డు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కోర్టు సముదాయంలో వేసిన సిసి రోడ్డు నిర్మాణం పనులను స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని షాద్‌నగర్ కోర్టు సముదాయంలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.10లక్షలతో నూతనంగా వేసిన సిసి రోడ్డు పనులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. దాంతో బార్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోర్టు సముదాయంలో సిసి రోడ్డు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని న్యాయవాదులు తన దృష్టికి తీసుకువచ్చారని, అడిగిన వెంటనే సిసి రోడ్డు పనులు మంజూరు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ సాధారణ నిధుల నుండి మంజూరు చేయించినట్లు, వెంటనే పనులు సైతం ప్రారంభించామని పేర్కొన్నారు. ఇచ్చిన మాటకు ఎమ్మెల్యే కట్టుబడి సిసి రోడ్డు పనులు చేపట్టినందుకు బార్ అసోసియేషన్ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటిలోని వార్డులతోపాటు అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మాజీ చైర్మెన్ విశ్వం, కృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, రాజేందర్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, రాజునాయక్, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, చంద్రశేఖర్ యాదవ్, చెట్ల శంకర్, చిన్న స్వామి, నరేంద్రనాథ్, రూప్‌సింగ్, మణికంత, సత్తయ్య పాల్గొన్నారు.




# ప్రజా సమస్యల సాధనే లక్ష్యంగా పోరాటాలు

### బుద్దుల జంగయ్య



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** వందేళ్ల చరిత్ర కలిగిన కమ్యునిస్టు పార్టీ సిపిఐ, ప్రజా సమస్యల సాధనే లక్ష్యంగా పోరాటాలు చేసిందని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్దుల జంగయ్య వివరించారు. బుధవారం సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ అధికారంలో ఉన్నా..లేకున్నా ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం పోరాటాలు చేసిందని ' సిపిఐ అని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుంటే ఎప్పటికప్పు ఎండగడుతూ పేద ప్రజల పక్షాన బడుగు జీవుల పక్షాన పోరాటాలు నడిపి వారికి ఎన్నుదన్నుగా నిలుస్తున్న ఏకైన పార్టీ సిపిఐ అని పేర్కొన్నారు. ఈనెల 19వ తేది నుండి 22వ తేది వరకు తెలంగాణ రాష్ట్ర మహాసభలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం మహారాజ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. షాద్‌నగర్ డివిజన్ నుండి సిపిఐ కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకటయ్య, చంద్రయ్య, బాలరాజ్, శంకరయ్య, రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.


**శంకర్‌పల్లి:** శంకర్ పల్లి మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద సిపిఐ మండల కార్యదర్శి పి.సుధీర్ అధ్యక్షతన భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ కే. రామస్వామి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. ప్రభు లింగం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల పాల్గొన్నారు.

కార్యక్రమంలో మల్లేష్, జంగయ్య, మిట్టు తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్:** సిపిఐ రాష్ట నాల్గవ మహా సభ వాల్ పోస్టర్ బుధవారం చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని శంకర్‌పల్లి ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌజ్ అవరణలో చేవెళ్ల నియోజకవర్గ ఇంచార్జ్ రామస్వామి పార్టీ నాయకులతో కలిసి పోస్టర్‌ను అవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సుదీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం, వడ్ల సత్యనారాయణ, మహిళ అధ్యక్షురాలు వడ్ల మంజుల, నాయకులు మల్లేష్ తదితరులు ఉన్నారు.



# రీల్



సినిమాల్లో 50వ వార్షికోత్సవం సందర్భంగా హృతిక్ రోషన్ రజనీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వార్ 2 & కూలీ విడుదలకు ముందు, హృతిక్ రోషన్ తనకు ఆదర్శంగా నిలిచిన రజనీ

## నా మొదటి గురువు రజనీకాంత్

హృతిక్ రోషన్



కాంత్ కు బెస్ట్ విషెస్ తెలుపడం విశేషం. వార్ 2 అండ కూలీ విడుదల సందర్భంగా హృతిక్ రోషన్ తన సోషల్ మీడియా ఎక్స్‌లో ఈ విధంగా పోస్ట్ చేశారు. 'మీ పక్కన నటుడిగా నా తొలి అడుగులు వేశాను. మీరు నా మొదటి గురువులలో ఒకరు.రజినీకాంత్ సార్, మీరు నాకు ఎప్పుడూ ఆదర్శం అవ్వాలి. 50 సంవత్సరాల ఆన్‌స్క్రీన్ మ్యాజిక్ పూర్తి చేసుకున్నందుకు అభినందనలు!' అని పోస్ట్ చేశారు. భగవాన్ దాదా (1986) లో రజనీకాంత్ తో కలిసి బాల నటుడిగా తెర పంచుకున్న విషయాన్ని హృతిక్ గుర్తుచేసుకున్నాడు. ఆయనను 'నా మొదటి గురువులలో ఒకరు' అని ఆయన భావించారు. ఆ సినిమాకు సంబంధించిన ఇద్దరు కలిసి ఉన్న ఒక ఫోటోను కూడా హృతిక్ రోషన్ షేర్ చేశారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో రజనీకాంత్ 50 సంవత్సరాల సేవ పట్ల తనకున్న గౌరవాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన తెరపై మాయాజాలాన్ని ప్రశంసించాడు.

## విజయ్, రష్మికలకు అరుదైన గౌరవం

ఈ నెల 17న అమెరికాలో 43వ ది వరల్డ్ ఇండియా డే పెరేడ్





హీరో విజయ్ దేవరకొండతో పాటు హీరోయిన్ రష్మిక మందాన అరుదైన గౌరవం దక్కించుకున్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో అమెరికాలోని న్యూయార్క్‌లో జరగనున్న ది వరల్డ్ లార్జెస్ట్ ఇండియా డే పెరేడ్‌లో ఆయన గ్రాండ్ మార్షల్‌గా పాల్గొనబోతున్నారు. ఈ నెల 17న మధ్యాహ్నం 12 గంటలకు మాడిసన్ అవెన్యూలో పరేడ్ వేడుకలకు గ్రాండ్ మార్షల్‌గా విజయ్ దేవరకొండ, రష్మిక మందాన వ్యవహరించనున్నారు. ఈ వేడుకలకు దాదాపు 6 లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ పరేడ్ ప్రపంచంలోనే అతి పెద్ద ఇండియా డే పరేడ్‌గా ప్రసిద్ధి పొందింది. పహాల్గాం ఉగ్రవాదుల దాడి, అహ్మదాబాద్ విమాన ప్రమాద బాధితులకు నివాళులు అర్పించడంతో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ వేడుకల్లో పాల్గొనడంపై హీరో విజయ్ దేవరకొండ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రాండ్ మార్షల్‌గా వ్యవహరించడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని, అలాగే అమెరికాలోని భారతీయులు, తెలుగు వారితో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకునేందుకు ఎదురుచూస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్వే భవంతు సుఖినః అనే థీమ్‌తో ఆగస్టు 17న మాడిసన్ అవెన్యూలో పరేడ్ వేడుకలు జరుగనున్నాయి. 1981వ సంవత్సరం నుంచి ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు.


## 'కూలీ' విషయంలో ఆ భయం లేదు

### శ్రుతి హాసన్



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 'కూలీ' హంగామా కొనసాగుతోంది. అగ్రకథానాయకుడు రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన యాక్షన్ థ్రిల్లర్ మరికొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో ప్రీతి అనే పాత్రలో శ్రుతి హాసన్ కనిపించనున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'కూలీ' చిత్రం రజనీకాంత్ అభిమానులను సర్‌ప్రైజ్ చేస్తుందని వారిలో జోష్ పెంచారు. 'ఇందులో అగ్రహీరోలు రజనీకాంత్, నాగార్జున, ఆమిర్ ఖాన్ ఇలా ఎంతో మంది ఉన్నారు. నా పాత్రకు గుర్తింపు ఉండదేమో అనే భయం నాకు లేదు. ఎందుకంటే లోకేశ్ ఈ సినిమాను అద్భుతంగా రూపొందించారు. ప్రతి పాత్రకు న్యాయం చేసే విధంగా స్క్రిప్ట్ రాశారు. అందరి పాత్రలు భిన్నంగా ఉంటాయి. రజనీకాంత్‌తో వర్క్ చేస్తూ ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఆయన సెట్‌లో ఉంటే ఎంతో సందడిగా ఉంటుంది. ఆయనను చూడటమే ఒక అద్భుతం' 'తెరపై ప్రీతిని చూసేందుకు అందరిలాగే నేనూ ఎదురుచూస్తున్నా. 'ఖైదీ', 'మాస్టర్', 'విక్రమ్' వంటి సినిమాలతో వరుస విజయాలు సొంతం చేసుకున్న లోకేశ్ 'కూలీ'తో మరోసారి అందరినీ ఆశ్చర్యపరుస్తారు. ఆయన సినిమాల్లో ప్రేక్షకులకు నచ్చే యాక్షన్ సన్నివేశాలుంటాయి. భావోద్వేగాలతో పాటు వినోదానికి కూడా లోటుండదు. 'కూలీ' ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం తగ్గదు. ముఖ్యంగా రజనీ అభిమానులకు ఇదో సర్‌ప్రైజ్. లోకేశ్ నాకు ఈ కథ చెప్పగానే అంగీకరించా. ప్రీతి పాత్ర మహిళలందరికీ నచ్చుతుంది'' అని శ్రుతి ధీమా వ్యక్తం చేశారు.

## సెప్టెంబర్ 19న 'భద్రకాళి'



బిచ్చగాడు హీరో విజయ్ ఆంటోనీ తాజాగా 'భద్రకాళి'సినిమాతో జనం ముందుకు వస్తున్నారు. ఈ చిత్రానికి అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం సెప్టెంబర్ 19న విడుదల చేయనున్నారు. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను కూడా తెలుగులో రిలీజ్ చేస్తుంది. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సపోర్ట్ చేస్తోంది. పుటికే విడుదలైన టీజర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది.


## సక్సెస్ ఫుల్ సీరీస్ 'మోతేవారి లవ్ స్టోరీ'




జీ5లో ప్రసారం అవుతున్న గ్రామీణ తెలంగాణ కథ 'మోతేవారి లవ్ స్టోరీ'ని ఆడియెన్స్ ను విశేషంగా ఆకట్టుకుంటోంది. అనిల్ గీలా, వర్షిణి ప్రధాన పాత్రల్లో నటించారు. ఆగస్టు 8న ప్రీమియర్ అయిన ఈ సిరీస్ సంచలనాత్మక స్పందనను దక్కించుకుంది. విడుదలైన మూడు రోజుల్లోనే 2,00,000 మందికి పైగా వీక్షకులను ఆకర్షించింది.శివ కృష్ణ బుర్రా రచన, దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో మురళీధర్, సదన్న, విజయ లక్ష్మి, సుజాత ఇతరులు కీలక పాత్రల్లో నటించారు. మధుర ఎంటర్‌టైన్‌మెంట్, మై విలేజ్ షో బ్యానర్‌లపై మధుర శ్రీధర్, శ్రీరామ్ శ్రీకాంత్ 'మోతేవారి లవ్ స్టోరీ'ని నిర్మించారు.తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో రూపొందిన 'మోతేవారి లవ్ స్టోరీ' ఆరెపల్లి గ్రామం చుట్టూ తిరుగుతుంది. ఆ ఊర్లోని పర్శి (అనిల్ గీలా) అనే యువకుడి చుట్టూ కథ నడుస్తుంది. అతను సత్తయ్య (మురళీధర్ గౌడ్ కుమార్తె అనిత (వర్షిణి)తో ప్రేమలో పడతాడు. కానీ సత్తయ్య, అతని సోదరుడు నర్సింగ్ (సదన్న) తమ దివంగత తండ్రి రాసిన ఓ వీలునామాను బయటపడటం, దీంతో ఓ భూ వివాదం చెలరేగడం.. ఇక దీంతో హాస్యం, భావోద్వేగాలు పుట్టుకు రావడం, చివరకు ఊహించని మలుపులకు దారి తీయడం జరుగుతుంది.ఈ సిరీస్ సక్సెస్ ఫుల్ కావడం పట్ల నిర్మాత మధుర శ్రీధర్ ఆనందం వ్యక్తం చేశారు.

## అన్నపూర్ణ స్టూడియోకు యాభై ఏళ్ళు

వందలాది సినిమా సక్సెస్‌కు అన్నపూర్ణ స్టూడియో వేదికైంది. సొంత సినిమాలే కాదు ఇతర నిర్మాతలకు కూడా అన్ని రకాల అందుబాటులో ఉండే ఏకైక స్టూడియోగా అన్నపూర్ణ స్టూడియో పేరు గాంచింది. చిన్న నిర్మాతలు మొదలుకొని పెద్ద నిర్మాతల వరకు ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండే ఈ అన్నపూర్ణ స్టూడియో స్థాపించి యాభై ఏళ్ళు అవుతోంది. అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో 22 ఎకరాల భూమిని ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావుకు కేటాయించింది. హైదరాబాద్‌లో తెలుగు చిత్ర పరిశ్రమను ప్రోత్సహించే లక్ష్యంతో ఫిల్మ్ స్టూడియో నిర్మించడానికి కేటాయించారు. 13 ఆగష్టు 1975లో ఈ స్టూడియో నిర్మాణానికి ముహూర్తం పడింది. ఈ 22 ఎకరాల స్థలంలో అక్కినేని నాగేశ్వరరావు అన్నపూర్ణ స్టూడియోస్‌ను స్థాపించారు. స్టూడియోను అప్పటి భారత రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ప్రారంభించారు. ఈ స్టూడియోలో నిర్మించిన మొదటి చిత్రం 'సెక్రటరీ'. 1976వ సంవత్సరంలో నిర్మించిన ఈ సినిమాలో నాగేశ్వరరావు, వాణిశ్రీ జంటగా నటించారు. ఈ సినిమాను డి.రామానాయుడు నిర్మించారు. ఈ సినిమా హైదరాబాద్‌లో తెలుగు సినిమాకు అభివృద్ధి చెందడానికి ప్రధాన కేంద్రంగా సహాయపడిందని చెప్పవచ్చు. ఈ స్టూడియో ప్రధానంగా సినిమాలకు సేవలను అందిస్తుంది, వాటిలో సెట్ నిర్మాణం కోసం సౌండ్ స్టేజ్‌లు, అవుట్‌డోర్ సెట్‌లు, ఫ్లోర్లు, బ్యాక్‌లాట్‌లు, డేటా స్టోరేజ్, ఎడిటింగ్, డబ్బింగ్, సౌండ్ ఎఫెక్ట్స్, విజువల్ ఎఫెక్ట్స్, డిజిటల్ ఇంటర్మీడియట్, డాల్బీ విజన్ / స్టీరియో, నియర్ ఫీల్డ్ మిక్సింగ్, డాల్బీ అట్మాస్ సౌండ్ మిక్సింగ్, కన్ఫార్మింగ్ అండ మాస్టరింగ్ స్క్రీనింగ్ థియేటర్లు, ఇతర సౌకర్యాలు ఉన్నాయి. సినిమా స్టోరీ చర్చల దగ్గరి నుంచి మొదలుకొని షూటింగ్ పూర్తయి రిలీజ్ వరకు అన్ని పనులకు అవకాశం కల్పిస్తూ ఈ స్టూడియోను అందరికి అందుబాటులోకి తీసుకొచ్చారు. అన్నపూర్ణ స్టూడియో నిర్మించి యాభై ఏళ్ళు అవుతున్న సందర్భంగా నాగార్జున అప్పటి రెండు ఫోటోలను విడుదల చేశారు.



## సెప్టెంబర్ 2న జల్సా రీ రిలీజ్




పవన్ కళ్యాణ్ హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన జల్సా సినిమాను రీ రిలీజ్ చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈసినిమా విడుదలైన సమయంలో సూపర్ డూపర్ హిట్ అయింది. ఇలియానా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో పార్వతి మెల్టన్ రెండో హీరోయిన్‌గా నటించింది. ప్రకాష్ రాజ్, సునీల్, బ్రహ్మానంద కీలకమైన పాత్రల్లో నటించారు. కమలిని ముఖర్జీ మరో కీలకపాత్రలో కనిపించారు. దీవి ప్రసాద్ సంగీతం అందించిన ఈ సినిమాలో పాటలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. అయితే సెప్టెంబర్ 2వ తేదీన ఈ సినిమాను గీత ఆరట్స్ రీ రిలీజ్ చెయ్యడానికి సన్నాహాలు చేస్తోంది. పవన్ కళ్యాణ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను రీ రిలీజ్ చెయ్యాలని గీత ఆర్ట్ ప్లాన్ చేసింది. ఈ మేరకు తన సోషల్ మీడియా ఎక్స్ లో పోస్ట్ చేసింది. జల్సా పోస్టర్ ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. తొలిసారిగా విడుదలైనప్పుడు ఎంత పెద్ద సక్సెస్ అయిందో ఇప్పుడు రీ రిలీజ్ సమయంలో కూడా మంచి సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉందని నిర్మాత అల్లు అరవింద్ ఆశాభావం వ్యక్తం చేశారు.



## అమెరికా సుంకాలతో భారత్‌కు తీవ్రనష్టం

బివి.రాఘవులు

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** విధించడం వల్ల తీవ్ర నష్టం కలుగుతుందని భారత్‌పై అమెరికా విధించిన భారతపై అమెరికా 50 శాతం సుంకాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు డిమాండ్ చేశారు. భారతిపై అమెరికా విధిస్తున్న టారిఫ్ కు వ్యతిరేకంగా సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్లకార్డులను ప్రదర్శించి అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ అమెరికా విధించిన సుంకాలతో దేశానికి తీవ్రనష్టం కలుగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సుంకాల పెంపుతో ఫార్మారంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్పారు. హైదరాబాద్ ఐటీ సేవలకూ నష్టం కలుగుతుందన్నారు. సుంకాల విధించడం వల్ల ఐటీ సంస్థలు నష్టపోతాయని అన్నారు. అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ అమెరికా సైనిక చర్యలు, ఆయుధ వ్యాపారంతో ఆర్థిక దోపిడికి పాల్పడుతూ ప్రపంచ దేశాలపై పెత్తనం చెలాయిస్తుందని విమర్శించారు. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై 50 శాతం సుంకాలు విధించిన ట్రంప్ అమెరికా నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే వస్తువులపై జీరో సుంకాలుండాలంటూ మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ప్రధానమంత్రి మోదీ సుంకాలు విధించి గట్టి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి నాగయ్య, టి సాగర్, ఎండీ అబ్బాస్, బండారు రవికుమార్, ఎండీ జహంగీర్, హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేశ్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యంతోపాటు రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులతో కేంద్రం ఆటలాడుతోంది

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రైతుల పంటలతో కేంద్రం ఆటలాడుతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. రాష్ట్రానికి అవసరమైన యూరియా ఎరువుల సరఫరాలో కేంద్ర ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం, ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణకు 9.80 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేయాల్సి ఉండగా ఏప్రిల్–జూలైలో 32 శాతం మే నెలలో 45శాతం ఆగస్టులోనూ 35 శాతం తక్కువ సరఫరా చేయడంతో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం తరఫున ఎన్ని లేఖలు రాసిన కూడా స్పందించడం లేదన్నారు. రాష్ట్రానికి తాము ఉన్నాం చూసుకుంటామని లేఖల మీదనే తెలపడం తప్ప, రాష్ట్రానికి కేంద్రం చేసింది ఏమీ లేదని విమర్శించారు. కేంద్రం రాష్ట్రం మీద సవతి తల్లి ప్రేమను చూపిస్తుందని అన్నారు. రాష్ట్ర రైతులకు ప్రయోజనం చేకూరేందుకు రాజకీయాలన్నింటిని పక్కన పెట్టి, ఎన్నోసార్లు కేంద్రం తలపు తట్టామని, స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా కలిసి లేఖల ద్వారా పలుమార్లు కోరినా కూడా కేంద్రం రాష్ట్రంపై శీతకన్ను చూస్తుందని మంత్రిగారు దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, కారణంగా .'రైతులు పంట పొలంలో ఉండాల్సిన సమయంలో, ఎరువుల కోసం క్యూల్లో నిలబడే పరిస్థితిని ఏర్పడిందన్నారు.. దేశానికే అన్నం పెట్టే తెలంగాణ రైతుల హక్కుల కోసం, తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రం నిర్లక్ష్యంపై ఎప్పటికప్పుడు పోరాడుతాం' అని మంత్రి తుమ్మలస్పష్టంచేశారు.

## హైడ్రా యుద్ధానికి వెళుతోందా?

వాహనాలకు ఆ రంగులేంటి?

హైకోర్టు ఆగ్రహం




**ప్రజాపక్షం /హైదరాబాద్ :**హైడ్రా చేస్తున్న హడావుడిపై హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఏమైనా యుద్ధం చేసేందుకు వెళుతోందా అని నిలదీసింది. హైడ్రా వాహనాలకు వేసిన రంగుల తీరును తప్పుబట్టింది. అసహజ రంగులెందుకని ప్రశ్నించింది యుద్ధానికి వెళుతున్నారా, ప్రజల ఇబ్బందులకు గురిచేసేందుకే విధుల్ని నిర్వహిస్తున్నారా అని కూడా ప్రశ్నించింది. ప్రభుత్వ అధికారులు కోర్టు ఉత్తర్వుల అమలు గురించి పెద్దగా పట్టించుకున్న దాఖలాలు కనబడటం లేదని తప్పు పట్టింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌లు దాఖలు చేసినపుడు హాజరు కావాలని ఉత్తర్వులు ఇస్తే వాటినీ తమ ప్రయోజనాలకు అనుగుణంగా మల్చుకుంటున్నారని ఆక్షేపించింది. తగిన సమయం కోసం చూస్తున్నామని, అప్పుడు కోర్టుకు ఉంటే అధికార ప్రభావం ఏమిటో చూపిస్తామని వార్నింగ్ ఇచ్చింది.

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖాజాగూడలో తమ్మిడి గుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రైవేటు వ్యక్తులకు చెందిన స్థలంలో తమ్మిడిగుంట చెరువు పునరుద్ధరణ పనుల్లో భాగంగా పట్టా భూముల్లో జోక్యం చేసుకోవడంపై వెంకటేశ్వరరావు అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు యథాతథ స్థితి కొనసాగించాలని మధ్యంతర ఆదేశాలిస్తే వాటిని ఉల్లంఘిస్తూ హైడ్రా చర్యలు చేపడుతోందంటూ ఆయన కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ రెండింటినీ కలిపి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారించారు.

గవర్నమెంట్ ప్లీడర్ రాహుల్‌రెడ్డి వాదిస్తూ, పిటిషనర్‌కు చెందిన స్థలం 6 ఎకరాల్లో ఎలాంటి పనులు చేపట్టబోమని, మిగిలిన ప్రాంతంలో పనులు చేపట్టడానికి అనుమతించాలని కోరారు. దీనిపై హైకోర్టు, చెరువుల పునరుద్ధరణ పనులను తాము అడ్డుకోవడంలేదని, ఇటీవల సికింద్రాబాద్ ప్యాట్నీ చెరువు పనుల్లోనూ జోక్యం చేసుకోలేదని చెప్పింది. ఎవరైనా ప్రైవేటు వ్యక్తులు కోర్టును ఆశ్రయిస్తే వర్షాకాలంలో వరదలొస్తున్నాయని చెబుతారని, అయితే నిబంధనల ప్రకారం హడావుడి లేకుండా హైడ్రా ఎందుకు పనులు చేయదని ప్రశ్నించింది. అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని తేల్చి చెప్పింది.. ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి ఓ విధాన నిర్ణయం తీసుకోవాలని సూచన చేసింది. ఎఫ్‌టీఎల్ నిర్ధారణకు ఓ పద్ధతి లేకుండా ఎన్నేళ్లు ఇలా వివాదాలను కొనసాగిస్తారని ప్రశ్నించింది. ఎఫ్‌టీఎల్‌లో ప్రైవేటు పట్టా భూమి ఉంటే భూసేకరణ చట్టం ద్వారా సేకరించడం తప్ప మరో మార్గం లేదని చెప్పింది.తమ్మిడిగుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధికి సంబంధించి దాఖలైన పిటిషన్ తోపాటు కోర్టు ధిక్కరణ పిటిషన్లను సోమవారం విచారిస్తామని ప్రకటించింది.

## ప్రాణహాని ఉంది

(మొదటి పేజీ తరువాయి)

దాడి చేసారని, అందులో ఆనందం పొందారని సావర్కర్ రచనల్లోని ఘటనను ఉటంకిస్తూ అన్నారు. అయితే సాత్యాకీ సావర్కర్ ఆ అంశంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అవి తప్పుడు ఆరోపణలని పేర్కొంటూ రాహుల్ గాంధీపై పరువు నష్టం దావా వేశారు. ఈ కేసులో రాహుల్‌గాంధీకి ముందస్తు భద్రతను ప్రభుత్వం కల్పించాలని ఆయన తరుపున న్యాయవాది మిలింద్ దత్తాత్రేయ పవార్ కోర్టులో దరఖాస్తు దాఖలు చేశారు. ప్రస్తుత కోర్టు కార్యకాలపాలలో నిస్పాక్షికత, నిజాయితీ, పారదర్శకతను పరిరక్షించేందుకు ముందస్తు, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. సాత్యాకీ సావర్కర్ జూలై 29న దాఖలు చేసిన లిఖిత పూర్వక వాంగ్మూలంలో తనకు తల్లి తరుపున నాథూరామ్ గోడ్సే, గోపాల్ గోడ్సేలతో ప్రత్యక్ష వారసత్వం ఉందని పేర్కొన్నారని, వారిరువురు మహాత్మాగాంధీ హత్యలో ప్రధాన నిందుతులు అని పేర్కొన్నారు. అలాగే తనకు వినాయక్ దామోదర్ సావర్కర్ వారసత్వం కూడా ఉందని సాత్యాకీ తెలిపిందన్నారు. ఫిర్యాదుదారురాలి పూర్వీకులలో హింస, రాజ్యాంగ వ్యతిరేక ధోరణులు ఉన్నట్లు చరిత్రలో లిఖించబడిన దాని ఆధారంగా, రాహుల్‌గాంధీ హానీని, తప్పుడు పర్యవసానాలను, లేద ఇతర రకంగా లక్ష్యం అయ్యేందుకు స్పష్టమైన, కనీస, బలమైన ఆందోళనలు ఉన్నాయని దరఖాస్తులో పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రి రణ్‌వీత్ సింగ్ బిట్టూ , మరో బిజెపి నేత తన్వీందర్ సింగ్ తనను దేశంలోనే నంబర్‌వన్ ఉగ్రవాది అని బహిరంగంగా హెచ్చరించారని రాహుల్‌గాంధీ గుర్తు చేశారు. ఈ కేసు తదుపరి విచారణ సెప్టెంబర్ 10న ఉంది.

## నిరసన ర్యాలీలో

(మొదటి పేజీ తరువాయి)

రైతు నల్ల చట్టాలను రద్దు చేయాలనే డిమాండ్లతో దేశవ్యాప్తంగా నవంబర్ 26న జాతీయ సార్వత్రిక సమ్మెను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఉద్యమంలో భాగా ఢిల్లీలో ప్రదర్శనను నిర్వహించనున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఉద్యమ కార్యచరణను కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు ప్రకటించాలని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఈ సందర్భంగఈ నిరసన ర్యాలీలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్లు పశ్యపద్మ, టి.సాగర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదరిశ ఎస్.బాల్‌రాజు, ఎస్.ఎల్ పద్మ,ఎఐటియుసి నాయకులు బి.వెంకటేశం, కమతం యాదగిరి, బొడ్డుపల్లి కిషన్, సిహెచ్. జంగయ్య, అశోక్, మల్లేష్‌గౌడ్, కాశయ్య, కృష్ణ, నర్సయ్య, సిఐటియు, ఐఎఫ్‌టియు, టియుసిఐ నాయకులు ఎస్.ఎల్.పద,అనురాధ, వెకటేశ్వర్లు, వెంకటేష్, రమ తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత సానుకూలం

(మొదటి పేజీ తరువాయి)

ట్రంప్‌తో వర్చువల్‌గా సమావేశమయ్యారు. తరువాత సమావేశ వివరాలను మెర్క్, జెలెన్‌స్కీలు మీడియాకు వివరించారు. తమ సమావేశం సానుకూలంగా జరిగిందని, ట్రంప్–పుతిన్‌ల సమావేశానికి ఎజెండాను సెట్ చేసేందుకు యూరోపియన్‌లు చేయాల్సిందంతా చేసారని మెర్క్ అన్నారు. అలాస్కా సమావేశంలో యూరప్, ఉక్రెయిన్ భద్రతా ప్రయోజనాలను పరిరక్షించాలని ట్రంప్‌ను కోరినట్లు తెలిపారు. శాంతి చర్చల్లో ఉక్రేన్ కూడా ఉండాలని చెప్పామని, ఉక్రేన్‌పై రష్యా యాజమాన్యానికి న్యాయబద్ధమైన గుర్తింపు ఇవ్వొద్దని కోరినట్లు వెల్లడించారు. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని గౌరవించాలన్నారు. శాంతి దిశగా రష్యా అడుగులు వేయకపోతే యూరప్, అమెరికాలు పుతిన్‌పై మరింత ఒత్తిడి తీసుకువస్తాయని మెర్క్ హెచ్చరించారు. పుతిన్‌తో శుక్రవారం శిఖరాగ్ర సమావేశం తరువాత ట్రంప్‌తో యూరప్ నేతలు మరోసారి మాట్లాడుతారని ఆయన తెలిపారు.

### ఉక్రేన్‌ను చర్చల్లో భాగం చేయాలి : జెలెన్‌స్కీ

ఉక్రేన్‌కు సంబంధించిన వ్యవహారం మొత్తాన్ని ఉక్రేయిన్‌తో చర్చించాల్సిందేనని జెలెన్‌స్కీ అన్నారు. తమను చర్చల్లో భాగం చేయాలని కోరామని, ట్రంప్ తమకు మద్దతు తెలిపారని, దానిని కొనసాగించేందుకు అమెరికా సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. నాయకులందరూ ఉక్రేన్‌లో శాంతిని కోరుకుంటున్నారని అన్నారు. కాల్పుల విరమణకు అంగీకరించకపోతే రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలని తాము కోరుకుంటున్నామని అన్నారు. పుతిన్ బుకాయిస్తున్నాడని, ఉక్రేన్ మొత్తాన్ని ఆక్రమిస్తామన్నట్లుగా నటిస్తున్నాడని అన్నారు. పుతిన్‌తో భేటీ తరువాత తనతో సంప్రదిస్తానని ట్రంప్ చెప్పారని అన్నారు. ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన తరువాతా తాను ఎంతో సానుకూలంగా ఉన్నానని జెలెన్‌స్కీ తెలిపారు. పుతిన్, ట్రంప్‌ల సమావేశాన్ని తాను చారిత్రాత్మక ఘట్టం అనబోనని, ఫలితం కోసం వేచి చూస్తానని అన్నారు.

### ఉక్రేయిన్ నాశనం కోసం జెలెన్‌స్కీ పోరు: రష్యా

వొలొదిమిర్ జెలెన్‌స్కీ రష్యాతో పోరాటం చేయడం లేదని, ఆయన ఉక్రేన్ ప్రజలకు వ్యతిరేకంగా ఆ దేశాన్నే నాశనం చేయడం కోసం పోరాడుతున్నారని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మారియా జఖారోవా అన్నారు. ఎవరో చెప్పినట్లుగా ఉక్రెయిన్ దేశాన్ని, జాతీయవాదం, జాతీయ అస్థిత్వం పేరుతో భౌతికంగా నాశనం చేసే విధంగా జెలెన్‌స్కీ మిషన్ సాగుతోందని విమర్శించారు. వెయ్యి మంది ఉక్రేన్ యుద్ధ ఖైదీలను స్వీకరించేందుకు ఉక్రేన్ నిరాకరించిందని, వారికి ఉక్రెయిన్ ప్రజలు సజీవంగా లేదా నిర్జీవంగానైనా అవసరం లేదని స్పుత్నిక్ రేడియోలో మాట్లాడుతూ అన్నారని టాస్ సంస్థ పేర్కొంది.

## పికప్ వ్యాన్, కంటైనర్ ఢీ

(మొదటి పేజీ తరువాయి)

కంటైనర్‌ను బలంగా ఢీకొట్టింది. వీరంతా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఖాటు శ్యామ్ ఆలయంలో దర్శనం ముగించుకుని ఇంటికి వస్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సహాయక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనలో గాయపడిన వారిని సమీపంలోని ఎస్ఎంఎస్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ దీపక్ మహేశ్వరి, అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ గిర్ధర్ గోయల్ ఆసుపత్రికి చేరుకున్నారు. గాయపడ్డవారిలో కొంత మంది పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని జైపుర్‌కు తరలించారు. కాగా వీరంతా ఉత్తర్‌ప్రదేశ్ నివాసితులని పోలీసులు గుర్తించారు. అయితే ప్రమాద ధాటికి పికప్ వ్యాన్ పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. చాలా మంది ప్రయాణికులు అందులో చిక్కుకున్నారు. సహాయక సిబ్బంది తీవ్రంగాశ్రమించి వారందరిని బయటకు తీశారు.

### ప్రాణనష్టం బాధాకరం: సిఎం భజన్‌లాల్ శర్మ

మరోవైపు, రోడ్డు ప్రమాదంపై రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ విచారం వ్యక్తం చేశారు. దౌసాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణనష్టం జరిగిందనే వార్త చాలా బాధాకరమన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని తాను ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. మరో వైపు ఉత్తర్‌ప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ కూడా సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన సానుభూతి తెలిపారు. గాయపడినవారు త్వరగాకోలుకోవాలని ఆకాంక్షించారు. రాజస్థాన్ ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు సిఎం కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com